WWW.SAKSHYAM.COM

ప్రజాహితమే మా అభిమతం

# సాక్ష్యం


తెలుగు దినపత్రిక

Telangana

హైదరాబాద్
ఆదివారం, 23 ఫిబ్రవరి 2025
Published from Hyderabad, Karim nagar & Nalgonda, Vijayawada.

సంపుటి: 16 | సంచిక: 53
పేజీలు: 08 | వెల: రూ.2:00

శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గంలో ప్రమాదం చోటు చేసుకుంది. నాగర్ కర్నూలు వద్ద సొరంగంలో ఏర్పాటు చేసిన రింగ్‌లు కిందపడటంతో పైకప్పు కూలి సొరంగంలో 8 మంది కార్మికులు చిక్కుకుపోయారు. వీరిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు ఘటనా స్థలికి చేరుకుని సహాయకచర్యలు పర్యవేక్షిస్తున్నారు. టన్నెల్ 14వ కిలోమీటర్ వద్ద... సొరంగంలో.. 3 మీటర్ల మేర పైకప్పు కూలింది. దీంతో ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఉదయం షిఫ్ట్ లో సొరంగంలో పనులకు 50 మంది లోపలికి వెళ్లారు. ఒక్కొక్కరిగా 42 మంది సొరంగం నుంచి కార్మికులు బయటకు వచ్చారు. మరో 8 మంది సొరంగంలో చిక్కుకుపోవడంతో... వారిని బయటకు తీసుకువచ్చేందుకు రక్షణ చర్యలు చేపట్టారు. కూలీలు పంజాబ్ , జమ్మూకశ్మీర్ , యూపీ వాసులుగా గుర్తించారు. సొరంగంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎడమవైపు సొరంగం వద్ద 4 రోజుల కిందటే మళ్లీ పనులు మొదలయ్యాయి.



## యుద్ధం ఆగాలంటే జెలెన్ స్కీ, పుతిన్ కలవాలి

లక్షల చావులు ఆగాలంటే కలిసి తీరాలి

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై ట్రంప్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి22(సాక్ష్యం): ఉక్రెయిన్-రష్యా యుద్ధం మూడేళ్లు దాటినా ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ యుద్ధంలో ఉక్రెయిన్ భారీగా నష్టపోయింది. ఎంతో అందంగా ఉండే ఉక్రెయిన్ శ్మశానాన్ని తలపిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం ఆగిపోవాలంటే ఉక్రెయిన్

మిగతా 2 లో..



## విమర్శలు మానుకోండి

కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టండి

నీళ్లు లేక వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి

సీఎం రేవంత్ రెడ్డికి మాజీ ఎంపీ వినోద్ కుమార్ లేఖ

హైదరాబాద్,ఫిబ్రవరి22(సాక్ష్యం): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సీనియర్ నేత

మిగతా 2 లో..

# టన్నెల్‌లో ప్రమాదం

## శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్ వద్ద భారీ ప్రమాదం

## సొరంగ పనులు చేపడుతుండగా కూలిన పైకప్పు

ఏడుగురు కార్మికులకు తీవ్ర గాయాలు

ఆస్పత్రికి తరలించి చికిత్స

సీఎం రేవంత్ దిగ్భ్రాంతి.. హుటాహుటిన ఉత్తమ్ చేరిక



### టన్నెల్ ప్రమాద ఘటనపై ప్రధాని ఆరా

- సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్‌చేసి తెలుసుకున్న మోడీ
- టన్నెల్ ప్రాంతంలో సహాయక చర్యలు
- అక్కడే ఉండి పరిశీలిస్తున్న మంత్రులు

హైదరాబాద్,ఫిబ్రవరి22(సాక్ష్యం): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనపై ప్రధాని మోడీ ఆరా తీశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను రేవంత్‌రెడ్డి.. ప్రధానికి వివరించారు. సొరంగంలో ఎనిమిది మంది చిక్కుకున్నారని, వారిని కాపాడేందుకు సహాయక చర్యలు చేపట్టినట్టు తెలిపారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూలు,ఫిబ్రవరి22(సాక్ష్యం): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలో శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్ వద్ద ఈ భారీ ప్రమాదం చోటుచేసుకుంది. శనివారం ఉదయం 8:30 గంటల సమయంలో మూడుమీటర్ల మేర పైకప్పు కూలిపోయిన ఘటనలో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. టన్నెల్ పనులు జరుగుతున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించడంతో ప్రాజెక్టు పరిసరాల్లో తీవ్ర కలకలం రేగింది. ఎడమవైపు సొరంగ పనులు జరుగుతుండగా, 14వ కిలోమీటర్ వద్ద ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో మూడు మీటర్ల మేర పైకప్పు పడిపోయింది. ఎడమవైపు సొరంగం 14వ కిలోమీటర్ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఇటీవల ప్రభుత్వం పనులను తిరిగి ప్రారంభించింది. ఇందులో భాగంగా నాలుగు రోజుల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఉదయం ఆ పనుల్లో ప్రమాదం చోటుచేసుకుంది. టన్నెల్ పైభాగంలో మూడు మీటర్ల మేర పడిపోయింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలో పనులు జరుగుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అధికారులు ఘటనాస్థలికి వెళ్లి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

మిగతా 2 లో..



## కులగణనతో బీసీల భవిష్యత్ అంధకారం

### గ్యారంటీలు అమలు చేయకుండా కాలయాపన

### కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ కిషన్‌రెడ్డి

నిజామాబాద్,ఫిబ్రవరి22(సాక్ష్యం): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తుందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆరోపించారు . శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన వల్ల రానున్న కాలంలో బీసీల భవిష్యత్ అంధకారంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కులగణనపై తమతో చర్చకు వస్తామని కాంగ్రెస్ చెప్పడం హాస్యస్పదంగా ఉందని పేర్కొన్నారు. తాము చర్చలకు సిద్ధంగానే ఉన్నామని, దానికి ముందు వారు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చిన అనంతరం తమతో చర్చలకు రావాలని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా కాలయాపన

మిగతా 3 లో..

## ఒక్కరోజే 1.29 కోట్ల మంది భక్తులు స్నానాలు

### ఇప్పటివరకు మొత్తం 60.2 కోట్లకు పైగా భక్తులు రాక

### శివరాత్రికి భారీగా ఏర్పాట్లు చేసిన యూపి ప్రభుత్వం



ప్రయాగ్‌రాజ్,ఫిబ్రవరి22(సాక్ష్యం): ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాకు దేశంతోపాటు ప్రపంచం నలుమూలల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివస్తున్నారు. ఈ క్రమంలోనే మరో అరుదైన రికార్డుకు చేరువైంది. శనివారం ఫిబ్రవరి 22న సాయంత్రం 6 గంటల వరకు 1.29 కోట్ల మంది భక్తులు స్నానాలు ఆచరించారు. దీంతో ఇప్పటివరకు మొత్తం 60.2 కోట్లకు పైగా భక్తులు సంగమంలో పుణ్య స్నానాలు చేసినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. అంతేకాదు ఫిబ్రవరి 26 నాటికి ఈ భక్తుల సంఖ్య 65 కోట్లకు పైగా చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే చివరి రోజుకు మరో నాలుగు రోజుల సమయం ఉంది. ఈ క్రమంలో ముఖ్యంగా శివరాత్రి చివరి పవిత్ర స్నానోత్సవం కోసం భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శనివారం సంగమంలో పవిత్ర స్నానం చేశారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్,

మిగతా 3 లో..



# పారదర్శకంగా కులగణన

## కులగణన రాహుల్ ఇచ్చిన అవకాశం

- నూటికినూరు శాతం ఖచ్చితమైన సర్వే ఇది
- కాంగ్రెస్ శ్రేణులు దీనిని అవకాశంగా తసుకోవాలి
- విపక్షాల విమర్శలను ధీటుగా తిప్పికొట్టాలి
- కాంగ్రెస్ బీసీ నేతల సమావేశంలో సీఎం రేవంత్ స్పష్టీకరణ

హైదరాబాద్,ఫిబ్రవరి22(సాక్ష్యం): బీసీ కులగణన సర్వే చేపట్టడం ద్వారా చారిత్రాత్మకమైన నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కులగణన విషయంలో భవిష్యత్‌లో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రాహుల్ గాంధీ మనకు ఇచ్చిన అవకాశం ఇదని, దీనిని ప్రజల్లోకి తీసుకుని వెళ్లి విపక్షాల విమర్శలను ధీటుగా తిప్పికొట్టాలన్నారు. కేవలం అంతా సిఎం రేవంత్ చూసుకుంటారని అనుకుంటే కుదరదని అన్నారు. ప్రతి ఒక్కరూ కులాల వారీగా మీటింగ్‌లు పెట్టి ప్రజలకు వివరించాలన్నారు.

మిగతా 2 లో..

రాష్ట్రంలో దాదాపు 25 రోజులు పాటు రాహుల్‌గాంధీ తెలంగాణలో పాదయాత్ర చేశారని.. ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చారని రేవంత్ గుర్తు చేశారు. రాహుల్ గాంధీ మాట ఇచ్చిన తర్వాత ప్రజలు మనకు అధికారం ఇచ్చారని.. అధికారిక కార్యాచరణకు అధికార బృందాన్ని వేశామన్నారు. కులగణనలో మూడు రోజులు ఇండ్ల వివరాలు సేకరించామని.. ప్రభుత్వంలోని 15 శాఖలకు చెందిన అధికారులను నియమించామన్నర్నా. మొత్తం 8పేజీలో ఇంటి యజమాని ఇచ్చిన సమాచారాన్ని సేకరించాం. 36 వేల మంది డేటా ఆపరేటర్లను అదనంగా నియమించామని తెలిపారు. ఎన్‌రోలర్‌గా సమాచారం సేకరించిన వారే డేటా ఎంట్రీ చేశారు. దాదాపు కోటి 12 లక్షలకు పైగా కుటుంబాలు కులగణనలో పాల్గొన్నాయి.

## సొరంగ ప్రమాదానికి బాధ్యత రేవంత్‌దే

- రక్షణ చర్యలు లేకుండా పనులు చేపట్టారు
- భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
- ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమన్న హరీష్‌రావు

హైదరాబాద్,ఫిబ్రవరి22(సాక్ష్యం): ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద జరిగిన ప్రమాదానికి పూర్తి బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సుంకిశాలలో రీటైనింగ్ వాల్ కుప్పకూలిన ఘటన మరువకముందే రాష్ట్రంలో మరో దుర్ఘటన జరగడం కాంగ్రెస్ సర్కారు వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. గుత్తేదార్లతో కుమ్మక్కై, కమీషన్ల వేటలో పర్యవేక్షణ గాలికి వదిలేయడం, నాణ్యతా ప్రమాణాల విషయంలో పూర్తిగా రాజీపడటం వల్లే ఇలాంటి ఘటనలు జరుగు తున్నాయని ఆరోపించారు. చిక్కుకుపోయిన కార్మికులను క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు

మిగతా 3 లో..

## తెలంగాణ పరువు తీస్తున్న రేవంత్ రెడ్డి

### యాక్సిడెంటల్ సీఎం అంటూ విమర్శలు

### దమ్ముంటే ఏడాది పాలనపై అసెంబ్లీలో చర్చ చేద్దాం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్

హైదరాబాద్,ఫిబ్రవరి22(సాక్ష్యం): కాంగ్రెస్ ఏడాది పాలనపై అసెంబ్లీలో చర్చించేందుకు సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశారు.తెలంగాణ ఆర్థిక స్థితిపై అసెంబ్లీలో చర్చకు పెట్టాలని డిమాండ్ చేశారు. సభ సాక్షిగా నాలుగు కోట్ల ప్రజల ముందు సీఎం రేవంత్ బట్టలు విప్పుతామని హెచ్చరించారు. పాలన చేతకాని సన్యాసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని విరుచుకుపడ్డారు. సీఎం రేవంత్.. అచ్చోసిన ఆంబోతు

మిగతా 3 లో..

# సంపాదకీయం

## మన దేశ వ్యవహారాల్లో వేలు పెడుతున్నదెవరు ?

స్వాతంత్ర్యానంతరం మనం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాం. ఇటీవల మళ్లీ అలాంటి కుయుక్తులు సాగుతున్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. మనదేశ అంతర్గత వ్యవహారాల్లో బైడెన్ ప్రభుత్వం జోక్యం చేసుకున్నట్లు వెల్లడయ్యింది. అదికూడా ఎన్నికల వ్యవహారంలో తలదూర్చి నిధులు కేటాయించినట్లుగా తెలుస్తోంది. ఇక్కడ ఓ విషయం గమనిస్తే..కాంగ్రెస్ నేత రాహుల్ గతంలో అమెరికాలో పర్యటించారు. ఆయన అక్కడే ఉండి మనదేశ అంతర్గత వ్యవహారాలపై అనేకం మాట్లాడారు. ఆ తరవాతే ఆదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ నివేదిక వచ్చింది. ఇప్పుడు ట్రంప్ మరో బాంబు పేల్చారు. ఈ రెంటికీ ఏమైనా సంబంధం ఉందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. వీటిని జాగ్రత్తగా గమనిస్తే అనుమానాలు ఉన్నట్లు రాజకీయ నిపుణులు కూడా భావిస్తున్నారు. అయితే అంతర్గ వ్యవహారాల్లో దూరి దేశాన్ని అస్థిరపరచాలన్న చీప్ ట్రిక్స్ ఆడారా అన్నది ముమ్ముందు తేలనుంది. భారత్, అమెరికాలు ప్రపంచంలో రెండు అతి పెద్ద ప్రజాస్వామిక దేశాలు మాత్రమే కాదు, అగ్రగామి ఆర్థిక వ్యవస్థలు కూడా. ఆర్థిక సత్తాలో ప్రథమ స్థానంలో ఉన్న అమెరికా, ఐదవ స్థానంలో ఉన్న భారత్ మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడడం ప్రపంచానికీ అత్యంత ప్రయోజనకరంగా మారనుంది. అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్‌ను అమెరికా వదులుకోవడానికి సిద్దంగా లేదు. అలాగే అనేకమంది మన మేధావులు ఇప్పుడు అమెరికన్ ఐటిని శాసిస్తున్నారు. గతంలో మోదీ పర్యటనతో భారతీయ అమెరికన్లలో ఒక రకమైన ఆత్మ స్థైర్యం, బలం ఏర్పడిందనడంలో సందేహం లేదు. అమెరికా జనాభాలో ఒక శాతంగా ఉన్న భారత అమెరికన్లు ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు అస్థిరపరచే చర్యలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇలాటి వారిపై కఠినంగా ఉండాల్సిందే. నిజానికి మనం ఏ దేశంలోనూ వేలుపెట్టే అవకాశం తెచ్చుకోం. ఇతరులు జోలికి వస్తే ఊరుకోం. ఏ దేశానికైనా పటిష్టమైన విదేశాంగ విధానం ఉండాలి. ప్రపంచ దేశాల్లో ఇదే ముఖ్యం. ఇతర దేశాలు కష్టసమయాల్లో ఉంటే ఆదుకోవాలి. అన్నార్తులను ఆదుకునే ప్రయత్నం చేయాలి. ఇరుగుపొరుగుతో ఇచ్చిపుచ్చుకునే ధోరణి ముందునుంచీ మనం పాటిస్తున్నాం. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూనే..సర్వస్వతంత్రంగా మనగలగేలా మన గత పాలకులు, ప్రస్తుత పాలకులు వ్యవహరిస్తున్నారు. గతంలో పాక్ మంత్రులు పలువురు ఇలాగే ప్రేలారు. తల్లిపాలు తాగి రొమ్ముగుద్దే రకంలో పాక్ ముందుంటుంది. ఇప్పుడు బంగ్లా తోడయ్యింది. బిబిసి కూడా అడపాదడపా తన కుట్రలను వెల్లడిస్తోంది. మొన్నటికి మొన్న మాజీ చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ ఇంటర్వ్యూలో కూడా బిబిసి అడిగిన ప్రశ్నలు దాని కుత్సిత స్వభావాన్ని బయటపెట్టాయి. ఆదానీ విషయంలో కూడా అమెరికా హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలను గుర్తించాల్సిందే. దేశంలో మనం నిలదీయాల్సిన సమస్యల్లో విదేశీయులను తలదూర్చేలా చేయడం వల్ల అంతర్జాతీయంగా మనపరువును మనమే పోగొట్టుకున్న వారం అవుతాం. నిజానికిమోదీ హయాంలో ప్రపంచ దేశాల్లో భారత్‌కు లభించినంత గుర్తింపు మరే ప్రధానమంత్రి హయాంలో లభించలేదన్న విషయం ఎవరైనా గుర్తించాల్సిందే. కరోనా సమయంలో అనేక పేద దేశాలకు ఉచితంగా వ్యాక్సిన సరఫరా చేసి వారికి అండగా నిలిచారు. అలాగే టర్కీ, సిరియా భూకంప బాధితులకుఅండగా నిలిచిన మన బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. గత పదేళ్లలో మోదీ ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలలోనూ పర్యటించి భారత్‌కు అంతర్జాతీయంగా అనితరసాధ్యమైన గుర్తింపు తీసుకుని వచ్చారు. ఏదేశమేగినా మోడీ గురంచి చర్చించుకునేలా చేశారు. విదేశాగ విధానంలో మోడీ కొత్త ఒరవడిని సృష్టించారు. అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాలతోపాటు చైనాతో కూడా సత్సంబధాలు నెలకొల్పడంలో మోడీ విజయం సాధించారు. చిన్నిచిన దేశాలకు ఆపన్నహస్తం అందించడం ద్వారా భారత్ వారికి అండగా నిలుస్తుందన్న భరోసా ఇచ్చారు. భారతదేశంలో విచ్ఛిన్నకర శక్తులను ఏరివేయడం, కశ్మీర్‌లో పాక్ ఉగ్రవాదానికి కళ్లెం వేయడం వెనుక ప్రపంచ దేశాల అండదండలున్నాయని,మోదీ వివిధ దేశాధినేతలతో ఏర్పర్చుకున్న సత్సంబంధాల వల్లే ఇవాళ మనకు అంతర్జాతీయ మద్దతు లభిస్తున్నదని విదేశీ వ్యవహారా లను పరిశీలించే వారెవరికైనా అర్థమవుతుంది. పాక్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించడం, ఇస్లామిక్ దేశాలు కూడా ఆ దేశానికి మద్దతు నీయకపోవడం, అంతర్జాతీయంగా పాకిస్థాన్ ఏకాకి కావడం మొదలైన పరిణా మాలు భారత్‌కు అంతర్జాతీయంగా ఉన్న పట్టును సూచిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా అండదండలు బలంగా లభించాయని స్పష్టమవుతోంది. ప్రపంచంలో మోడీ సమర్థ నేతగా ఎదగడం వల్లనే అనేక దేశాలు ఇప్పుడు భారత్‌వైపు చూస్తున్నాయి. ఈ రకమైన మద్దతు ద్వారా మనదేశ ప్రతిభ విస్తరించడమే గాకుండా ప్రపంచంలో మనకు పెద్దన్న పాత్రను కట్టబెడుతున్నాయి. ప్రధానంగా ఇస్లామిక్ టెర్రరిజంపై పోరాడుతున్న దేశంగా భారత్‌తో కలసి అనేక దేశాలు ముందుకు వస్తున్నాయి. అందులో అమెరికా కూడా ఉంది. అందుకే అమెరికాలో మోదీ పర్యటించినప్పుడల్లా ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది. ఇరు దేశాల్లో గతంలో ఎన్నడూ లేనంత చెలిమి నెలకొంది. ముఖ్యంగా మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత భారత్ – అమెరికాల మధ్య సాన్నిహిత్యం మరింత పెరిగింది. భారత్, అమెరికా ప్రభుత్వాధినేతల మధ్య ఎన్నడూ లేని రీతిలో దృఢంగా వున్నాయి.ఉగ్రవాదం,ఆర్థిక అసమానతలు, రక్షణ సహకారం,ఇంటెలిజెన్స్ సమాచార పంపిణీ, పర్యావరణం, సైబర్ నేరాలు, ఇంధన భద్రత, కమ్యూనికేషన్ విప్లవం, వర్తక సంబంధాలు, పెట్టుబడులు, మార్కెట్ విస్తరణ, ఉపాధి కల్పన వంటి అనేక విషయాలపై అమెరికా భారత్‌లు ఒక స్పష్టమైన అవగాహనతో ఉన్నాయి. ఉగ్రవాదాన్ని కలిసికట్టుగా నిర్మూలించడం ఎంత ముఖ్యమో, ప్రపంచ మార్కెట్‌లో చైనా దూకుడు తగ్గించడం కూడా అంతే ముఖ్యమని ఇరు దేశాలు భావిస్తున్నాయి. అమెరికా,చైనా దేశాల మధ్య పెరుగుతున్న స్పర్థలు, వాణిజ్య పోటీ భారత్‌కు ఎంతో ఉపకరిస్తుందనడంలో సందేహం లేదు. అంతేకాక అమెరికా టెక్నాలజీ సంస్థలకు భారత్‌లో లభిస్తున్న అతి పెద్ద వినియోగ మార్కెట్, బహిరంగ డేటా వరప్రదాయినిగా కనిపిస్తోంది. టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులను వినియోగించుకోకపోతే ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదని అందరికీ తెలుసు. ఈ క్రమంలో ఎలాంటి సవాళ్లనయినా తిప్పికొట్టగలగాలి.

# టన్నెల్‌లో ప్రమాదం

మొదటిపేజీ తరువాయి..

ఈ ఘటనలో ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. వీరిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. శ్రీశైలం ప్రాజెక్టు వెనుక జలాల నుంచి టన్నెల్ ద్వారా వెనుకబడిన నల్గొండ జిల్లాకు సాగు, తాగు నీరందించేందుకు ఈ ప్రాజెక్టు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలో సొరంగ మార్గం నిర్మిస్తున్నారు. ఆ పనుల్లో మొదటి షిఫ్ట్‌లో సుమారు 50 మంది కార్మికులు సొరంగంలోకి వెళ్లారు. ఉదయం 8.30 గంటల సమయంలో కార్మికులు పని చేస్తుండగా.. ఆకస్మాతుగా పైకప్పు కూలి మట్టిపెల్లలు విరిగి పడ్డాయి. దీంతో కార్మికులు భయాందోళనకు గురయ్యారు. వారిలో 42 మంది బయటకి రాగా.. 8 మంది కార్మికులు లోపల చిక్కుకున్నట్లు సమాచారం. ఘటనాస్థలి వద్ద నీటిపారుదల శాఖ అధికారులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. టన్నెల్‌లో పైకప్పు కూలి కార్మికులు గాయడిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీ, అగ్నిమాపక శాఖ, హైడ్రా, నీటిపారుదల శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. విషయం తెలుసుకున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెంటనే ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఘటనాస్థలికి చేరుకున్నారు. సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. ఉత్తమ్ వెంట నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, అధికారులు ఉన్నారు. ఈ ప్రమాదంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం ఎలా జరిగిందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. లోపల చిక్కుకున్న వారిని క్షేమంగా తీసుకురావాలని.. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. గమనించదగిన విషయం ఏమిటంటే, ఈ టన్నెల్‌లో నాలుగు రోజుల క్రితమే ఎడమవైపు పనులు ప్రారంభమయ్యాయి. అయితే, ఎంతో త్వరగా ఈ ప్రమాదం జరగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. టన్నల్ బోర్ మెషిన్‌తో డ్రిల్లింగ్ జరుగుతుండగా, కార్మికులు ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదం జరిగిన క్షణాల్లో టన్నెల్ లోపల పనిచేస్తున్న కార్మికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. భారీ శబ్దం రావడంతో సమీపంలోని కార్మికులు అప్రమత్తమై లోపలికి పరుగెత్తారు. అప్పటికే పైకప్పు కూలిపోవడంతో ఏడుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. ప్రభుత్వం టన్నెల్ నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేయాలనే లక్ష్యంతో ఇంజినీర్లపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఏడాదిలోపు పనులు ముగియాలన్న లక్ష్యంతో ఇరిగేషన్ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు. అయితే, ఇలాంటి తక్షణ ప్రాజెక్ట్‌లలో పనుల నాణ్యతను విస్మరించడం ప్రమాదాలకు దారితీసే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే ఇరిగేషన్ అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్న దానిపై వారు సమగ్ర విచారణ చేపట్టారు. పనుల్లో ఎక్కడ తప్పుదొర్లిందో అంచనా వేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ ప్రమాదం తర్వాత టన్నెల్ వద్ద పనిచేస్తున్న కార్మికుల్లో భయం నెలకొంది. బాధిత కార్మికుల కుటుంబ సభ్యులు కూడా భద్రతా చర్యల పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖ అధికారుల నుండి మరిన్ని వివరాలు రావాల్సి ఉంది. ఈ ప్రమాదానికి నిజమైన కారణం ఏంటనే దానిపై త్వరలో స్పష్టత రానుంది.





# పారదర్శకంగా కులగణన

మొదటిపేజీ తరువాయి..

దాదాపు 25 రోజుల పాటు తెలంగాణలో పాదయాత్ర చేశారని.. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొని సోనియాగాంధీ తెలంగాణను ఇచ్చారన్నారు. రాహుల్ గాంధీ మాట ఇచ్చిన తర్వాతే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారని సీఎం అన్నారు. రాహుల్ గాంధీ ఆశయం మేరకే సమగ్రమైన కులగణన చేపట్టామన్నారు. ఈ మేరకు బీసీ కులగణన సర్వేపై అనుమానాల నివృత్తిపై ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.బిసి సంగాల నేతలతో ఆయన మాట్లాడారు. విపక్షాల తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని భాగస్వామ్యం చేస్తూ పూర్తి పారదర్శకంగా సర్వే చేపట్టాం. అధికారిక కార్యచరణకు అధికార బృందాన్ని వేశాం. బిహార్, కర్ణాటక సహా వివిధ రాష్ట్రాల్లోఅధ్యయనం చేశాం. కులగణనలో మూడు రోజుల పాటు ఇళ్ల వివరాలు సేకరించాం. ఇందుకోసం ప్రభుత్వంలోని 15 శాఖలకు చెందిన అధికారులను నియమించాం. మొత్తం 8 పేజీలతో ఇంటి యజమాని ఇచ్చిన సమాచారాన్ని సేకరించాం. 36 వేల మంది డేటా ఆపరేటర్లను అదనంగా నియమించాం. ఎన్‌రోలర్‌గా సమాచారం సేకరించిన వారే డేటా ఎంట్రీ చేశారు. దాదాపు కోటి 12 లక్షలకుపైగా కుటుంబాలు కులగణన సర్వేలో పాల్గొన్నాయని వివరించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కులగణన ప్రయత్నమే చేయలేదు. న్యాయపరంగా, చట్టపరంగా నిబంధనలకు లోబడి చేశాం. 96.9 శాతం జరిగింది... 3.1 శాతం సర్వే రాలేదు. ఇంత పారదర్శకంగా కులగణన చేపడుతున్నా కొంత మంది నాయకులు ఇంకా చేయించుకోలేదు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో 4 విభాగాలుగా జనాభా శాతాన్ని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వేలో 5 కేటగిరీలున్నాయి. ముస్లింలలో ఓబీసీలను నాడు కేసీఆర్ ప్రభుత్వం విడిగా చెప్పలేదన్నారు. గుజరాత్‌లో కూడా ఓబీసీ ముస్లింలు ఉన్నారని ప్రధాని చెప్పారు. బీసీల లెక్క తేలితే మాకేంటి.. అని ఆ వర్గం అడుగుతారని భాజపా, భారాస భయపడుతోంది. దేశవ్యాప్తంగా కులగణన చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడుతుంది. రాహుల్ గాంధీ ప్రధాని అయితే.. అన్ని రాష్ట్రాల్లో కులగణన జరిగితీరుతుంది. కులగణనను కాపాడుకోకపోతే.. బీసీలే నష్టపోతారు. ఇంత పకడ్బందీగా సర్వే చేసిన రాష్ట్రం ఇకపై కూడా మరొకటి ఉండదని సీఎం అన్నారు. నివేదిక ఆధారంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలో సూచనలు ఇవ్వాలని బీసీ సంఘాల నేతలను కోరారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ కార్యాచరణపై సూచనలివ్వాలని కోరారు. బీసీ జనాభా ప్రకారం వారికి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. కేసీఆర్ ,కేటీఆర్, హరీశ్ రావు జనాభా లెక్కల్లోనే లేరన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఇన్ని అవకాశాలు ఇచ్చిన.. వాళ్లు కులగణన సర్వేలో పాల్గొనలేదన్నారు. కులగణన సర్వే లెక్క తప్పైతే ఎట్ల తప్పో వచ్చి చూపించాలన్నారు. ప్రతిపక్షాలు మొండిగా..తొండిగా వాదిస్తున్నారని సిఎం రేవంత్ విమర్శించారు. కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే తప్పుల తడక అని అందుకు సర్వే వివరాలు బయటపెట్టలేదన్నారు. కేసీఆర్ చెప్పిన లెక్కల ప్రకారం బీసీలు తగ్గారు..ఓసీలు పెరిగారని చెప్పారు. కాకి లెక్కలు చెప్పి జనాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు రేవంత్. కులగణన సర్వే తెలంగాణ దేశంలోనే తెలంగాణ రోల్ మోడల్ నిలుస్తోందన్నారు . దేశమంతా కులగణన చేయాల్సి వస్తుందని బీజేపీ భయపడుతోందన్నారు. కులగణన నూటికి నూరు శాతం పక్కా అని సీఎం రేవంత్ అన్నారు.కులగణన చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. బీసీ సంఘాలతో భేటీ అయిన రేవంత్ రెడ్డి.. కులగణనలో తెలంగాణ దేశంలోనే రోల్ మోడల్ గా నిలువబోతుందన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దన్నారు. సర్వే తప్పు అయితే..ఎట్ల తప్పో చూపించాలని బీజేపీ,బీఆర్ఎస్ కు సవాల్ విసిరారు. కుట్రలో భాగంగానే బీజేపీ,బీఆర్ఎస్ కులగణన సర్వేపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కులగణన లెక్కలు తప్పు కాదని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కులాల వారీగా సమావేశాలు నిర్వహించి కులగణన లెక్క పక్కా అని మార్చి 10 లోగా తీర్మానం చేయాలని సూచించారు. ఇకపోతే బీసీ నేతల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఫైరయ్యారు. పార్టీ నేతలకు ముఖ్యమంత్రి క్లాస్ పీకారు. నేను చేసేది చేసినా.. ఇక మీ ఇష్టం అని నేతలకు సూచించారు. రాహుల్ గాంధీ మనకు ఇచ్చిన ఆస్తి సర్వే.. కర్ర పట్టుకుని కాపాడుకుంటారో లేదో మీ ఇష్టం అని అన్నారు. సర్వే చేసినా నన్ను తిడుతున్నారు.. సర్వేలో కూడా పాల్గొనని వాళ్ళను మంచోడు అంటున్నారని తెలిపారు. సర్వేలో పాల్గొనని వాళ్ళ ఇంటి ముందు డప్పు కొట్టండి.. బలహీన వర్గాల నేతలు కులాల వారిగా సమావేశాలు పెట్టండని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బీసీల కోసం సర్వే చేసిన అని తనకు గర్వంగా ఉందని తెలిపారు. తాను తల ఎత్తుకుని తిరిగే పని చేశానన్నారు.. సర్వే బలహీన వర్గాల భావోద్వేగం.. మీరు కలిసి రండి అని అన్నారు. మిగిలిన విషయాల్లో విభేదించినా ఇబ్బంది లేదు.. కానీ కుల గణన విషయంలో మాత్రం తనకు సహకరించండని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మార్చి 10 లోపు అన్ని సంఘాలతో మీటింగులు పెట్టి చెప్పండి.. ఈ లెక్కలు కాదు.. కూడదు అని అంటే జీవితంలో మళ్ళీ అవకాశం రాదని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నివేదికను అనాధ చేయకండి.. ఎవరి కులం వారు ఆ సంఘాల సమావేశం పెట్టండని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ నేతలకు సూచించారు. కేసీఆర్ సర్వే ఎంత గొప్పగా ఉందో ఎస్సీ, ఎస్టీ ఉప కులాల లెక్క చూస్తే అర్థం అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. సమగ్ర సర్వేలో ఎస్సీలలో 82 కులాలు అని చెప్పారు.. ఎస్సీ, ఎస్టీ ఉప కులాల సంఖ్య పెరిగింది. సమగ్ర సర్వే అర్థం పర్థం లేని లెక్కలు. సిగ్గుతో బయట పెట్టలేదు. బీఆర్ఎస్, బీజేపీ కోర్టుకు వెళ్లి బీసీ కుల గణన ఆపాలని చూస్తున్నాయి. అందుకే లెక్క సరిగ్గా.. ఆధారాలతో సహా చేశాం. కంప్యూటర్ లోనే కాదు.. సర్వే చేసిన పేపర్ బండిల్ కూడా సిద్ధంగా ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమావేశంలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, విహెచ్, మంత్రులు భట్టి, పొన్నం తదితరులు పాల్గొన్నారు.



# విమర్శలు మానుకోండి

మొదటిపేజీ తరువాయి..

వినోద్ కుమార్ బహిరంగ లేఖ రాశారు. మేడిగడ్డ బ్యారేజీకి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆ లేఖలో కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇకనైనా విమర్శలు మానుకొని, పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. నీళ్లు లేక వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డతో సంబంధం లేకుండా ప్రాణహిత నుంచి నీటిని ఎత్తిపోసి పంటలకు నీరు అందించాలన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టుకు యాసంగి పంటకు నీళ్లివ్వలేమని గత డిసెంబర్‌లో అధికారులతో ప్రకటన చేయించారని, ఇది ప్రభుత్వ వైఫల్యమేనని వినోద్ కుమార్ అన్నారు. ఇప్పుడేమో రైతు సమితి చైర్మన్ కోదండరెడ్డి పంటలు వేయవద్దని రైతులకు సూచించడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని నీటి సరఫరా వ్యవస్థపై అధికార పార్టీ నాయకులకు అవగాహన లేదని, అందుకే కాళేశ్వరం ప్రాజెక్టు లేకపోయినా పంట దిగుబడి సాధించామని చెబుతున్నారని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాక మొదటి పదేళ్లు రికార్డుస్థాయిలో పంట దిగుబడిని పెంచితే, కాంగ్రెస్ ఏడాది పాలనలో పంటలకు నీళ్లు ఇవ్వలేని పరిస్థితికి చేరుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు యజమానిగా తెలంగాణ ప్రభుత్వం మరమ్మతులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నేషనల్ అథారిటీ కేవలం సూచనలు, సలహాల కోసమే ఉందని తెలిపారు. లక్ష ఎకరాలకు నీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకొని కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును, రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవాలని చూడటం సరికాదని ఆయన అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ ప్రకారం, ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టేందుకు ఎలాంటి అనుమతులు అవసరం లేదని పేర్కొన్నారు. అథారిటీ సూచనలు మాత్రమే చేస్తుందన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక వచ్చే దాకా నిర్ణయాలు తీసుకోకూడదని భావించడం సరికాదన్నారు.

# యుద్ధం ఆగాలంటే జెలెన్ స్కీ, పుతిన్ కలవాలి

మొదటిపేజీ తరువాయి..

అధ్యక్షుడు జెలెన్ స్కీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. లక్షలాది మంది ప్రజల చావులు ఆగాలంటే వారు తప్పక కలిసి తీరాలని అన్నారు. తమతో ఉక్రెయిన్ చేసుకున్న ఒప్పందం ప్రకారం ఖనిజ నిక్షేపాల్లో అమెరికాకు వాటా ఇచ్చేందుకు ఉక్రెయిన్ అంగీకారం తెలిపే అవకాశం ఉందని ట్రంప్ చెప్పారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఉక్రెయిన్ కు అమెరికా భారీగా ఆయుధ, ఆర్థికసాయం అందించిందని తెలిపారు. బైడెన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఉక్రెయిన్ కు అమెరికా పెద్ద మొత్తంలో నిధులు కేటాయించిందని చెప్పారు. ఒప్పందంలో భాగంగా ఉక్రెయిన్ తన వద్ద ఉన్న సహజ వనరులను అమెరికా కంపెనీలకు అందించాలని కోరారు. ఈ ఒప్పందానికి జెలెన్ స్కీ సానుకూలంగా స్పందించారని కూడా చెప్పారు.

# ఉన్నతాధికారి ఇంట్లో ముగ్గురు మృత్యువాత

## హత్యా..ఆత్మహత్యా అన్న అనుమానాలు దర్యాప్తు చేపట్టిన పోలీసు విభాగం

తిరువనంతపురం,ఫిబ్రవరి22(సాక్ష్యం): కేంద్ర ప్రభుత్వంలో ఉన్నతహోదాలో ఉన్న ఓ అధికారి ఇంట్లో మరణాలు మిస్టరీగా మారాయి. ఆయనతో పాటు తల్లి, సోదరి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. కేరళలో జరిగిన ఈ ఘటన సంచలనంగా మారింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. మనీశ్ విజయ్ కొచ్చిలో సెంట్రల్ ఎక్సైజ్ అండ్ జీఎస్టీ విభాగంలో అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల ఆఫీసుకు నాలుగు రోజులు సెలవులు పెట్టారు. అవి పూర్తయిన తర్వాత కూడా ఆయన తిరిగి విధుల్లోకి రాలేదు. దాంతో మనీశ్‌ను కలిసేందుకు స్నేహితులు ఎర్నాకుళం జిల్లాలోని అతని క్వార్టర్స్‌కు వెళ్లి చూశారు. కానీ అక్కడికి వెళ్లగానే దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి తలుపులు తీయగా మనీశ్ ఒక గదిలో, ఆయన సోదరి షాలిని మరో గదిలో ఉరికి వేలాడుతూ కనిపించారు. వారి తల్లి వేరే గదిలో మంచంపై నిర్జీవంగా కనిపించింది. ఆ మృతదేహాన్ని తెల్లని వస్త్రంలో చుట్టి పూలు చల్లినట్లుగా ఉంది. పక్కనే వీరు ముగ్గురూ దిగిన ఫొటో ఉంది. దీంతో ఈ ఘటన అనుమానాలకు దారితీసింది. ఆమె ముందే చనిపోయి ఉండొచ్చని, లేకపోతే ముందే చంపేసి, వీరు ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. కొద్దిరోజుల క్రితమే వారు మృతి చెందినట్లు కొచ్చి పోలీస్ కమిషనర్ మీడియాకు వెల్లడించారు. ఫోరెన్సిక్ పరీక్ష తర్వాత ఈ మరణాలకు గల కారణాలు తెలుస్తాయన్నారు. అలాగే ఒక గదిలో డైరీని గుర్తించారు. విదేశాల్లో ఉన్న సోదరికి తమ మరణం గురించి సమాచారం ఇవ్వాలని, ఇంట్లో ఉన్న అన్ని పత్రాలను ఆమెకు అందించాలని కేరళ పోలీసులను ఉద్దేశించి అందులో పేర్కొన్నట్లు సమాచారం. దీంతో వీరు ఆత్మహత్యకు పాల్పడి ఉంటారన్న అనుమానాలు బలపడుతున్నాయి. మనీశ్ కుటుంబం స్వరాష్ట్రం ఝార్ఖండ్. ఆయన గతంలో కోళికోడ్ ఎయిర్‌పోర్ట్‌లో కస్టమ్స్ విభాగంలో పనిచేశారు. తర్వాత సెంట్రల్ ఎక్సైజ్ అండ్ జీఎస్టీ విభాగానికి బదిలీ అయ్యారు. కొద్దినెలల నుంచి ఆయనతో పాటు తల్లి, సోదరి కూడా ఉంటున్నారు. ఇక షాలిని ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో తొలిర్యాంకు సాధించారు. ఆ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు సంబంధించిన కేసును సీబీఐ విచారిస్తోంది. ఈ కేసులో ఆమె నిందితురాలిగా ఉన్నారు. దీంతో మనస్తాపానికి గురై వీరి కుటుంబం ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవల మనీశ్ లీవ్ పెట్టింది కూడా ఆ లీగల్ కేసు పనిమీదే అని తెలుస్తోంది. దీనిపై దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు.

# బెంగళూరులో దారుణ ఘటన

## మాటలు కలిపి మహిళపై నలుగురు అత్యాచారం

బెంగళూరు,ఫిబ్రవరి22(సాక్ష్యం): బెంగళూరులో దారుణ ఘటన చోటుచేసుకుంది. కోరమంగళ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌లో 33 ఏళ్ల మహిళపై నలుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం జ్యోతి నివాస్ కాలేజీ జంక్షన్ వద్ద తాను వేచి ఉండగా.. దాదాపు 20 ఏళ్ల వయసు ఉన్న నలుగురు యువకులు వచ్చి తనతో మాటలు కలిపారని.. ఆ తర్వాత స్నేహంగా మెలిగి డిన్నర్‌కు ఆహ్వానించినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు. డిన్నర్ పూర్తయ్యాక ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించి.. ఓ ప్రైవేటు హోటల్ టెర్రాస్‌పైకి తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం గురించి ఎవరికీ చెప్పొద్దని ఆమెను బెదిరించి.. శుక్రవారం ఉదయం 6గంటలకు విడిచిపెట్టారని పేర్కొన్నారు. ఉదయం ఇంటికి చేరుకున్నాక జరిగిన దారుణం గురించి భర్తకు వివరించగా.. పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై డిప్యూటీ కమిషనర్ సారా ఫాతిమా మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం 7.30 –8గంటల సమయంలో ఈ ఘటనపై తమకు సమాచారం అందిందన్నారు. ఈ దారుణానికి ఒడిగట్టిన నలుగురు నిందితులను అరెస్టు చేసి.. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉన్నట్లు తెలిపారు. అయితే, ఆ యువకులతో ఆమె ఎందుకు వెళ్లారనే విషయాన్ని తెలుసుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. దిల్లీకి చెందిన ఈ మహిళ తన భర్తతో బెంగళూరులో స్థిరపడ్డారని, ఆమె క్యాటరింగ్ సర్వీసెస్‌లో పనిచేస్తుందని పోలీసులు వివరించారు. నిందితులు తమ స్నేహితుడిని కలిసేందుకు అక్కడికి వెళ్లినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. అయితే, ఈ నలుగురికీ ఒకరితో మరొకరికి పరిచయం ఉందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుల్లో ముగ్గురు పశ్చిమ బెంగాల్‌కు చెందినవారు కాగా.. ఒకరు ఉత్తరాఖండ్‌కు చెందినవారిగా గుర్తించారు. వీరంతా వివిధ హోటళ్లలో చెఫ్‌లు, వెయిటర్లు, హెల్పర్లుగా పనిచేస్తున్నారని పోలీసులు తెలిపారు.

## ముగ్గురు ఐపీఎస్ అధికారులను వెంటనే రిలీవ్ చేయాలి

### కేంద్ర హెూం శాఖ ఆదేశాలు జారీ

హైదరాబాద్,ఫిబ్రవరి22(సాక్ష్యం): తెలంగాణలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ముగ్గురు ఐపీఎస్‌లకు కేంద్ర హెూం శాఖ షాకిచ్చింది. ప్రస్తుతం ఉన్న పోస్టుల నుంచి రిలీవ్ చేస్తూ.. 24 గంటల్లోగా ఏపీలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ ముగ్గురు ఐపీఎస్‌లు ఎవరంటే.. అంజనీ కుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతి. ఈ ముగ్గురిని వెంటనే రిలీవ్ చేయాలని హెూం శాఖ ఆదేశాలిచ్చింది. డీజీ అంజనీ కుమార్ ఏపీ క్యాడర్ ఐపీఎస్ అధికారిగా ఉన్నారు. ఆయన తెలంగాణ డీజీపీగా కూడా గతంలో పనిచేశారు. అభిషేక్ మహంతి ప్రస్తుతం కరీంనగర్ సీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అభిలాష బిస్త్ తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అంజనీ కుమార్, అభిలాష బిస్త్ డీజీ ర్యాంక్‌లో ఉండగా, అభిషేక్ మహంతి ఎస్పీ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. కాగా ఈ ముగ్గురికి కేవలం 24 గంటల సమయం మాత్రమే ఇచ్చిన కేంద్ర హెూం శాఖ వెంటనే ఏపీ ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలని ఆదేశాలిచ్చింది. అయితే ఈ ఆదేశాలపై ఐపీఎస్‌లు కొంత సమయం కావాలని కోరే అవకాశం ఉంది. మూడు నెలల క్రితం ముగ్గురు ఐఏఎస్ అధికారులను ఇలాగే బదిలీ చేసింది కేంద్ర ప్రభుత్వం. తాజాగా ఈ ముగ్గురు ఐపీఎస్‌లకు షాక్ ఇచ్చింది. తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి వీళ్లు ఇక్కడే ఉన్నారు. రాష్ట్ర విభజన జరిగిన సమయంలో ఈ ముగ్గురిని కూడా కేంద్రం ఏపీకి అలాట్ చేసింది. కానీ, ఆ నిర్ణయాన్ని వీరు ముగ్గురు సవాల్ చేస్తూ క్యాట్‌ని ఆశ్రయించారు. అక్కడ వీరి అలాట్‌మెంట్‌కు సంబంధించిన వాదనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

## మారిషస్ స్వాతంత్య్రోత్సవాల అతిథిగా మోడీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి22(సాక్ష్యం): మారిషస్ స్వాతంత్య్రోత్సవ వేడుకల్లో ప్రధాని మోడీ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ మేరకు ప్రధాని మోడీకి ఆహ్వానం అందింది. వచ్చే నెలలో జరిగే మారిషస్ 57వ స్వాతంత్య్ర దినోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ గౌరవ అతిథిగా హాజరవుతారని మారిషస్ ప్రధాని నవీన్ రామ్‌గూలమ్ ప్రకటించారు. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలకు రాబోయే వేడుక సాక్ష్యంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రఖ్యాత ప్రపంచ అధినేతల్లో మోదీ ఒకరని.. బిజీ షెడ్యూల్‌లోనూ ఆయన తమ ఆహ్వానాన్ని అంగీకరించడం గౌరవంగా భావిస్తున్నామని ఆయన వ్యాఖ్యానించారు. 1968 మార్చి 12న బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందిన మారిషస్‌కు స్వాతంత్య్రం దక్కింది. నాటినుంచి మారిషస్ ఏటా మార్చి 12ను నేషనల్ డేగా నిర్వహించుకుంటోంది. కాగా గతేడాది భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మారిషస్ జాతీయ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా యూనివర్సిటీ ఆఫ్ మారిషస్ ఆమెకు గౌరవ డాక్టర్ ఆఫ్ సివిల్ లాను ప్రదానం చేసింది. ఇప్పుడు ప్రధాని మోడీ హజరవుతారు. ఈ రెండు దేశాల మధ్య పటిష్ట బందం ఉంది.

## మహిళా శిశు సంక్షేమ శాఖలో కొలువులు

### మొత్తం 14,236 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం

హైదరాబాద్,ఫిబ్రవరి22(సాక్ష్యం): రాష్ట్రంలోని మహిళా శిశు సంక్షేమ శాఖలో కొలువుల జాతర మొదలైంది. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీకి ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చేసింది. ఖాళీల భర్తీకి సంబంధించిన ఫైల్ మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క సంతకం చేశారు. మొత్తం 6399 అంగన్వాడీ టీచర్లు, 7837 హెల్పర్ల పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. ఎన్నికల కోడ్ ముగియగానే నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టుల భర్తీకి సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లు నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. మొత్తం 14,236 పోస్టులను తెలంగాణ ప్రభుత్వం భర్తీ చేయనుంది. తెలంగాణలో ఈ స్థాయిలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల కొలువులను భర్తీ చేయడం ఇదే తొలిసారి. ఖాళీల భర్తీ ప్రకియతో అంగన్వాడీలు మరింత పటిష్టంగా పనిచేయనున్నారు.

## నల్గొండలో బర్డ్‌ఫ్లూ..

### 7వేల కోళ్లను పాతిపెట్టిన వైనం..

నల్లగొండ,ఫిబ్రవరి22(సాక్ష్యం): నల్గొండ జిల్లా కేతపల్లి మండలం చెరుకుపల్లి గ్రామంలోని ఓ పౌల్ట్రీ ఫారంలో భారీ సంఖ్యలో కోళ్లు చనిపోవడంతో బర్డ్ ఫ్లూ భయాందోళనకు గురిచేసింది. గ్రామంలోని రైతులు తాము నష్టపోయిన విషయాన్ని తెలియజేస్తూ, ప్రభుత్వ సహాయం కోరుతున్నారు. చెరుకుపల్లి గ్రామంలోని పౌల్ట్రీ ఫారంలో గత కొన్ని రోజులుగా కోళ్లు అనారోగ్యానికి గురవుతుండగా, ఈ సమస్య మరింత తీవ్రమై సుమారు 7,000 కోళ్లు ఆకస్మికంగా మరణించాయి. ఈ ఘటనతో గ్రామస్తుల మధ్య భయాందోళనలు వ్యక్తమయ్యాయి. బర్డ్ ఫ్లూ సోకినట్టుగా అనుమానం వ్యక్తమవుతున్న నేపథ్యంలో, రైతులు తక్షణమే స్పందించి, చనిపోయిన కోళ్లను జేసీబీ సహాయంతో పూడ్చిపెట్టారు. కోళ్లు అనారోగ్యానికి గురవుతున్న విషయాన్ని గమనించిన వెంటనే రైతులు హైదరాబాద్ నుంచి నిపుణులైన వెటర్నరీ డాక్టర్లను రప్పించారు. అయితే, పలు మార్లు వైద్యం అందించినప్పటికీ ఎటువంటి ఫలితం కనిపించలేదు. రైతులు తమ కోళ్లను రక్షించేందుకు అన్ని విధాలుగా ప్రయత్నించినప్పటికీ, అనారోగ్యం మరింత తీవ్రమై కోళ్ల మరణాన్ని తలపెట్టింది.

## శక్తికాంత దాస్‌కు ప్రమోషన్

### ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీ–2గా నియామకం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి22(సాక్ష్యం): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ–2గా నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ క్యాబినెట్ ఆమోదించింది. శక్తికాంత దాస్ భాద్యతలు చేపట్టినప్పటి నుంచి ఆయన నియమాకం అమల్లోకి వస్తుంది. ప్రధానమంత్రి టర్మ్ వరకు కానీ తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. పీకే మిశ్రా 2019 సెప్టెంబర్ 11 నుంచి ప్రధానమంత్రికి పర్సనల్ సెక్రటరీగా ఉన్నారు. ఆరేళ్ల పాటు ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన శక్తికాంత దాస్ గత ఏడాది డిసెంబర్‌లో పదవీ విరమణ చేశారు. దీంతో ఆర్బీఐ 26వ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతలు స్వీకరించారు. 67 ఏళ్ల శక్తికాంత దాస్ 2018లో ఊర్జిత్ పటేల్ అకస్మాత్తుగా రాజీనామా చేయడంలో ఆర్బీఐ గవర్నర్ గవర్నర్ బాధ్యతలు చేపట్టారు. 1980 తమిళనాడు ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దాస్ ఢిల్లీలోని సెయిట్ స్టీఫెన్ కాలేజీలో మాస్టర్ డిగ్రీ చేశారు. బర్మింగ్‌హామ్ యూనివర్శిటీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. 2016 నవంబర్‌లో పెద్దనోట్లను రద్దు చేసినప్పుడు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా శక్తికాంతదాస్ ఉన్నారు. 2017 జూలై 1 నుంచి పలు ప్రత్యక్ష పన్నులు జీఎస్‌టీలో విలీనం చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. 2021లో ఆర్బీఐ గవర్నర్‌గా ఆయన పదవికాలం ముగియాల్సి ఉండగా మరో మూడేళ్లు పదవీకాలాన్ని పొడిగించారు.

## పాక్ జైలు నుంచి 22మంది మత్స్యకారుల విడుదల

లాహోర్,ఫిబ్రవరి22(సాక్ష్యం): పాకిస్థాన్ జైలు నుంచి 22 మంది మత్స్యకారులు విడుదలయ్యారు. గతకొంతకాలంగా వీరు కరాచీ కారాగారంలో మగ్గుతున్నారు. వీరంతా అంతర్జాతీయ జలసంధిని దాటినందుకు అరెస్ట్ అయ్యారు. వారి శిక్షాకాలం పూర్తికావడంతో కరాచీలోని మాలిర్ కారాగారం నుంచి శుక్రవారం బయటకువచ్చారు. ఆ మత్స్యకారుల్ని భారత్‌కు అప్పగించే అవకాశం ఉందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ క్రమంలో భారత జాలర్లకు ఈది ఫౌండేషన్ సహాయసహకారాలు అందించింది. వారు కరాచీ నుంచి లాహోర్‌కు వెళ్లడానికి కావాల్సిన రవాణా సౌకర్యాలు ఏర్పాటుచేసింది. అక్కడి నుంచి వారు భారత్‌కు రానున్నారు. ఆ సంస్థ మత్స్యకారులకు ప్రయాణఖర్చులు, కొన్ని బహుమతులు, నగదు అందించింది. ఈ సందర్భంగా భారత్–పాక్ ప్రభుత్వాలకు ఈది ఫౌండేషన్ ఛైర్మన్ ÷జైల్ ఈది ఒక అభ్యర్థన చేశారు.

## మానవ అక్రమ రవాణా మరియు చట్టపరమైన విధానాలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం

మానవ అక్రమ రవాణా మరియు చట్టపరమైన విధానాల పై ఈ రోజు అనగా ఫిబ్రవరి 22, 2025 ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని సికింద్రాబాద్‌లోని సంచాలన్ భవన్‌లోని హవా మహల్‌లో సౌత్ సెంట్రల్ రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్ ఆర్ పి ఎఫ్ , అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ ( ఏ వి ఏ ) సమన్వయంతో నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఆర్ పి ఎఫ్ %ꣳ% జి ఆర్ పి సిబ్బంది, న్యాయ నిపుణులు మరియు ప్రముఖులతో సహా 105 మంది పాల్గొన్నారు, మానవ అక్రమ రవాణాను నిరోధించడానికి ప్రయత్నాలను బలోపేతం చేయడానికి కలిసి వచ్చారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐజీ–కమ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్,దక్షిణ మధ్య రైల్వే శ్రీమతి అరోమా సింగ్ ఠాకూర్, సికింద్రాబాద్ ఆర్ పి ఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ శ్రీమతి డి సి బెనర్జీ, శ్రీ వెంకటేశ్వర్లు (రాష్ట్ర సమన్వయకర్త, ఏ వి ఏ ) మరియు శ్రీమతి శ్రీ హర్షిత (అడ్వకేట్, ఏ వి ఏ ) ముఖ్య వక్తలుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మానవ అక్రమ రవాణాపై కీలక అంశాలపై ప్రత్యేక బుక్‌లెట్ ఆవిష్కరణతో ప్రారంభమైంది, తరువాత మానవ అక్రమ రవాణాపై అవగాహన షార్ట్ ఫిల్మ్ విడుదల మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నిబద్ధతను బలోపేతం చేసే సామూహిక ప్రతిజ్ఞ జరిగింది.
చట్టపరమైన చట్రాలు, అక్రమ రవాణా దుర్బలత్వాలు మరియు రెస్క్యూ ఆపరేషన్లలో ఆర్ పి ఎఫ్ %ꣳ% జి ఆర్ పి పాత్రపై శిక్షణ దృష్టి సారించింది. తప్పిపోయిన పిల్లలను నిర్వహించడానికి ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలు ( ఎస్ ఓ పి లు ), అక్రమ రవాణాకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలు మరియు రైల్వే ప్రాంగణంలో కేసులను పరిష్కరించడంలో ఏ హెచ్ టి యూ ల కార్యాచరణ బాధ్యతలను శ్రీమతి శ్రీ హర్షిత మరియు శ్రీ వెంకటేశ్వర్లు నిపుణుల నేతృత్వంలోని సెషన్‌లు కవర్ చేసారు
మానవ అక్రమ రవాణా వ్యతిరేక కార్యకలాపాలలో ఆర్ పి ఎఫ్ తెలంగాణ ప్రాంతం సాధించిన గణనీయమైన విజయాలను తెలపడంలో ఈ కార్యక్రమం విశేషంగా నిలిచింది 2023లో, 305 మంది పిల్లలను రక్షించగా, 137 మంది అక్రమ రవాణాదారులను అరెస్టు చేశారు, 2024లో 310 మంది పిల్లలను రక్షించగా, 174 మందిని అరెస్టు చేశారు. ఆపరేషన్ ఏ ఏ హెచ్ టి (మానవ అక్రమ రవాణాకు నివారణ ) చొరవతో సమన్వయంతో నిర్వహించిన ఈ ప్రయత్నాలు అక్రమ రవాణా నెట్‌వర్క్‌లను నిర్మూలించడంలో కీలక పాత్ర పోషించాయి.



ఆచరణాత్మక అవగాహనను పెంపొందించడానికి, శిక్షణలో పరస్పర ప్రశ్నోత్తరాల సెషన్‌లు, నిజ జీవిత కేస్ స్టడీస్, రోల్–ప్లేయింగ్ వ్యాయామాలు మరియు ఆచరణాత్మక కార్యకలాపాలు, గుర్తింపు, చర్చలో పాల్గొనడం మరియు రెస్క్యూ ఆపరేషన్‌ల కోసం కీలకమైన నైపుణ్యాలతో అధికారులను సన్నద్ధం చేయడం వంటివి ఉన్నాయి. ఉదయం 10:00 గంటల నుండి 15:45 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొనేవారికి మెరుగైన నిఘా, బలోపేతం చేసిన బహుళ–ఏజెన్సీ సహకారం మరియు రైల్వేల ద్వారా మానవ అక్రమ రవాణాను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి చురుకైన వ్యూహాలను అందించింది.

# కులగణనతో బీసీల భవిష్యత్ అంధకారం

మొదటిపేజీ తరువాయి..

చేస్తుందని విమర్శించారు. అధికారంలోకి రాక ముందు వంద రోజుల్లో వాగ్దానాలు పూరి చేస్తామని మాటిచ్చిన కాంగ్రెస్, 400 రోజులు గడుస్తున్న వారిచ్చిన వాగ్దానాలు అమలుకు నోచుకోలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కంటున్న కలలు నీరుగారి పోతున్నాయని, దేశంలో జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చింది గాడిద గుడ్డేనని విమర్శించారు. అందుకు ఢిల్లీ ఎన్నికలే నిదర్శనమని కేంద్రమంత్రి అన్నారు. రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తుందని, బీసీలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని వెల్లడించారు. ఈ సమావేశంలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఎంపీ అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



## ఒక్కరోజే 1.29 కోట్ల మంది భక్తులు స్నానాలు

మొదటిపేజీ తరువాయి..

ఉప ముఖ్యమంత్రి బ్రిజేష్ పాఠక్, మంత్రులు స్వతంత్ర దేవ్ సింగ్, నంద్ గోపాల్ గుప్తా కూడా ఆయనతో పాటు పాల్గొన్నారు. ఈ నాయకులందరూ కలిసి సంగమంలో స్నానం ఆచరించారు. ఆ తర్వాత నడ్డా తన కుటుంబంతో కలిసి సూర్య భగవానుడికి ప్రార్థనలు చేసి, గంగా తల్లికి చీర, కొబ్బరికాయ, పూలు భక్తితో సమర్పించారు. ఈ సందర్భంగా నడ్డా ఇద్దరు పిల్లలు కూడా సంగమంలో స్నానం చేసేందుకు ఆయనతో కలిసి వచ్చారు. మహా కుంభమేళాలో ఇప్పటివరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధంఖర్, ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, ఎంపీ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ పుణ్య స్నానం చేశారు. దీంతోపాటు ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైనీ, మణిపూర్ సీఎం ఎన్ బిరేన్ సింగ్, సీఎం యోగి, ఆయన మొత్తం మంత్రివర్గం, అఖిలేష్ యాదవ్, రవి కిషన్, కవి కుమార్ విశ్వాస్ కూడా పవిత్ర స్నానం చేశారు. మరోవైపు 73 దేశాల ప్రతినిధులు, భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యాల్ వాంగ్‌చుక్ సహా అనేక మంది ఇతర ప్రముఖులు కూడా ఈ సంగమంలో స్నానం చేశారు. మహా కుంభమేళా చివరి తేదీ ఫిబ్రవరి 26కి ఇంకా కొన్ని రోజులే ఉంది. దీనికి తోడు ఆరోజు మహా శివరాత్రి పండుగ వస్తున్న నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమృత స్నానం చేయనున్నారు. ఇది 144 సంవత్సరాల తర్వాత వస్తున్న అద్భుతమైన యాదృచ్ఛికమని పండితులు చెబుతున్నారు. ఆ క్రమంలో శివుని ఆరాధనలో సంగమంలో స్నానం చేయడం ద్వారా భక్తులకు ఎంతో పుణ్యం లభిస్తుందని పండితులు అంటున్నారు. మహాశివరాత్రి రోజున భక్తులు ప్రత్యేకంగా శివలింగానికి అభిషేకం చేసి రాత్రంతా జాగరణ చేస్తారు.



మహాశివరాత్రి రోజు ఉపవాసం కూడా ఉంటారు. ఈ కారణంగా ప్రయాగ్‌రాజ్‌లో జనసమూహం మరింత పెరిగే అవకాశం ఉంది.
అందుకే దీని కోసం ప్రభుత్వం కొత్త ఎ÷–లాన్స్ అమలు చేసేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో జిల్లా యంత్రాంగం, పోలీసులు ఉత్తర రైల్వే అధికారుల సహకారంతో కొత్త ప్రణాళికను రూపొందించారు. వంతెనపై తోపులాటలు జరగకుండా, జనసమూహం పెరగకుండా ఉండేందుకు ప్రత్యేక ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఉంటాయి. దీంతోపాటు వారణాసి జంక్షన్, కాంట్ రైల్వే స్టేషన్ వద్ద హోల్డింగ్ ప్రాంతాన్ని పెంచాలని నిర్ణయించారు. ఒకే చోట రద్దీని నివారించడానికి, వివిధ మార్గాల్లో ప్రయాణించే ప్రయాణీకులకు ప్రత్యేక హోల్డింగ్ ప్రాంతాలు ఉంటాయి. ప్రయాణ సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండటానికి రిజర్వ్ చేసుకున్న టిక్కెట్లు ఉన్న ప్రయాణీకులకు మొదట ప్రాధాన్యత ఇస్తారు.
ఎ÷–లాట్‌ఫామ్‌లపై రద్దీని నివారించడానికి, రైళ్లు ఆలస్యంగా లేదా గంటల తరబడి వచ్చే వ్యక్తులు హోల్డింగ్ ప్రాంతంలో వేచి ఉండాల్సి ఉంటుంది. స్టేషన్లలో ప్రకటనల ద్వారా వచ్చే రైళ్ల గురించి సమాచారం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటుంది. దీని కారణంగా, ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం ఉండదు. వారు తమ రైళ్లను మిస్ అవకుండా ఉంటారు.
ఎ÷–లాట్‌ఫామ్‌పైకి వెళ్లే ముందు, ప్రయాణీకులు తమ టిక్కెట్లను చూపించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే వారిని వెళ్లడానికి అనుమతిస్తారు. ఇది కాకుండా ఇతర మార్గాల్లో వెళ్లే వారికి జనసమూహాన్ని రోడ్డు నుంచి నేరుగా వారి ఎ÷–లాట్‌ఫామ్‌లకు పంపడానికి సన్నాహాలు జరుగుతాయి. మహా కుంభమేళాకు వెళ్లేందుకు యూపీకి చెందిన 1200 రోడ్డు బస్సులను రిజర్వ్‌లో ఉంచారు. ఫిబ్రవరి 21 నుంచి 28 వరకు మహా కుంభమేళాకు ఈ 1200 బస్సులు రిజర్వ్ చేయబడతాయి. ఇది కాకుండా ప్రస్తుతం సంగం ప్రాంతంలో మరో 750 షటిల్ బస్సులు నిరంతరం నడుస్తున్నాయి. మహాశివరాత్రికి భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు ప్రభుత్వం ముందుగానే సిద్ధమైంది.

## బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ మొదలైంది

### మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన

హైదరాబాద్,ఫిబ్రవరి22(సాక్ష్యం): తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధతపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, బీసీలకు 42? రిజర్వేషన్ కల్పించే పక్రియ ఇప్పటికే ప్రారంభమైందని స్పష్టం చేశారు. ఈ రిజర్వేషన్లను చట్టబద్ధం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. వచ్చే మార్చి మొదటి వారంలో అసెంబ్లీలో దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి, చట్టాన్ని అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ఢిల్లీకి వెళ్లి బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించేందుకు కృషి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో 96.9? మంది పాల్గొన్నారని, కేవలం 3.1? మంది మాత్రమే అందులో పాల్గొనలేదని వివరించారు. ఈ క్రమంలో, రెండో విడత కులగణన సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ హక్కులను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.



## తెలంగాణ పరువు తీస్తున్న రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి..

మాదిరి రంకెలు వేయటం మానుకోవాలన్నారు. సొంత రాష్ట్రాన్ని క్యాన్సర్‌తో పోల్చిన భావదారిద్య్రపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కోటీశ్వరులైన మహిళలను మాత్రమే రేవంత్ ఓట్లు అడగాలన్నారు. తెలంగాణ దివాలా తీసిందని.. గత 15 నెలలుగా కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. స్వయంగా ముఖ్యమంత్రి తెలంగాణ పరువును గంగలో కలుపుతున్నారన్నారు. కాళేశ్వరంపై కొంతమంది సన్యాసులు చెత్తవాగుడు బంద్ చేయాలని అన్నారు. తెలంగాణ ఆర్థికస్థితిపై ఫిబ్రవరి 17న డిప్యూటీ సీఎం భట్టి విడుదల చేసిన సమగ్రమైన నివేదికను రేవంత్ చదువుకోవాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వాస్తవాలు చెప్పిన ఉప ముఖ్యమంత్రి భట్టికి ధన్యవాదాలు తెలియజేశారు. సంపద సృష్టించటంలో కేసీఆర్ ప్రభుత్వం అద్భుతంగా పనిచేసిందన్నారు. రేవంత్ రెడ్డి యాక్సిడెంటల్ సీఎం అంటూ వ్యాఖ్యలు చేశారు. సిగ్గు.. మానం లేని మూర్ఖపు ముఖ్యమంత్రి అని విమర్శించారు. కేసీఆర్‌ను దూషించటం మూనుకోకుంటే రేవంత్ మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. పాపం భట్టి విక్రమార్క అమాయకంగా ఇరుక్కున్నారని.. ఆయన ఉద్యోగం ఉంటదో.. పోతుందో? అని అనుమానం వ్యక్తం చేశారు. అప్పులకు వడ్డీ.. రేవంత్ 6వేల 500 కోట్లు అంటున్నారని.. భట్టి 2 వేల 200 కోట్లు అంటున్నారని తెలిపారు. ఢిల్లీ పార్టీలకు తెలంగాణను పరిపాలించుట చేదకాదని తేలిందన్నారు. కేంద్రం ఇచ్చే దానికంటే.. కేంద్రానికి పన్నుల రూపంలో తెలంగాణ ఇచ్చేది ఎక్కువ అని చెప్పుకొచ్చారు. ఒక్క హామీ కూడా అమలు చేయకుండా.. అప్పులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. హైడ్రాతో రేవంత్ రెడ్డి.. రియల్ ఎస్టేట్‌కు వెన్నుపోటు పొడిచారన్నారు. నీళ్ళు ఇచ్చుడు చేతకాకుంటే క్రాప్ హాలిడే ప్రకటించాలని మాజీమంత్రి డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌పై కూడా కేటీఆర్ ÷ర్ అయ్యారు. రేవంత్ రెడ్డికి బండి సంజయ్ రక్షణ కవచంగా నిలబడుతున్నారన్నారు. రేవంత్, సంజయ్‌లు.. ఆర్ఎస్ బ్రదర్స్ అని మార్కెట్‌లో చెప్పుకుంటున్నారని అన్నారు. సీఎం రేవంత్ అవినీతిపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. బిల్డర్స్ దగ్గర స్క్వేర్ ఫీట్‌కు రేవంత్ రెడ్డి.. 150 రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. రాహుల్, మోదీ కులంతో ప్రజలకు ఏంటి లాభం అని ప్రశ్నించారు. అమృత్ టెండర్లు, పొంగులేటి ఇంటిపై ఈడీ రైడ్స్ ను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సుంకిశాల ప్రాజెక్టు కుంగితే.. మేఘా కృష్ణారెడ్డిని రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారని నిలదీశారు. కృష్ణజాలల దోపిడీ విషయంలో అసెంబ్లీలో ఎండగడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## సొరంగ ప్రమాదానికి బాధ్యత రేవంత్‌దే

మొదటిపేజీ తరువాయి..

చేపట్టాలన్నారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల మేరకు పనులు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఒక బ్యారేజీలో కేవలం పిల్లర్ కుంగితే నానా హంగామా చేసిన కాంగ్రెస్ నేతలు.. వారి హయాంలో జరుగుతున్న వరుస వైఫల్యాలపై ఏమంటారని ప్రశ్నించారు. సుంకిశాల ప్రమాదంలో గుత్తేదారును కాపాడేందుకు వాస్తవాలు దాచి పెట్టిన ప్రభుత్వం.. కనీసం ఎస్ఎల్‌బీసీ ఘటనలో పారదర్శకంగా దర్యాప్తు జరిపి ప్రమాదానికి గల కారణాలను బయటపెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపడుతున్న ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడం కాంగ్రెస్ సర్కార్ అసమర్థతకు, చేతగాని తనానికి నిదర్శనం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. చేయక చేయక ఒక ప్రాజెక్టు పనులు మొదలుపెట్టి ఆరంభంలోనే అంతం చేసిన ఘనత కాంగ్రెస్ పాలకులదే అని విమర్శించారు. మొన్న సుంకిశాలలో రీటైనింగ్ వాల్ కూలిన ఘటన, నేడు ఎస్ఎల్‌బీసీ సొరంగం కుప్ప కూలడం కాంగ్రెస్ కమిషన్ సర్కారు వైఫల్యానికి నిదర్శనం అని హరీశ్‌రావు విమర్శించారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే. గత నాలుగు రోజులుగా కొద్దికొద్దిగా మట్టి కూలుతున్నదనీ గుర్తించినప్పటికి ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం రేవంత్ సర్కార్ నిర్లక్ష్యమేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడగా, మరికొంత మంది కార్మికులు లోపల ఉన్నట్లు తెలుస్తుంది. వారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి. ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి వారి ప్రాణాలు కాపాడాలి. డీ వాటరింగ్ చేసి, వెంటనే విద్యుత్ పునరుద్ధరించి, శిథిలాలను తొలగించి కార్మికులను వెంటనే బయటకు తీసుకురావాలి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ వెంటనే ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## రాణా ప్రతాప్ రెడ్డిని పరామర్శించిన ఎంపీ డీకే అరుణ



ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో (సాక్ష్యం న్యూస్ ) :బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ రెడ్డి ,వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డిల మాతృమూర్తి గోగుల జయశ్రీ ఇటీవల మృతి చెందినది. బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యులు డీకే అరుణవిషయం తెలుసుకొని నర్సంపేటలోని వారి స్వగృహానికి వెళ్లి జయశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యులు డీకే అరుణతో పాటు వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్ , వరంగల్ ఖమ్మం నల్గొండ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోతం రెడ్డి ,రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్ , పెసరు విజయచందర్ రెడ్డి , బీజేపీ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంభంపాటి ప్రతాప్ (పుల్లారావు) ,వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో ఆట పాటలతో విద్య



*చండి అంగన్వాడీ కేంద్రంలో ఈసీసీ డే పరిశీలించిన సూపర్వైజర్ సంతోష!!

సాక్ష్యం న్యూస్,శివంపేట: అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల ఆట పాటల ద్వారా విద్య బోధన చేస్తామని ఐసిడిఎస్ మండల సూపర్వైజర్ సంతోష తెలిపారు. శనివారం మండలంలోని చండి అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి ఈసిసిఈ (ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్) డే లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంతోష మాట్లాడుతూ ప్రతి నెల నాలుగో శనివారం అన్ని అంగన్వాడి కేంద్రాల్లో ఈసీసీఈ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెలరోజులపాటు అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు నేర్పిన ఆటలు పాటలు, కథలకు, సంబంధించి ప్రగతి నివేదికను తల్లి దండ్రులకు వివరించడం జరుగుతుందన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం, పాలు, కోడిగుడ్లు ఇస్తున్నామని చెప్పారు. పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యాబోధన జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్... లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపిన పాయం



భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 22 ,(సాక్ష్యం న్యూస్); పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గుడిలో పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం నూతనంగా ఎన్నుకోబడిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ సభ్యులతో గుడిలో ప్రమాణ స్వీకారం చేపించి కమిటీ సభ్యులుగా ఎన్నికైన గుడి చైర్మన్ బాదం నాగిరెడ్డి ని, సెక్రటరీ చింతా వెంకట నాగిరెడ్డి ని, ట్రెజరర్ పాశం రాజశేఖర్ రెడ్డి ని, పూజారి రవిశర్మకి, కార్యవర్గ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గుడి కమిటీ సభ్యులు, తదితరులు, పాల్గొన్నారు.

## స్కౌట్స్ అండ్ గైడ్స్ సామాజిక సేవలు స్ఫూర్తిదాయకం




డిజిఎం పర్సనల్
ఎస్ రమేశ్

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ,ఫిబ్రవరి 22, (సాక్ష్యం న్యూస్); స్కౌట్స్ అండ్ గైడ్స్ సామాజిక సేవలు స్ఫూర్తి దాయకమని డీజీఎం పర్సనల్ సలగల రమేష్ అన్నారు. శనివారం మణుగూరు ఏరియా పీవీ కాలనీ సింగరేణి పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సింగరేణి డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ థింకింగ్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగాపాల్గొని వరల్డ్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు రాబర్ట్ బాడెన్- పావెల్ చిత్రపటానికి పూల మాలలు వేసి స్కౌట్స్ అండ్ గైడ్స్ పతకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాల యువత స్నేహ భావంతో, సేవ దృక్పదంతో జాతి సేవకు అంకితమయ్యేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాన్ని స్థాపించిన రాబర్ట్ బాడెన్-పావెల్ దూర దృష్టితో ప్రపంచ మానవ జాతికి చేసిన గొప్ప సేవకు గాను రాబర్ట్ బాడెన్-పావెల్ జన్మ దినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 22వ తేదీన వరల్డ్ థింకింగ్ డే నిర్వహించుకుంటున్నామన్నారు. వారి గొప్ప సేవా దృక్పద స్ఫూర్తితో నేటి తరం కూడా స్పోర్ట్స్ అండ్ గైడ్స్ ఎంతో శిక్షణతో, క్రమ శిక్షణతో, చురుకుదనంతో, సేవా భావాన్ని అలవర్చుకోవడం సమాజానికి ఇతోధికంగా చేయుతను అందించడం, ఆపత్ సమయంలో ధైర్య సాహసాలు చూపడం వంటి గుణాలతో జాతి సేవలో నిమగ్నమయి ప్రత్యక్షంగా సమాజానికి పరోక్షంగా దేశానికి అమూల్య సేవలు అందించాలన్నారు.2025 ప్రపంచ ఆలోచన దినోత్సవం యొక్క నినాదమైన మన ప్రపంచం, అభివృద్ధి చెందుతున్న మన భవిష్యత్ అంశం సాధికారికతకు త్రికరణ శుద్ధిగా పాటుపడాలన్నారు. పిల్లలు స్కౌట్స్ అండ్ గైడ్స్ లో చేరేందుకు గాను తల్లి దండ్రులు కూడా తమవంతు ప్రోత్సాహం అందించాలన్నారు. ఈ సందర్భంగా సింగరేణి పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రదర్శించిన నృత్య గీతాలు ఎంతగానే ఆకట్టుకున్నాయన్నారు.ఈ కార్యక్రమలో చివరి అంశమైన శాంతి యాత్ర ర్యాలీని సింగరేణి పాఠశాల నుండి కాలనీ వరకు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయురాలు శ్రీమతి కల్యాణి , పాఠశాల ఉపాధ్యాయులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ కెప్టెన్ శ్రీమతి బి సరిత, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థిని విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

## దశదినకర్మలకు హాజరైన పాయం



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ,ఫిబ్రవరి 22 ,(సాక్ష్యం న్యూస్ ): దశదినకర్మలకు పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. శనివారం మణుగూరు మండలం రామానుజరం గ్రామానికి చెందిన నడికొప్పుల సంపత్ దశదినకర్మలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై వారి చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామానుజరం మాజీ సర్పంచ్ బాడిషా సతీష్ , సాధిని సీతయ్య, తమ్మిశెట్టి సాంబ , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు , పాల్గొన్నారు.

## పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడేది కమ్యూనిస్టు పార్టీ: కూనంనేని

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఫిబ్రవరి 22,(సాక్ష్యంన్యూస్);పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిది కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబ శివరావు అన్నారు. శనివారం మణుగూరు మండలం చిక్కుడు గుంట గ్రామంలో సిపిఐ పార్టీ శత జయంతి ఉత్సవాలు భాగంగా మైసా కొండయ్య భవనం అమరవీరుల స్మారక సంస్మరణ పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమం లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య , సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, ఎఐటియుసి జెండా ఆవిష్కరణ చేసి అనంతరం నిర్వహించిన మాజీ ఎంపీటీసీ కామిశెట్టి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజల కోసం వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగించేది ఎర్రజెండా పార్టీ అని , ఆనాడు స్వాతంత్రం రాకముందు నుండే కమ్యూనిస్టు పార్టీ అంటరానితరం నిర్మూలించాలని సమానత్వం రావాలని భూసంస్కరణలు కొనసాగించాలని దున్నేవానికి భూమి కావాలనే నినాదంతో అనేక పోరాటాలు కొనసాగించిన పార్టీ సిపిఐ వేలాది ఎకరాలను పేద ప్రజలకు అంచన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది అన్నారు, *తెలంగాణ సాయుధ పోరాటం కొనసాగించి తెలంగాణ ప్రజలకు విముక్తి కావించింది కమ్యూనిస్టు పార్టీ అనని వారన్నారు. పేద ప్రజల సమస్యల పైన రైతాంగ సమస్యల పైన కార్మిక హక్కుల కోసం నిరంతరం పరితపించే పార్టీ ఎర్రజెండాలని మిగిలిన ఏ పార్టీ వారి హక్కుల కోసం పోరాటం కొనసాగించినట్టు చరిత్రలో లేదన్నారు.అధికారంలో ఉన్నా లేకున్నా పేద ప్రజల కోసం నిరంతరం పరితపించే పార్టీ ఎర్రజెండా అని దాని కాపాడుకోవాల్సిన బాధ్యత మీ అందరి పైన ఉందని వారు పిలుపునిచ్చారు. అనంతరంసిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య గారు,సిపిఐ జిల్లా పార్టీ కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాష మాట్లాడుతూ ఆనాడు ఈ ప్రాంతంలో పేద ప్రజల మీద భూస్వాముల పెత్తనం ఎక్కువగా ఉండేదని పేద ప్రజలను హింసించి ఇబ్బందుల గురి చేసే




వారిని కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో వారిని ఎదిరించి అనేక పోరాటాలు కొనసాగించారని, మైస కొండయ్య లాంటివారు ఈ ప్రాంత ప్రజల కోసం తమ జీవితాలను త్యాగం చేశారని వారు గుర్తు చేశారు. ఈ దేశంలో 100 సంవత్సరాల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన పార్టీ ఎర్రజెండా సిపిఐ అని వారన్నారు. నిరంతరం పేద ప్రజల్లో మమేకమై ఉంటూ వారి హక్కుల కోసం రైతాంగ పోరాటం కోసం ప్రాథమిక హక్కుల కోసం కర్షకుల కోసం విద్యార్థుల, కోసం యువకుల కోసం నిరంతరం పోరాటాలు కొనసాగిస్తూ నేడు నిరంతరం సిపిఐ పనిచేస్తుందని ఎందరో త్యాగమూర్తులు పార్టీలో అమరులయ్యారని వారికి గుర్తుగా ఈనాడు బి టి పి ఎస్ దగ్గర ఏర్పాటు చేసిన అమరవీరుల స్మారక స్తూపం ఇక్కడ ప్రాంత ప్రజలకు చిరస్థాయిగా నిలుస్తుందని, వారు త్యాగాలు మరువలేనివి అని వారన్నారు. ఈ స్ఫూర్తితో పార్టీ నాయకులు ముందుకు పోవాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ బీటీపీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రావుల మురళీ,రాష్ట్ర కార్యదర్శి దుగ్గిరాల సుధాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మి కుమారి,పాల్వంచ పట్టణ కార్యదర్శి సాయిబాబా,మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, తలదాత ముక్కు నర్సారెడ్డి, జిల్లా సమితి సభ్యులు పత్తిపాటి నాగేశ్వరరావు, సర్వర్, సొందే కుటుంబరావు,గడ్డం మనోహరచారి,పద్మనాభ రాజు,సభ మేడ సత్యం,ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్షులు,కార్యదర్శి రాయల బిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, ఎంపీటీసీ లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ బాడిస సతీష్, మహిళా సమైక్య మణుగూరు మండల అధ్యక్ష కార్యదర్శులు సమ్మక్క, దుబ్బాక నిర్మల, సుజాత, తోట రమేష్, పులిగల రమేష్, చిక్కుడు గుంట శాఖ కార్యదర్శి బట్ట రామారావు, అధిక సంఖ్యలోకార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

## పదవ తరగతి భవిష్యత్తుకు తొలిమెట్టు..



*బాలుర వసతి గృహాన్ని ఆ కస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఫిబ్రవరి 22 ,(సాక్ష్యం న్యూస్; పదవ తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు తొలిమెట్టు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శనివారం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహం లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని రికార్డులు పరిశీలించారు.అనంతరం వండిన భోజనాన్ని పరిశీలించారు. టీచర్స్, మెస్ కమిటీతో భోజనం ఎలా ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. రోజు వారీగా భోజనాన్ని ఎవరెవరు రుచి చూస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. బియ్యం బస్తాలలో ఉన్న బియ్యాన్ని చూసి, బియ్యం స్టాక్ రిజిస్టర్ ను చెక్ చేశారు. బియ్యాన్ని ఎప్పుడెప్పుడు శుభ్రం చేస్తున్నారని వంట ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించారు. ఏ రోజుకారోజు బియ్యాన్ని శుభ్రం చేస్తామని వారు తెలిపారు. బియ్యంలో పురుగులేమీ రావడం లేదు కదా అని ఆరా తీశారు. రావడం లేదని నిర్వహకులు తెలిపారు. అలాగే నిల్వ ఉంచిన కూరగాయలను పరిశీలించారు. అనంతరం వసతి గృహంలో ప్రతి మరుగుదొడ్లను పరిశీలించి ప్రతిరోజు మరుగుదొడ్లను శుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిద్రించేందుకు ఏర్పాటుచేసిన బెడ్స్ ను పరిశీలించి ఇంతమంది విద్యార్థులు నిద్రించడానికి ఈ బెడ్లు ఎలా సరిపోతాయి, మిగిలిన వారు క్రింద పడుకుంటున్నారా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, స్నాక్స్ అందిస్తున్నారా అని ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని విద్యార్థులకు సూచించారు. అంతక ముందు విద్యార్థుల స్టడీ అవర్ ను పరిశీలించారు. స్టడీ అవర్లో విద్యార్థులను గణితంలో పలు ప్రశ్నలు అడిగి బోర్డు మీద రాయించారు. ఎలాంటి ఆటలు ఆడుతారని అడిగారు. భవిష్యత్తులో మీరేం అవుతారని, మీ ఆశయం ఏమిటని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందించే మంచి మాటలు చెబుతూన జీవిత లక్ష్యం ఏమిటని కుశల ప్రశ్నలను సంధించి విద్యార్థుల నుండి సమాధానాలు అడిగి తెలుసుకున్నారు.ఎలాంటి వత్తిడి లేకుండా చదవాలని సూచించారు. వెనుకంజలో ఉన్న సబ్జెక్టుపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని తెలిపారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టంతో కాకుండా ఇష్టంగా చదవాలని, మానసిక ఒత్తిడికి గురికావొద్దని సూచించారు. పది ఫలితాలు విద్యార్థుల భవిష్యత్తుకు తొలిమెట్టు అని, భవిష్యత్ లక్ష్య సాధనకు దిక్సూచి అని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే పరిశీలించి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ అధికారి అనసూయ, హాస్టల్ వార్డెన్, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

## నేరస్తులకు శిక్ష పడేవిధంగా అధికారులు కృషి చేయాలి



నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఫిబ్రవరి 22,( సాక్షి న్యూస్); ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా అధికారులందరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అన్నారు. శనివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో అధికారులతో నిర్వహించిన నెలవారి నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతీ కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు.కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని అన్నారు.పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించి తమ తమ నివాస ప్రాంతాల్లో మరియు వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చేయాలని తెలిపారు.ప్రాపర్టీ కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు.సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు.జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి,భాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు.మద్యం సేవించి వాహనాలను నడుపుతూ,ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను, డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి , జిల్లాలోని సిఐలు,ఎస్సైలు , సిబ్బంది , తదితరులు, పాల్గొన్నారు.

## బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి సిఅంజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి



బిజెపి మండల అధ్యక్షులు పెద్దపులి రవి!!

సాక్ష్యం న్యూస్,శివంపేట. శివంపేట మండలంలోని వివిధ గ్రామాల లో బిజెపి జోరుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ,నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్. బిజెపి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థిగా సి అంజి రెడ్డి నీ మల్క కొమరయ్య ను మద్దతుగా శివ్వంపేట మండలం లోని చెన్నాపూర్ , పెద్ద గోట్టిముక్ల గ్రామాలలో ప్రచారం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో శివ్వంపేట మండల బిజెపి అధ్యక్షులు పెద్దపులి రవి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ కోండల్ రావు, జిల్లా యస్.సి సెల్ అధ్యక్షుడు బిక్షపతి,సీనియర్ నాయకులు నారాయణ గారి వినోద్ కుమార్, శివ్వంపేట బిజెవైయం అధ్యక్షులు బల్కంపేట భాస్కర్ శేఖర్ బాల మల్లేశా మాదురబోయిన మల్లేషా తదితరులు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జోరుగాఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



సాక్ష్యం (పాపన్నపేటఫిబ్రవరి 22) పాపన్నపేట మండలంలో మల్లంపేట,కందిపల్లి,మిన్పూర్ తదితర గ్రామాలలో భాజపా నాయకులు శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. భాజపా బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య,పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి ని గెలిపించాని ఓటర్లను కోరారు.నాయకులు వడ్ల సంతోష్ చారీ,సుధాకర్,ఇమ్మానియేల్, భాగేష్,శ్రవణ్ తదితరులు ఉన్నారు.

### ఫసల్వాది నిందితులను ప్రభుత్వం ఎన్ కౌంటర్ చేయాలని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మి



సాక్ష్యంన్యూస్,సదాశివపేట: సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఆర్ లక్ష్మి మాట్లాడుతూ సంగారెడ్డి మండలంలోని పసల్వాది శివారులో 8 బాలికపై అత్యాచారం చేసిన దుండగులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఇలాంటి ఘటనలు కాకుండ పోలీసులు కఠినంగా శిక్ష పడేలా చూడాలన్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పక్కనే 8 ఏళ్ల బాలికపై అత్యాచారం జరగడం శోచనీయమన్నారు.ప్రభుత్వ అత్యాచారం నిందితులపై కఠినంగా శిక్షించాలని దిశ చట్ట ప్రకారం నిందితులను ఎన్కౌం టర్ చేయాలని డిమాండ్ చేశారు . బాలికకు న్యాయం జరిగే వరకూ మహిళా సమయ కండగా ఉంటుందని ప్రభుత్వం పోయి పోరాటం చేసి నిందితులో కఠినంగా శిక్ష పడేలా పడేలా పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరాజ్యం, రమేష్, శంకరప్ప, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణఖేడ్ నియోజకవర్గంలో పోస్టల్ కార్డుల ఉద్యమం

నారాయణఖేడ్ ఫిబ్రవరి 22(సాక్ష్యం న్యూస్ ) కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యార్థులకు రవాణా సౌకర్యం కొరకు ప్రతి ఒక్కరికి ఎలక్ట్రికల్ స్కూటీని పంపిణీ చేస్తామని కాంగ్రెస్ జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీ చెప్పి మమ్మల్ని మోసం చేశారని నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు పోస్టల్ కార్డు రాసి ప్రియాంక గాంధీ గారికి పోస్ట్ ద్వార పంపించారు.ఈ కార్యక్రమంలో గౌరవ నారాయణ ఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి కూతురు టిఆర్ఎస్వి స్టేట్ జనరల్ సెక్రెటరీ మహా రెడ్డి శ్రేయ రెడ్డి వారితోపాటు మాజీ టిఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షులు ఆంజా గౌడ్, జిల్లా నాయకులు అశోక్ రెడ్డి మండల పార్టీ యువత అధ్యక్షుడు మచ్చేందర్, నాయకులు ప్రశాంత్ సాగర్, చంద్ర శేఖర్ రెడ్డి, చింటూ నరేష్, ప్రమోద్ గౌడ్, భూమేష్, గౌరీ ప్రసాద్, లక్ష్మణ్ నాయక్, శంకర్ నాయక్ తదితరులు ఉన్నారు.



# రంజాన్ మాసంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలి..

* కలెక్టర్ జితేష్ వి. పాటిల్.




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఫిబ్రవరి 22 ,(సాక్షం న్యూస్ );** మార్చి రెండవ తేదీ నుండి ప్రారంభమయ్యే రంజాన్ మాసం కు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశం మందిరంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో చేయవలసిన ఏర్పాట్లపై శనివారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు,ముస్లిం మత పెద్దలతో సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మసీదుల వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, మసీదుల ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్త ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని, మంచినీటి సరఫరా లో భాగంగా బావులు, ట్యాంకులు శుభ్రం చేసి బ్లీచింగ్ చెల్లించాలని పంచాయతీ అధికారులు ఆదేశించారు. రంజాన్ మాసంలో నిర్వహించే ప్రార్థన సమయానికి అనుగుణంగా రెండు పూటలా త్రాగునీరు సరఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ప్రార్థన సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని, మసీదు పెద్దలకు ఆ ప్రాంతం లైన్మెన్ ఫోన్ నెంబర్ అందుబాటులో ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులు ఆదేశించారు. వేసవిలో ఎండ భావం వల్ల ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు, పర్యవేక్షణ చేపట్టాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రార్థన మందిరాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయవలసిందిగా పోలీస్ శాఖ అధికారులకు సూచించారు. రంజాన్ పర్వదినం రోజు సరిపడా పాలు అందుబాటులో ఉండే విధంగా విజయ డైరీ అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేయవలసిందిగా సిపిఓ సంజీవరావు ఆదేశించారు. జిల్లాలోని ఉన్న మసీదులు వాటి మత పెద్దల వివరాలను అందజేయాల్సిందిగా కోరారు. రంజాన్ మాసం సందర్భంగా ప్రజలకు వస్తువులు కొనుగోలు చేయటానికి ఇబ్బందులు కలగకుండా ఎక్కువ సమయం దుకాణాలు తెరిచి ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ అధికారిని ఆదేశించారు. ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలందరూ ఆనందంగా రంజాన్ పండుగను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి,వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ సుజాత, పోలీస్ శాఖ అధికారులు, కార్మిక శాఖ అధికారి, ఆర్ ఎం బి ఈఈ వెంకటేశ్వర్లు , విద్యుత్ శాఖ అధికారులు, ముస్లిం మత పెద్దలు , సంబంధిత అధికారులు , తదితరులు,పాల్గొన్నారు.

# సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ కళారంగంతోనే సాధ్యం

ఎంపీ డా.కడియం కావ్య



**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో మల్లేష్ (సాక్ష్యం న్యూస్ ):** భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ కళారంగంతోనే సాధ్యమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యఅన్నారు. వర్ధన్నపేటలోని ఎస్ ఎస్ ఎస్ కళావేదికలో భారతీయ నాటక కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన 51వ ఉభయ తెలుగు రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటికల పోటీల కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య రాష్ట్రస్థాయి నాటికల పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అంతరించిన పోతున్న నాటక రంగానికి భారతీయ నాటక కళాసమితి జీవం పోస్తున్నదని అన్నారు. అనేక మంది కళాకారులకు వేదికగా వర్ధన్నపేట భారతీయ నాటక కళాసమితి నిలిచిందని తెలిపారు. ఐదు దశాబ్దాలుగా పూర్వ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రస్తుత ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాల స్థాయిలో కళాకారులను ఆహ్వానించి నాలుగు రోజులపాటు నాటికల పోటీలను నిర్వహించడం ఎంతో గొప్ప విషయం అన్నారు. ఆధునిక యుగంలో యువత, పిల్లలు, మహిళలు సైతం టీవీ, సినిమాలు, సెల్‌ఫోన్లకు బానిసై మనదేశ సంస్కృతీ సంప్రదాయాలను మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో కళాసమితి ఆధ్వర్యంలో కళాకారులు తమ ప్రదర్శనలతో ప్రజలకు భారత సంస్కృతిని వివరిస్తున్నట్లు చెప్పారు. ఎన్ని ఉపన్యాసాలు ఇచ్చినా ప్రజల దరికి చేరవని, కళా రూపంలో ప్రజలకు ఏది చెప్పినా త్వరగా చేరిపోతుందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కళా రంగాన్ని ఎంతగానో ప్రోత్సహిస్తూ కళాకారులకు అండగా నిలుస్తుందని తెలియజేశారు. ప్రజలు కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, వారి ప్రదర్శనలతో ప్రజలు ఎంతో చైతన్యవంతులవుతారని చెప్పారు. వర్ధన్నపేట అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ జిల్లా యువకుల సాహసం..

*స్కూటీపై కుంభమేళా యాత్ర



**పోతంగల్ :** నిజామాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు అరుదైన సాహసం చేశారు. స్కూటీపై కుంభమేళా యాత్రకు వెళ్లొచ్చారు. కేవలం ఐదు రోజుల్లోనే వీరు తమ యాత్రను పూర్తి చేసుకుని రావడం విశేషం.వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలానికి చెందిన ఇద్దరు యువకులు సితాల సంతోశ్, సాదుల శ్రీధర్ ఇద్దరు స్నేహితులు. కుంభమేళాకు అందరూ వెళ్తుండటంతో తాము కూడా వెళ్లి రావాలని అనుకున్నారు. 144 ఏండ్లకు ఒకసారి వచ్చే ఈ మహాకుంభమేళాలో పవిత్ర స్నానం చేయాలని భావించారు. అనుకున్నదే తడవుగా యాత్రకు సిద్ధమయ్యారు. అయితే అందరిలా వీళ్లు బస్సులు, ట్రైన్లలో కాకుండా బైక్‌పై వెళ్లాలని నిర్ణయించారు.అనుకున్నదే తడువుగా ఈ నెల 18వ తేదీన ( మంగళవారం) పోతంగల్ మండలం నుంచి బయల్దేరి ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లారు. త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం వారణాసికి వెళ్లి కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి బయల్దేరి శనివారం మధ్యాహ్నానికి పోతంగల్‌కు చేరుకున్నారు. మొత్తం ఐదు రోజుల పాటు జరిగిన వీరి బైక్ యాత్రలో సుమారు 2500 కిలోమీటర్లు చుట్టేసి వచ్చారు. ఈ సందర్భంగా వారికి కుటుంబసభ్యులు, బంధుమిత్రులు సాదరస్వాగతం పలికారు. ఈ యాత్ర తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు.

# హైవేల నిర్వహణకు బడ్జెట్ విడుదల

**హైదరాబాద్,** జాతీయ రహదారుల నిర్వహణ కోసం రూ. 23.18 కోట్లు, వరదకు దెబ్బతిన్న ప్రాంతాల్లో రోడ్లు, భవనాల మరమ్మతులకు 18.26 కోట్లు విడుదల చేశారు.ఇంజినీర్ ఇన్ చీఫ్ , ఎన్‌హెచ్ హైదరాబాద్‌కు మూడో త్రైమాసికానికి బడ్జెట్ విడుదల చేస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ఉత్తర్వు జారీచేశారు.




# అగ్నిదేవుని అనుగ్రహం

**అగ్నే నయ సుపథారాయే అస్మాన్**
**విశ్వాని దేవ వయునాని విద్వాన్**
**యుయోధ్యస్మజ్జు హురాణమేనో**
**భూయిష్ఠాం తే నమ ఉక్తిం విధేమ**
**(ఈశావాస్య ఉపనిషత్తు)**

‘అగ్నిదేవా! మమ్మల్ని మంచి మార్గంలో నడిపించు. నీకు అన్ని కర్మలూ తెలుసు. మా పాపాలు విడిపించు. నీకు నమస్కారం..’ అని పై ఉపనిషత్ శ్లోకానికి భావం. బ్రహ్మజ్ఞానానికి అగ్ని ఉపాసన చాలా ముఖ్యం.

అరుణాస్పదపురంలో అందగాడు, శీలవంతుడు అయిన ప్రవరుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. ఎన్నో తీర్థక్షేత్రాలు దర్శించిన ఒక సిద్ధుడు ‘ఈ పాదలేపంతో ఎక్కడికైనా వెళ్లవచ్చు’ అని ఒక పసరు ప్రవరుని పాదాలకు పూశాడు. ప్రవరుడు హిమాలయం చూడాలనుకున్నాడు. మరుక్షణంలో అక్కడికి చేరుకున్నాడు. అనేక పవిత్ర ప్రదేశాలు దర్శించుకున్నాడు. ఇంటికి వెళ్దామనుకుంటే మంచు వల్ల పసరు కరిగిపోయింది. దిక్కు తోచక హిమగిరుల్లో సంచరిస్తున్న ప్రవరుడికి దూరం నుంచి ఏదో గానం వినిపించింది. ఆశ్రమం అనుకొని అటుగా వెళ్లాడు. ఒక భవనాన్ని, ఉద్యానవనాన్ని, మధురంగా వీణ మీటుతూ పాడుతున్న దేవకాంతను చూశాడు. ‘నన్ను ప్రవరుడు అంటారు. దారి తప్పాను. మా ఊరికి వెళ్లే మార్గం చెప్పి పుణ్యం కట్టుకో!’ అని ఆ దేవకాంతను అడిగాడు. ఆమె పేరు వరూధిని. అందచందాల ప్రవరుణ్ని చూడగానే ఆమె అతణ్ని మోహించింది.మరోవైపు తన అగ్నిహోత్రానికి ఆలస్యం అవుతుందని బాధపడుతున్నాడు ప్రవరుడు. ‘ఈ ఇసుక తిన్నెలలో, పొదరిళ్లలో నాతో స్వర్గసుఖాలు అనుభవించు’ అని ప్రవరుడితో అన్నది వరూధిని. ‘నా తల్లిదండ్రులు వృద్ధులు. ఆకలితో నిరీక్షిస్తారు. నన్ను త్వరగా ఇల్లు చేర్చండి’ అని బతిమలాడు ప్రవరుడు. ‘ఇంద్రియాల సుఖమే పరబ్రహ్మం’ అన్నదామె. ఐహిక సుఖాలపట్ల వైముఖ్యాన్ని, వైదిక కర్మల ధర్మపరత్వాన్ని వినిపించుకోలేదు. పైగా కౌగిలించుకోబోయింది. ప్రవరుడు ‘హరి హరీ’ అని ఆమెను పక్కకు తోసేశాడు. వరూధిని పరాభవంతో విలపించింది. ఆమె హత్తుకోబోతే అంటిన సుగంధ ద్రవ్యాలను ప్రవరుడు కోనేటిలో కడుక్కొని పవిత్రుడై ఇలా ప్రార్థించాడు.‘హవ్యవాహనా! నేను దాన జపాగ్ని హోత్రాలు తప్పనివాడినైతే త్రికరణ శుద్ధిగా నీ భక్తుడినైతే పరసతులను కోరని వాడినైతే నన్ను పొద్దువాలక ముందే సగౌరవంగా ఇంటికి చేర్చు’ అని వేడుకున్నాడు. మరుక్షణంలో అగ్నిహోత్రుడు దివ్య తేజస్సు ప్రసాదించాడు. క్షణంలో ప్రవరుడు తన ఇంట్లో ఉన్నాడు. నిత్యకర్మలు నిర్విఘ్నంగా నిర్వర్తించుకున్నాడు. అగ్నిని ఆరాధించే నిష్ఠాగరిష్ఠులు ఇలా ఉంటారని ప్రవరుడి వృత్తాంతం తెలియజేస్తుంది.





# నడక VS మెట్లు ఎక్కడం.. బరువు తగ్గడానికి ఏది మంచిది

శరీరం, ఆరోగ్యంపై దృష్టి పెట్టడం చాలా ముఖ్యం. లేదంటే తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం చాలా అవసరం. వ్యాయామాలపై దృష్టి పెట్టడం ద్వారా ఫిట్‌నెస్ పెరుగుతుంది. అంతేకాకుండా ఆరోగ్యంగా కూడా ఉంటారు. చాలా మంది బరువు తగ్గడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తారు. అందులో నడవడం, మెట్లు ఎక్కడం వంటి వ్యాయామాలు చేస్తారు. అయితే, ఈ రెండింటిలో బరువు తగ్గడానికి ఏది మంచిది? అనే విషయం గురించి ఇప్పుడు తెలుసుకుందాం..ఎక్కువ పని చేయడం అంటే ఎక్కువ కేలరీలు ఖర్చు చేయడం. 15 నిమిషాల మెట్లు ఎక్కడం = 45 నిమిషాల చురుకైన నడక. మీరు వాకింగ్ లేదా రన్నింగ్‌కు బయటకు వెళ్లాల్సి వస్తుంది కానీ, ఇంట్లోనే మెట్లు ఎక్కడం వల్ల మీ కండరాలు యాక్టివ్ అవుతాయి. నడక కన్నా కూడా మెట్లు ఎక్కే సమయంలో ఎక్కువ శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది. బరువు తగ్గాలనుకునే వారు మెట్లు ఎక్కడం చాలా మంచిది. అయితే, కొన్ని సమస్యలు ఉన్న వారు మెట్లు ఎక్కడం మంచిది కాదు.

గుర్తుంచుకోవలసిన విషయాలు:మెట్లు ఎక్కడం అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తున్నప్పటికీ, మీరు దానిని నివారించాల్సిన ప్రత్యేక సందర్భాలు ఉన్నాయి.

మీకు 70 ఏళ్లు పైబడి ఉంటే లేదా కీళ్ళు, మోకాలి సమస్యలు ఉంటే మెట్లు ఎక్కడం మంచిది కాదు.

మీరు గర్భవతిగా ఉండి, ప్రసవానికి దగ్గరగా ఉంటే మెట్లు ఎక్కకూడదు.

మీరు ఇటీవల యాంజియోప్లాస్టీ చేయించుకున్నట్లయితే లేదా గుండె సమస్య కలిగి ఉంటే మెట్లు ఎక్కడం మంచిది కాదు.

మీరు శరీర దిగువ భాగంలో జరిగిన గాయం నుండి కోలుకుంటుంటే మెట్లు ఎక్కనవసరం లేదు.

## చల్లచల్లగా.. ఆరోగ్యంగా!

మండే ఎండకాలం మొదలైంది. వేడి వాతావరణంలో శరీరాన్ని చల్లగా ఉంచడానికి చాలామంది కూల్ డ్రింక్స్‌ను ఆశ్రయిస్తుంటారు. రసాయనాలు, ప్రిజర్వేటివ్స్, గ్యాస్ కలిసిన వీటిని తాగితే.. ఆరోగ్యం దెబ్బతింటుంది. కాబట్టి, ఈ సమ్మర్‌లో వాటి జోలికి వెళ్లకుండా.. ఇంట్లో లభించే పదార్థాలతోనే ఆరోగ్యకరమైన పానీయాలు చేసుకోండి. ఇవి.. ఎండల నుంచి రక్షణను ఇవ్వడమే కాదు, ఆరోగ్యానికి మంచి చేస్తాయి. ఒంట్లో వేడిని తగ్గించి.. శరీరానికి కొత్త శక్తిని అందిస్తాయి.

**పైనాపిల్- నిమ్మరసం:** వేసవి వేడితో అలసటకు గురయ్యే వారికి.. పైనాపిల్ – నిమ్మరసం డ్రింక్ ఎంతో మేలుచేస్తుంది. నాలుగు నుంచి ఐదు పైనాపిల్ ముక్కలను నిమ్మరసంతో కలిపి బ్లెండ్ చేసుకోవాలి. దీనికి కొద్దిగా చల్లని నీటిని జోడించి తాగితే.. శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. తీపి కోసం కొద్దిగా తేనెను కలుపుకోవచ్చు.

**అల్లం – నిమ్మకాయ:** లీటర్ నీటిలో ఒక నిమ్మకాయను పూర్తిగా పిండండి. అంగుళం అల్లం ముక్క, పుదీనా ఆకులను మెత్తగా దంచి నీటిలో బాగా కలపండి. ఈ మిశ్రమానికి చిటికెడు నల్ల మిరియాల పొడి కలిపి తాగితే.. జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. నానబెట్టిన చియా విత్తనాలను కూడా జోడిస్తే.. ఒంటికి చలువ చేస్తుంది.

**నిమ్మకాయ —పుదీనా**

ఒక లీటర్ నీటిని తీసుకొని.. ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం, నాలుగైదు పుదీనా ఆకులు వేయాలి. దీనికి కొద్దిగా ఉప్పు, తేనె జోడించి తాగితే.. శరీరానికి తక్షణ చల్లదనం లభిస్తుంది. చల్లచల్లగా తాగాలనుకుంటే.. ఐస్ క్యూబ్స్‌తో కలిపి కూడా తాగవచ్చు. నిమ్మకాయలో లభించే విటమిన్ సి శరీరాన్ని హైడ్రేట్ చేయడంతోపాటు పుదీనా ఆకులు జీర్ణ వ్యవస్థకు మేలుచేస్తాయి.

**జీలకర్ర – నిమ్మకాయ**

లీటర్ నీటిలో రెండు టేబుల్ స్పూన్ల జీలకర్ర వేసి.. స్టవ్ మీదపెట్టి బాగా మరగనివ్వండి. ఆ తర్వాత నీటిని వడగట్టి.. అందులో ఒక నిమ్మకాయ రసాన్ని పిండి.. కాసేపు ఫ్రిజ్‌లో పెట్టేయండి. ఈ నీటిని చల్లచల్లగా తాగితే.. ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తుంది. దీనికి దాల్చినచెక్క పొడి, తేనె కలిపితే మరిన్ని ప్రయోజనాలు అందుతాయి. ఈ డ్రింక్.. శరీరంలో వేడిని తగ్గించడంతోపాటు జీర్ణక్రియనూ మెరుగుపరుస్తుంది.

# వాల్‌నట్స్ VS బాదం..

**జ్ఞాపకశక్తిని పెంచడానికి ఏది మంచిది..**

మన మెదడు శరీరంలో అతి ముఖ్యమైన భాగం. న్యూరాన్ల సహాయంతో మెదడు మొత్తం శరీరాన్ని నియంత్రిస్తుంది. మన మెదడు ఎలా వ్యవహరించాలో ఆదేశాలు ఇస్తుంది. కాబట్టి మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే మెదడు సంబంధిత సమస్యలు మన మొత్తం శరీరాన్ని, జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల, మెదడును ఆరోగ్యంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం.అయితే, మన జీవనశైలిలోని కొన్ని అలవాట్లు మనకు తెలియకుండానే మన మెదడుకు చాలా హాని కలిగిస్తాయి. ఇది మన జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం, ఏకాగ్రత మొదలైన వాటిపై ప్రభావాన్ని చూపుతుంది. కాబట్టి మెదడు ఆరోగ్యానికి వాల్‌నట్‌లు, బాదం పప్పులలో ఏది మంచిదో ఇప్పుడు తెలుసుకుందాం..

**మెదడు ఆరోగ్యానికి రెండూ మంచివి..**

వాల్‌నట్‌లు, బాదం పప్పు రెండూ మెదడు ఆరోగ్యానికి మంచివి. ఈ రెండు గింజలు ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలతో సమృద్ధిగా ఉంటాయి. పోషక సాంద్రతలో రెండూ ఒకేలా ఉన్నప్పటికీ, వాటి కూర్పులో తేడాలు ఉన్నాయి. వాల్‌నట్‌లలో ముఖ్యమైన కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి మెదడుకు చాలా మంచివి. వాల్‌నట్‌లలో విటమిన్ ఇ తక్కువగా ఉంటుంది. అలాగే, బాదం పప్పులో ప్రోటీన్, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. అవి మెదడు కణాలను రక్షిస్తాయి. మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి వీటిలో ఏది తినడం మరింత ప్రయోజనకరంగా ఉంటుందో తెలుసుకుందాం..

**వాల్‌నట్స్ ప్రయోజనాలు**

వాల్‌నట్స్‌లో ఆరోగ్యకరమైన పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండెను రక్షించే లక్షణాలను కలిగి ఉంటాయి. వాల్‌నట్స్‌లో అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. దీనితో పాటు, వాల్‌నట్స్‌లో ఒమేగా-3 పుష్కలంగా ఉంటాయి. ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు వాపును తగ్గించడానికి, రక్తపోటును తగ్గించడానికి, (మంచి) కొలెస్ట్రాల్‌ను పెంచడం ద్వారా (చెడు) కొలెస్ట్రాల్‌ను తగ్గించడం ద్వారా కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరచడంలో సహాయపడతాయి. వాల్‌నట్స్‌లో అధిక స్థాయిలో యాంటీఆక్సిడెంట్లు, పాలీఫెనాల్స్ ఉంటాయి. వాల్‌నట్స్ గుండె, మెదడు ఆరోగ్యానికి చాలా మంచివని నిపుణులు కూడా అంటున్నారు.

ఇందులో ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇది మొక్కల ఆధారిత ఒమేగా-3 కొవ్వు ఆమ్లం, ఇది మెదడు పనితీరుకు సహాయపడుతుంది. వాల్‌నట్స్ తీసుకోవడం వల్ల జ్ఞాపకశక్తి కోల్పోకుండా నిరోధించవచ్చు. కొన్ని అధ్యయనాలు ఒమేగా-3 జ్ఞాపకశక్తి, మెదడు పనితీరును మెరుగుపరుస్తుందని చూపించాయి. ఇందులో యాంటీఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని ఎదుర్కోవడంలో ఉపయోగపడతాయి. వాల్‌నట్స్ గుండె ఆరోగ్యాన్ని బలపరుస్తాయి. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. వాల్‌నట్స్‌లో ఉండే పాలీఫెనాల్స్, ఆరోగ్యకరమైన కొవ్వులు న్యూరాన్‌ల పనితీరు, కమ్యూనికేషన్‌కు మద్దతు ఇస్తాయి. అందువల్ల, ఇది జ్ఞాపకశక్తి, మెదడు పనితీరును ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది.

**బాదం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు**

బాదంలో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. ఈ కొవ్వులు LDL కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడం ద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. అదనంగా, బాదం విటమిన్ E కి మంచి మూలం, ఇది యాంటీఆక్సిడెంట్, ఇది కణాలకు ఆక్సీకరణ నష్టాన్ని నివారించడం ద్వారా గుండెను రక్షిస్తుంది.



# హద్దులు చెరిపి.. ఆటో నడిపి!




**జీవితమే ఓ ప్రయాణం. అందులో ఎన్నో మలుపులూ మైలురాళ్లూ ఉంటాయి. ఈ ప్రయాణాన్ని సౌకర్యవంతంగా మార్చుకునేందుకు కొందరు పేద మహిళలు తమ బండిని తామే నడుపుకొనే ఆలోచనలు సాగిస్తున్నారు. కోరుకున్న గమ్యానికి మనల్ని చేర్చే ఆటో, బైక్‌ల డ్రైవింగ్ నేర్చుకుని జీవనోపాధి సాధించాలని ఆశపడుతున్నారు. ఆంధ్రమహిళా సభ ప్రాంగణంలో 'మూవింగ్ బౌండరీస్' పేరుతో మోవో సంస్థ ఉచితంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగమవుతూ తమ లక్ష్యాలకు బాటలు వేసుకుంటున్నారు.'ఈ శిక్షణ మా జీవితంలో ఓ మలుపు.. రేపు మాదే గెలుపు' అంటూ ఉత్సాహంగా చెబుతున్న ఈ మహిళలతో జిందగీ మాటా మంతీ!**




ఇంటిపట్టున ఉండి పిల్లల్ని చూసుకోవడం ఒక బాధ్యత. ఇల్లు గడవడానికి సాయంగా ఉండటం మరో బాధ్యత. తొలిదాన్ని విజయవంతంగా పూర్తిచేస్తూనే సంపాదనకు సాయంగా ఉండాలని ఆశపడుతున్న చాలామంది మహిళలు డ్రైవింగ్ వైపు మొగ్గు చూపుతున్నారు. తమ స్తోమతకు అవసరాలకు తగ్గట్టు పనులు పూర్తిచేసుకునేలా ఆటో, బండి నేర్చుకుంటున్నారు. జరీన, నవీన, ఫర్హద్ ఇలా ఎందరో ఈ దోవలో తమ విజయాన్ని వెతుకుతున్నారు. ఆశలే వీళ్ల ఇంధనం. ఆశయమే వీరి గమ్యస్థానం. 'డ్రైవింగ్ నేరుస్తాం.. సాధికారత సాధిస్తాం' అంటూ ఈ కొత్త డ్రైవరమ్మలు మునుముందుకు సాగుతున్నారు.

**తోడుగా ఉండాలని**

పరదాలు దాటి రహదారులవైపు నడుస్తున్నది పాతబస్తీ జీవితం. ఇరుకైన వీధులు, శిథిలమైన ఇళ్లు, బ్యాంక్ బ్యాలెన్స్ లేని బతుకులు మారాలని పాతబస్తీ ఆడబిడ్డ జరీనా బేగం కలలు కంటున్నది. చార్మినార్‌కు మూడు కిలోమీటర్ల దూరంలోని డబీర్‌పురాలో ఉంటున్నదామె. తనకు ఇరవై ఏండ్ల క్రితం పెండ్లయ్యింది. ఇంటిపట్టునే జీవితం. ఇద్దరు పిల్లలు. వాళ్లాయన ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని నడుపుకొస్తున్నాడు. పిల్లలు పెద్దవాళ్లవుతున్నారు. పై తరగతులకు పోతున్నకొద్దీ చదువుల భారం పెరుగుతున్నది. చన్నీళ్లకు వేన్నీళ్లు తోడైనట్టు సాయిబు సంపాదకు బూబమ్మ ఆదాయం తోడైతేనే పిల్లల చదువులు గట్టెక్కుతాయనుకున్నది.

పిల్లలు తమలా పేదరికంలో ఉండొద్దని కోరుకున్నది. మంచి చదువుతో వాళ్ల భవిష్యత్‌ని తీర్చిదిద్దడం కోసం తాను ఏదో ఒక పని చేయాలనుకున్నది. చిన్న వ్యాపారం చేయడానికి కావాల్సిన పెట్టుబడైనా ఆమెకు పెద్ద మొత్తమే. పెట్టుబడి లేనప్పుడు ఉద్యోగమైనా చేయాలి. ఆ ఉద్యోగానికి కూడా ఏ స్కిల్ లేదు. అందుకే ఆటో డ్రైవింగ్ నేర్చుకుని సంపాదించాలనుకుంది. 'కార్ డ్రైవింగ్ నేర్పేవాళ్లు ఉన్నారు. కానీ, ఆటో డ్రైవింగ్ నేర్పేవాళ్లు ఉన్నారా?' అని ఆరాతీస్తే 'మూవింగ్ బౌండరీస్' గురించి తెలిసింది. ఆ అడ్రస్ పట్టుకుని కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డ్ కాలనీలోని ఆంధ్ర మహిళా సభ ప్రాంగణానికి వచ్చింది. ఆటో డ్రైవింగ్ నేర్పడమే కాదు, ఫీజుగా పైసా కూడా తీసుకోమని మూవింగ్ బౌండరీస్ నిర్వాహకులు చెబితే ఆమె సంతోషంగా చేరిపోయింది.

**ఆటోమేటిక్ లైఫ్**

'ఆడవాళ్లు ఆటో నడపడం నేర్చుకుని ఏం చేస్తారు?' బంధువులే కాదు బయటి వాళ్లూ అడుగుతారు. అలాంటి వాళ్లకు 'మగవాళ్లతో పోటీపడకపోయినా మాకు అవకాశం ఉన్నంతవరకు ఆటోని ఆదాయ వనరుగా మార్చుకుంటాం' అని సమాధానం చెబుతున్నది ఫర్హద్ బేగం. గోల్కొండలో ఉండే తాను ఇంటి పనులు పూర్తి చేసుకుని, పిల్లల్ని స్కూల్‌కి పంపిన తర్వాత డ్రైవింగ్ స్కూల్‌కి బయలుదేరుతుంది. ఆటో డ్రైవింగ్ నేర్చుకున్న తర్వాత ఏం చేస్తావంటే? 'నా ఇద్దరు పిల్లల్ని ఆటోలో తీసుకుపోతాను. వాళ్ల ఫీజు మిగులుతుంది. ఇంకో నలుగురు పిల్లల్ని కూడా ఎక్కించుకుపోతాను. ఆదాయం వస్తుంది' అని భవిష్యత్ ప్రణాళిక చెప్పింది. ఆటో ఎందుకు నేర్చుకోవాలనిపించింది అని అడిగితే 'మా మరిది స్కూల్ ఆటో నడుపుతాడు. మా ఆయన బైక్ మీద కూరగాయలు అమ్ముతాడు. నాకు డ్రైవింగ్ రాకపోబట్టే కదా ఏ పనీ చేయలేకపోతున్నాను. సంపాదించలేకపోతున్నా. అందుకే ఆటో నేర్చుకోవాలనుకున్నా' అని చెబుతుందామె. తనలా ఆటో నేర్చుకోవడం కోసం వచ్చిన మహిళలతో కలిసి సరదాగా డ్రైవింగ్ నేర్చుకుంటున్నది.

**నవీన 'పథం'**

డాక్టర్ భార్య డాక్టర్, లాయర్ భార్య లాయర్‌గా పని చేస్తున్నారు. డ్రైవర్ భార్య డ్రైవర్‌గా ఎందుకు పని చేయకూడదు? ఆ పని చేసి చూపిస్తానంటున్నది బాన్సువాడ ఆణిముత్యం ముత్యపు నవీన. వైశ్య కుటుంబంలో పుట్టిన నవీనకు వ్యాపారం వెన్నతో పెట్టిన విద్య. పెళ్లికి ముందు కిరాణాషాప్ నడిపింది. పెళ్లయిన తర్వాత లేడీస్ ఎంపోరియం పెట్టింది. హోల్‌సేల్ షాపుల నుంచి సరుకు తెచ్చుకోవడానికి ట్రాన్స్‌పోర్ట్ సమస్యలు పడలేక ఆటో కొనుక్కుందామనుకుంది. తన భర్త డ్రైవరే. కానీ, ఆయన కారు ఊళ్ల మీదకు పోతే ఎప్పుడో వస్తుంది. అప్పటిదాకా ఎదురుచూడకుండా తానే సరుకులు తెచ్చుకోవాలని ఆటో నేర్చుకుంటున్నది. 'ఆటో కొన్న తర్వాత చీరల వ్యాపారం కూడా మొదలుపెట్టి బస్తీలకు పోయి అమ్ముతా. మాకు నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. ఇద్దరం రెండు చేతులా సంపాదించి, వాళ్లని ప్రయోజకులయ్యేలా చదివిస్తాం' తన ఆలోచనలను పంచుకుంటున్నది నవీన.

**తొలి అడుగు నుంచీ**

'డ్రైవింగ్ చేయడానికి డ్రైవింగ్ లైసెన్స్ కావాలని చాలామందికి తెలుసు. కానీ, నేర్చుకోవడానికి లెర్నింగ్ లైసెన్స్ ఉండాలని కొంతమందికి తెలియదు. మా దగ్గరికి వచ్చినవాళ్లకు మొదట డ్రైవింగ్ లైసెన్స్‌కి అర్హతలు, రోడ్లపక్కన ఉండే సూచికలు, హెచ్చరిక చిహ్నాల గురించి అవగాహన ఉండాలని చెబుతాం. లెర్నింగ్ లైసెన్స్ తెచ్చుకోమంటే పోయినవాళ్లు మళ్లీ తిరిగి వస్తారో? రారో? ఇంట్లో వాళ్ల సహకారం లేకపోవడం, బయటివాళ్ల మాటలు వాళ్లకు ఆటంకాలు కావచ్చు. తొలి ప్రయత్నమే డెడ్ ఎండ్‌గా మారకుండా, లెర్నింగ్ లైసెన్స్ కోసం అయిదు రోజులపాటు అవగాహన కల్పిస్తాం. కావాలంటే లెర్నింగ్ లైసెన్స్ కోసం సహకరిస్తాం. అది చేతికి వచ్చిన తర్వాత డ్రైవింగ్ సీట్లో కూర్చోబెట్టి లెర్నింగ్ లెసన్స్ మొదలుపెడతాం. 15 నుంచి 50 రోజుల్లో ఆటో రివర్స్ డ్రైవింగ్ కూడా నేర్చుకుంటారు. ఆ తర్వాత లైసెన్స్ తెచ్చుకుంటారు' అని మూవింగ్ బౌండరీస్ ఇన్‌స్ట్రక్టర్ శ్వేత చెబుతున్నది. జరీనా లాగే ఆటో నడపడం నేర్చుకోవడం కోసం వచ్చినవాళ్లంతా భయంలేకుండా సరదాగా డ్రైవింగ్ నేర్చుకుంటున్నారు.

ఇన్‌స్ట్రక్టర్ చెప్పినట్లు ఒకరి తర్వాత ఒకరు ట్రయల్స్ వేస్తున్నారు. హైదరాబాద్ రోడ్ల మీద కార్ నడిపే ఆడవాళ్లు కనిపిస్తారు. ఆటో నడిపేవాళ్లు, ఆటో డ్రైవింగ్ నేర్చుకుంటామనే వాళ్లు చాలా తక్కువ. అయినా ఆటో డ్రైవింగ్ ఎందుకు నేర్పిస్తున్నారని అడిగితే.. 'కార్ కొనే స్తోమత ఉన్నవాళ్ల కోసం డ్రైవింగ్ స్కూల్స్ ఉన్నాయి. విడిగా నేర్చుకోవాలనుకున్నా అవి అందుబాటులో ఉంటాయి. కానీ పేదవాళ్ల కోసం మేం పనిచేస్తున్నాం. తమకాళ్ల మీద తాము నిలబడాలనుకునే దిగువ మధ్యతరగతి వాళ్లు ఆటో స్టీరింగ్ పట్టాలని ఆసక్తిగా ఉన్నారు. వాళ్ల ఉత్సాహానికి మా ప్రోత్సాహం తోడై ఎంతోమంది సక్సెస్‌ఫుల్‌గా ఆటోలు నడుపుతున్నారు' అని మోవో వ్యవస్థాపకురాలు జై భారతి అన్నారు. హైదరాబాద్‌లో మొదలైన మూవింగ్ బౌండరీస్ తెలంగాణలోని పట్టణాలు దాటి, భారతదేశంలోని మెట్రో సిటీల దాకా విస్తరించింది.

**ఆలూమగల అనుబంధం!**

మొగుడే చక్రం తిప్పాలనుకుంటే చాలా తిప్పలుంటాయి. కాబట్టి ఆడవాళ్లకు కూడా చక్రంపై సవారీ నేర్పిస్తే మగవాళ్ల జీవితం కూడా హ్యాపీగా ఉంటుందంటున్నారు అశోక్. ఓ ఎఫ్ఎంసీజీ కంపెనీలో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆయన తరచుగా ప్రయాణాలు చేస్తూ ఉంటారు. 'ఇంట్లో అవసరం అనగానే క్షణాల్లో వాలిపోలేను. పిల్లల్ని స్కూల్ దగ్గర దింపడం, తీసుకురావడం నా ఉద్యోగానికి కొంచెం ఇబ్బంది. అయినా సర్దుకుంటున్నాం. ఏదైనా ఫంక్షన్ ఉంటే పిల్లలు, భార్యని తీసుకుపోవడం కోసం డ్యూటీ పక్కన పెట్టి రావాల్సి వస్తుంది. అదే తనకు డ్రైవింగ్ వచ్చి ఉంటే పిల్లలతో తను ఫంక్షన్లకు పోతుంది. నేను ఇంటికి చేరకముందే వాళ్లు ఇంటికి చేరుకుంటారు.

నా మీద ఆధారపడకుండా తనే షాపింగ్‌కి పోవచ్చు. బైక్ డ్రైవింగ్ నేర్చుకుంటానంటే పోదాం పదా అంటూ బైక్ మీద తీసుకొచ్చాను' అని అశోక్ అంటే.. 'మొదట్లో మా ఆయనే నన్ను బైక్ మీద తీసుకువచ్చారు.

ఇప్పుడు నేను ఆయన్ని ఇంటి దాకా వెనుక కూర్చోబెట్టుకుని తీసుకుపోతున్నాను' అంటూ సంతోషం పంచుకుంటున్నది అశోక్ భార్య శిల్ప. డ్రైవింగ్‌ని కేవలం సంపాదన కోసమే కాదు జీవితావసరాల కోసం కూడా నేర్చుకోవాలని మరి కొంతమంది మహిళలు చెబుతున్నారు. మూవింగ్ బౌండరీస్‌లో డ్రైవింగ్ నేర్చుకుంటున్న వాళ్లందరి నేపథ్యాలు వేరైనా భవిష్యత్ లక్ష్యం ఒకటే రహదారే ఆశల వారధి. కొత్త ఆశలకు రహదారులు వేసుకుంటున్న వాళ్ల ప్రయాణం సురక్షితంగా గమ్యం చేరాలని ఆశిద్దాం!



# ఎంతెత్తు భయమో!

ఎత్తయిన చోట ఉన్నప్పుడు పడిపోతామేమోననే భయంతో కొంతమంది బిగుసుకుపోతారు. జాగ్రత్తపడటం మంచిదే. కానీ, పడిపోకుండా రక్షణ ఉన్నా భయపడతారు. పర్వతాలు, వంతెనలు, ఎత్తయిన కట్టడాలపైకి వెళ్లినప్పుడు అందరూ ఉల్లాసంగా గడిపేస్తుంటే వీళ్లు తమతోపాటు పక్కవాళ్లను కూడా భయపెడుతుంటారు. ఎత్తయిన ప్రదేశంలో నిలబడి సుదూరాన్ని చూస్తుంటే సంతోషానికి బదులు భయం కలుగుతుంటే ఆక్రోఫోబియా ఉందని అర్థం చేసకోవాలి. దీన్ని తేలిగ్గా అధిగమించవచ్చు.ఆక్రోఫోబియా మీ మనసు, శరీరంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో మొదటగా అర్థం చేసుకోండి. అప్పుడు దాన్ని పోగొట్టుకోవడానికి మీ అంతట మీరే ప్రయత్నిస్తారు. ఆక్రోఫోబియా నుంచి బయటపడటానికి కొద్దిపాటి ఎత్తయిన ప్రదేశాలకు తరచుగా పోతూ ఉండాలి. ఎత్తయిన ప్రదేశాల్లో ఉన్నప్పుడు సుదీర్ఘంగా గాలి పీల్చుకోవడం, మనసును అదుపులో పెట్టుకోవడానికి కొంచెంసేపు ధ్యానం చేయండి. అప్పుడు ఆందోళన తగ్గుతుంది. మిమ్మల్ని ఉత్సాహపరిచే వాళ్లకు దగ్గరగా ఉండండి.

# హంపిలో వాలిపోదాం!



హంపి ఉత్సవకు వేళైంది. విజయనగర సామ్రాజ్య వైభవాన్ని కళ్లకు కట్టే 'హంపి' నగరం వేదికగా.. ఈ మెగా ఈవెంట్ జరగనున్నది. ఫిబ్రవరి 28న ప్రారంభమై, మార్చి 2 వరకు మూడురోజులపాటు కొనసాగనున్నది. ఈ సందర్భంగా నిర్వహించే 'హంపి బై స్కై'తోపాటు అనేక వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. వింటేజ్ కార్ ర్యాలీతోపాటు స్పోర్ట్స్ బైక్ స్టంట్స్ లాంటి సాహస ప్రదర్శనలూ అలరిస్తాయి. హంపిని సందర్శించేందుకు ఇదే మంచి సమయం. అయితే, 'హంపి ఉత్సవ' సందర్భంగా పర్యాటకుల తాకిడి పెరుగుతుంది.కాబట్టి, ఇక్కడికి వెళ్లాలని అనుకునేవారు స్థానిక హోటళ్లలో ముందస్తు బుకింగ్స్ చేసుకోవాలి. హంపిలో వాతావరణం వేడిగా ఉంటుంది. ఎండలు మొదలైన నేపథ్యంలో.. అందుకు తగ్గ ఏర్పాట్లూ చేసుకోవాలి. వేడి వాతావరణానికి తగ్గట్టుగా తేలికపాటి దుస్తులే తీసుకెళ్లాలి. ఎక్కువ దూరం నడవడానికి, సూర్యుడి నుంచి రక్షణకు అనువుగా, సౌకర్యవంతంగా ఉండే బూట్లు ధరించడం మంచిది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే డీహైడ్రేట్ అయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి.. రోజంతా తగినంత నీరు తాగుతూ ఉండాలి.

# వాడకుంటే.. అంతే!




క్రెడిట్ కార్డు.. ఒకప్పుడు వ్యాపారులు, ఉన్నత ఉద్యోగుల దగ్గరే కనిపించేది. ఇప్పుడు ఆదాయంతో సంబంధం లేకుండా అందరి చేతుల్లోనూ దర్శనమిస్తున్నది. చేతిలో డబ్బులు లేకపోయినా.. అత్యవసర సమయాల్లో ఆదుకుంటుంది. కనీసం.. 40 రోజుల దాకా ఎలాంటి వడ్డీ లేకుండా బిల్లు చెల్లించే అవకాశం కల్పిస్తుంది. ఇలాంటి ఎన్నో కారణాల వల్ల.. క్రెడిట్ కార్డుల వినియోగం పెరుగుతున్నది. అంతేకాదు.. ఒక్కొక్కరి దగ్గర రెండుమూడు కార్డులూ ఉంటున్నాయి. ఈ క్రమంలో అందరూ అన్ని కార్డులనూ వాడలేరు. ఎక్కువ రివార్డ్స్ పాయింట్స్ ఇచ్చేవాటిని వాడుతూ.. మిగతావి పక్కన పడేస్తుంటారు. క్రెడిట్ కార్డులను వాడకుంటే.. బిల్లులు పెండింగ్ ఉండవు కాబట్టి, ఎలాంటి ఇబ్బందీ ఉండదని అనుకుంటారు. అయితే.. నిరుపయోగంగా ఉండే క్రెడిట్ కార్డ్‌తో కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.సాధారణంగా క్రెడిట్ కార్డును ఆరు నెలల నుంచి ఒక సంవత్సరం వరకు ఉపయోగించకపోతే.. అది ఇన్‌యాక్టివ్‌గా మారుతుంది. అయితే, అంతకుముందే క్రెడిట్ కార్డ్ జారీచేసిన సంస్థ సంప్రదిస్తుంది. కార్డును తిరిగి యాక్టివేట్ చేసుకోవడానికి అవకాశం కల్పిస్తుంది. ఏ కారణం చేతనైనా దాన్ని ఉపయోగించుకోకుంటే.. క్రెడిట్ అకౌంట్‌ను ఇన్‌యాక్టివ్ విభాగం కిందికి మారుస్తుంది. ఈ పరిణామం.. వినియోగదారుల క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది. క్రెడిట్ ఖాతాను మూసివేయడం వల్ల క్రెడిట్ స్కోర్ తగ్గుతుంది. అంతేకాకుండా.. క్రెడిట్ వినియోగ నిష్పత్తి కూడా పెరుగుతుంది. క్రెడిట్ స్కోర్ బాగుండాలంటే.. క్రెడిట్ వినియోగం తక్కువగా ఉండాలి. అంటే, క్రెడిట్ కార్డు పరిమితిలో 30 శాతానికి మించకుండా వినియోగించుకోవాలి. అదే.. ఏదైనా కార్డ్ క్లోజ్ అయితే, మిగిలిన కార్డ్‌పైనే ఎక్కువగా ఆధారపడాల్సి వస్తుంది. దాంతో వాటి ద్వారానే ఎక్కువ ఖర్చు చేయాల్సి రావడం వల్ల క్రెడిట్ వినియోగ నిష్పత్తి పెరుగుతుంది. ఫలితంగా, క్రెడిట్ స్కోర్ తగ్గుతుంది. దీంతోపాటు క్రెడిట్ కార్డుతో వచ్చే రివార్డులు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు వంటి ప్రయోజనాలను కోల్పోవాల్సి వస్తుంది.

**ఇలా చేయండి..**

క్రెడిట్ కార్డ్ యాక్టివ్‌గా ఉండాలంటే.. రెగ్యులర్‌గా వాడుతూ ఉండాలి. కనీసం మూడు నెలలకు ఒకసారైనా.. ఏదో ఒక చిన్న లావాదేవీ అయినా చేయాలి.

క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ఉండాలి. ఏదైనా అనుమానిత లావాదేవీలు, చార్జీలు ఉన్నాయేమో గమనించాలి.

మీకు క్రెడిట్ కార్డ్ అవసరం లేకపోతే.. వెంటనే క్లోజ్ చేసుకోవాలి. ఇందుకోసం కార్డును జారీచేసిన సంస్థను సంప్రదించాలి. పెండింగ్ బిల్లులను క్లియర్ చేసుకోవాలి.

ఒకవేళ కార్డ్ ఇన్‌యాక్టివ్‌గా మారితే.. తిరిగి యాక్టివేట్ చేసుకోవడానికి బ్యాంక్/ఆర్థిక సంస్థను సంప్రదించాలి.

# ఫిలిగ్రీకి ఫిదా!

ఆధునిక కాలంలోనూ సంప్రదాయ ఆభరణాలు అత్యంత ఆదరణ పొందుతున్నాయి. తళుకుబెళుకుల మెరుపులకంటే సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా తయారైన పురాతన ఆభరణాలపైనే మక్కువ చూపుతున్నారు నేటి మగువలు. అలా ఈతరం మహిళలను మెప్పిస్తున్న ప్రాచీన నగల్లో ఒకటి ఫిలిగ్రీ జువెలరీ. తాతమ్మల నాటి ఆభరణాల్లో ఒకటైన ఫిలిగ్రీ నగల విశేషాలేంటో తెలుసుకుందాం..ఫిలిగ్రీ పురాతనమైన ఆభరణాల తయారీ పద్ధతి. ఇందులో చాలా సన్నని, మెలితిప్పిన బంగారం, వెండి తీగలను ఉపయోగించి సున్నితమైన లేస్ లాంటి నమూనాలను రూపొందిస్తారు. ఈ అధునాతన కళారూపాలను తయారు చేసేందుకు అసాధారణ నైపుణ్యం, కచ్చితత్వం, సహనం అవసరం. 5000 సంవత్సరాల క్రితం మెసపటోమియాలో ఈ ఫిలిగ్రీ కళ పుట్టింది. ఈజిప్టు, గ్రీస్, భారత్, ఐరోపా దేశాలు సహా అనేక నాగరికతల్లో వ్యాపించింది. మనదేశంలో తెలంగాణ, రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలో ఈ కళ విస్తృతంగా ఉంది. తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫిలిగ్రీ కళకు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచింది. రేఖా గణితం ఈ నగల తయారీకి స్వచ్ఛమైన బంగారం లేదా స్టెర్లింగ్ సిల్వర్‌లను ఉపయోగిస్తారు. నమూనాల తయారీకి అనువైన మెత్తదనం, మన్నిక ఆధారంగా ఈ లోహాలను ఎంచుకుంటారు. లోహాన్ని చాలా సన్నని, ఏకరీతి దారాలుగా తీసి గుండ్రని, సంక్లిష్టమైన డిజైన్లుగా మలుస్తారు. ఈ నగల తయారీకి ప్రత్యేక పరికరాలు, వారసత్వ హస్తకళ అవసరం. సంక్లిష్ట రేఖాగణిత, పుష్ప నమూనాలను సృష్టించి అందమైన ఆభరణాలుగా మలుస్తారు. ఎనామిల్‌ను జతచేసి ఆభరణాలు అనేక రంగుల్లో మెరిసిపోయేలా సొబగులు అద్దుతారు. హస్తకళలను ఇష్టపడేవారికి ఇవి మంచి ఎంపిక. అందమైన అల్లికతో కూడిన కంఠాభరణాలు, హారాలు, చెవి కమ్మలు, గాజులు, చోకర్లు, బ్రేస్లెట్లు.. ఇలా అన్ని రకాల నగలు అందుబాటులో ఉన్నాయి.ఫిలిగ్రీ నగల తయారీకి ఉపయోగించిన లోహం, సంక్లిష్టత ఆధారంగా రూ.5,000 నుంచి లక్షల రూపాయల ఖరీదు చేసే వాటి వరకు రకరకాల డిజైన్లు అందుబాటులో ఉన్నాయి. మనిషి సృజనాత్మకతకు, సహనానికి, సునిశితంగా రూపొందించే ఫిలిగ్రీ ఆభరణాలు నిదర్శనంగా నిలుస్తాయి. సంప్రదాయ కళాత్మకతను సమకాలీన సౌందర్య సున్నితత్వంతో కలబోసి తయారుచేసిన అనేకరకాల ఆధునిక డిజైన్లు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ ఓసారి ట్రై చేసేయండి!





## రాష్ట్ర ర్యాంకులు సాధించి సత్తా చాటిన జయ విద్యార్థులు...

కోదాడ ఫిబ్రవరి 21 (సాక్ష్యం)

చుక్కా లక్ష్మీభాయ్ సైన్స్ టాలెంట్ టెస్ట్ లో రాష్ట్ర ర్యాంకుల ను జయ పాఠశాల విద్యార్థులు సాధించి సత్తా చాటారు అని కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ అన్నారు. శనివారం పట్టణంలోని జయ పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తూ మాట్లాడారు. ప్రముఖ విద్యావేత్త చుక్కా



రామయ్య సతీమణి చుక్కా లక్ష్మీబాయమ్మ జ్ఞాపకార్థం నిర్వహించిన చుక్కా లక్ష్మీబాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ లో జయ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అన్ని తరగతులలో 1.4,6 ర్యాంకులతోపాటు 50 లోపు 20 ర్యాంకులు, 100 లోపు 45 ర్యాంకులు సాధించారు. 5వ తరగతి నుండి స్టేట్ 1వ ర్యాంక్ పి కీర్తి,6వ తరగతి నుండి స్టేట్ 6వ ర్యాంక్ ఎస్కె జాహిద్,9వ తరగతి నుండి స్టేట్ 4వ ర్యాంక్ పి వికాస్,10వ తరగతి నుండి స్టేట్ 6వ ర్యాంక్ సిహెచ్ అక్షయ్ సాధించారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను, సహకరించిన అధ్యాపకులను, ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి, ప్రధానోపాధ్యాయులు చిలువేరు వేణు లు అభినందించారు.

## ఘనంగా అంతర్జాతీయ కవలల దినోత్సవం

**పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ.**

కోదాడ ఫిబ్రవరి 22 (సాక్ష్యం)

పట్టణంలోని కట్ట సాయి భవాని మెమోరియల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కవల పిల్లల అసోసియేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థినీలకు పరీక్షా సామాగ్రి పంపిణీ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చలిగంటి రామారావు, కొల్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రపంచ కవల పిల్లల దినోత్సవం



పురస్కరించుకొని ప్రతి ఏడాది ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఈ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. మార్చి రెండవ తారీకు కూడా పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి 120 మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేయబోతున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కట్ట సాయి భవాని మెమోరియల్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ స్వరూప రాణి, జయ పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, కవల పిల్లల తల్లిదండ్రులు రామారావు, సత్యనారాయణ చారి, అహమద్, చంద్రకాంత్ స్వామి, సురేష్, గోపవరపు మహేష్, చల్లా నటరాజ్, శరత్ కుమార్ , ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్జున్ తేజ ను సన్మానించిన దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్

కొండమల్లేపల్లి ఫిబ్రవరి 22 సాక్ష్యం :-

ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ ( బయో ఐఐటి )(2024-2025) వారు నిర్వహించిన పరీక్షల్లో మా 7 వ తరగతి ఐఐటి విభాగానికి చెందిన రాష్ట్ర స్థాయి ఎంటెన్స్ లో ఎం అర్జున్ తేజ రాష్ట్ర విభాగంలో మొదటి స్థానం సాధించడంతో నల్గొండ జిల్లా దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్ ఆ విద్యార్థిని ప్రత్యేకంగా సన్మానించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీ పరీక్షల్లో పాల్గొనగా నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానం పొందడంతో ఆ విద్యార్థిని అభినందించి ఆ





పాఠశాల యజమాన్యాన్ని కూడా అభినందించారు. శాలువాతో సత్కరించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ విధంగానే కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, సమాజానికి, నియోజకవర్గానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొనిరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, కొండమల్లేపల్లి మండల పార్టీ అధ్యక్షులు వేమన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గంధం సురేష్, శ్రీ కృష్ణవేణి పాఠశాల కరస్పాండెంట్ శ్రీ కట్ట వెంక రెడ్డి పాల్గొనడం జరిగింది.

## పట్టాలు తప్పిన గూడ్సు

భువనేశ్వర్ ,ఫిబ్రవరి22 :

ఇటీవల చోటుచేసుకుంటున్న రైలు ప్రమాదాలు ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రైళ్లు పట్టాలు తప్పడం, ఒకదానికి ఒకటి ఢీకొట్టడం, ట్రైన్లలో మంటలు చెలరేగడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. టెక్నికల్ సమస్యలతో, మానవ తప్పిదాల కారణంగా కూడా రైళ్లు ప్రమాదబారినపడుతున్నాయి. తాజాగా మరో రైలు ప్రమాదం చోటుచేసుకుంది. ఒడిశాలో ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో మూడు బోగీలు దెబ్బతిన్నాయి. ఈ ఘటన శుక్రవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది.

## ఎంఆర్ఎఫ్ ఐ పీ ఎల్ పారి శ్రమలో తొలగించిన కార్మికులను తక్షణమే డ్యూటీలోకి తీసుకొని వారిని పర్మినెంట్ చేయాలి: ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట రాజ్యం

సాక్ష్యం న్యూస్ సదాశివపేట

సంగారెడ్డి జిల్లా సదాశివపేట సదాశివపేట మండలం ఎంఆర్ఎఫ్ ఏ పి ఎల్ పరిశ్రమలో గత 4సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులను కంపెనీ పనుల్లో నుండి అన్యాయంగా తొలగించడం దుర్మార్గమని ఎంఆర్ఎఫ్ యాజమాన్యం తక్షణమే కార్మికులను డ్యూటీలోకి తీసుకోవాలని వెంటనే పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట రాజ్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సదాశివపేట లో సిపిఐ పార్టీ కార్యాలయం లో ఏఐటీయూసీ మండల కార్యదర్శి శంకరప్ప తో కలిసి జిల్లా సహాయ కార్యదర్శి వెంకట రాజ్యం మాట్లాడుతూ ఎంఆర్ఎఫ్ యాజమాన్యం కార్మికులను భయభ్రాంతులకు గురి చేసి వారిని డ్యూటీల నుండి తొలగించడం దుర్మార్గమని ఆయన అన్నారు. గత నాలుగు సంవత్సరాల నుండి కంపెనీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడ్డ కార్మికులను ఎలా తొలగిస్తారని ఆయన యజమాన్యాన్ని ప్రశ్నించారు. ఎంఆర్ఎఫ్ యజమాన్యం ఇష్టానుసారంగా ప్రవర్తించడం కార్మిక చట్టాలను నిర్లక్షణంగా ఉల్లంఘించడం జరిగింది అన్నారు. తక్షణమే జిల్లా అధికారులు జోక్యం చేసుకొని కార్మికులకు న్యాయం చేయాలని ఆయన అన్నారు. సమస్య గురించి కార్మికులు అడుగుతే వారిని డ్యూటీ నుంచి తొలగించడం అంటే కార్మిక హక్కులను యజమానియం కాలరాస్తుంది అన్నారు. కార్మికుల యొక్క



గొంతు యజమాన్యం నిర్లక్షణంగా తొక్కుతుందని ప్రశ్నిస్తే బెదిరింపులు చేయడం డ్యూటీ నుంచి తొలగించడం ఎంఆర్ఎఫ్ యాజమాన్యం నిరంకుశ వైఖరికి నిదర్శనం అన్నారు. తక్షణమే కార్మికులను డ్యూటీ లోకి తీసుకొని కార్మికులందరికీ పర్మనెంట్ చేయాలని శంకరప్ప కంపెనీ మేనేజ్ మెంట్ ను డిమాండ్ చేశారు. ఎంఆర్ఎఫ్ అంకెనపల్లి పరిశ్రమ కార్మికులకు న్యాయం జరిగే వరకు కార్మికుల తర పున ఏఐటీయూసీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఏఐటీయూసీ నాయకులు రమేష్, వెంకట్ గౌడ్ , లక్ష్మి, జ్యోతి, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి రంజాన్ పండుగ ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయండి

**బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే**

**వివిధ విభాగాల ఉన్నతాధికారులతో ఏర్పాట్ల పై సమీక్షా**

**వేసవి లో నీటి సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు**

వరంగల్ ప్రతినిధి (సాక్ష్యం న్యూస్ ):

మహా శివరాత్రి పవిత్ర రంజాన్ పండుగల ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులతో మహా శివరాత్రి రంజాన్ పండుగల నేపథ్యం లో చేయాల్సిన ఏర్పాట్ల పై అధికారులతో నిర్వహించిన సమావేశం లో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భం గా బల్దియా పరిధి వరంగల్ నగర పరిధి లో 30 ఆలయాలు హన్మకొండ పరిధి లో 45 ఆలయాల్లో ఎలక్ట్రికల్ విభాగ అధికారులు లైటింగ్ ఏర్పాట్లు శానిటేషన్ అధికారులు ఆలయ ఆవరణలు పరిశుభ్రం గా ఉంచడం తో పాటు డస్ట్ బిన్ ల ఏర్పాటు ఉండాలని భక్తుల సౌకర్యార్థం మంచి నీటి ఏర్పాట్లు చేయాలని అంతే కాకుండా ఆలయ పరిసరాలలో ఫాగింగ్ చేయించాలని రంజాన్ పవిత్ర ఉపవాస దీక్షలు మార్చి 2 నుండి ఏప్రిల్ 2 వరకు కొనసాగే అవకాశం ఉన్నందున వరంగల్ పరిధి లో 55 మసీదుల్లో హన్మకొండ పరిధి లో 55 మసీదుల్లో ఎలక్ట్రికల్ విభాగం వారు సీరియల్ బల్బు లతో అందంగా అలంకరించాలని జిల్లా కలెక్టర్ సూచించినట్లు వక్ఫ్ బోర్డు నుండి తగు ఏర్పాట్లు చేసేలా చూడాని మసీదుల్లో శానిటేషన్ తో పాటు ఫాగింగ్ చేపట్టేలా



చూడాలని షబ్ -ఏ- బరాత్ పండుగ సందర్భం గా అన్ని ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భం గా కమిషనర్ అధికారులకు సూచించారు

**వేసవి కాలం నేపథ్యం లో నీటిసరఫరా తీరు పై సమీక్షా**

వేసవి కాలం నేపథ్యం లో బల్దియా వ్యాప్తం గా నీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అన్నారు. నగర వ్యాప్తం గా ఉన్న ఫిల్టర్ బెడ్ లలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వడ్డేపల్లి కే యు సి ఫిల్టర్ బెడ్ ల యందు పంపు సెట్లు ఏర్పాటు చేయాలని నీటి సరఫరా తీరు పై వర్క్ ఇన్స్పెక్టర్ లు ఏ ఈ లు క్షేత్ర స్థాయి లో రెగ్యులర్ గా పర్యవేక్షణ జరపాలని తక్షణ అవసరాలకోసం రోజు వారీ లేబర్ లను ఏర్పాటు చేసుకోవాలని నీటి సరఫరా జరుగుతున్న బావు ల్లో బ్లీచింగ్ పౌడర్ వేయాలని పనిచేయని బోర్ వెల్స్ చేతి పంపులకు వెంటనే మరమ్మత్తులకు చేయించాలని నగర పరిధి లో నీటి సరఫరా జరగని ప్రాంతాల్లో 24 వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని నగరం లో 85% ప్రాంతాల్లో రోజువారీ నీటి సరఫరా 15% ప్రాంతాల్లో రోజు విడిచి రోజు నీటి సరఫరా జరగాలని నీటి సరఫరా కు సంబంధించి చిన్న చిన్న మరమత్తులు ఉంటే పూర్తి చేసి నీటి సరఫరా లోఅవాంతరాలు లేకుండా చూడాలని ఎస్ ఈ సంబంధిత అధికారులతో నీటి సరఫరా తీరు పై రోజు సమీక్షించాలని వేసవి కాలం నేపథ్యం లో నగర అవసరాలకు సరిపడే నీటి నిల్వలు ధర్మసాగర్ లో అందుబాటు లో ఉన్నాయని నీటి సరఫరా లో ఏమైనా సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నెం: 9701999645, 7207908583 వాట్స్ ఆప్ నం:9701999676 లలో సంప్రదించాలని కమిషనర్ నగర వాసులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర బయాలజిస్ట్ మాధవరెడ్డి ఎంహెచ్ఓ డా. రాజేష్ ఈ ఈ లు మహేందర్ శ్రీనివాస్ సంతోష్ బాబు డి ఈ లు రంగారావు రాజ్ కుమార్ రవి కిరణ్ సానిటరీ సూపర్వైజర్లు భాస్కర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు

## ఉమ్మడి మెదక్ జిల్లాలో పట్టభద్రుల పిలుపు ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి గెలుపు న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్

సాక్ష్యం న్యూస్ సదాశివపేట

సంగారెడ్డి జిల్లా సదాశివపేట ఉమ్మడి మెదక్ జిల్లా ఉమ్మడి మెదక్ జిల్లాలోని గుల్షన్ క్లబ్ వద్ద నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మెదక్ నిజాంబాద్, అదిలాబాద్, కరీంనగర్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి గెలుపు కొరకై వివిధ గ్రామాల్లో మాజీ సర్పంచులుమాజీ కౌన్సిలర్లు ప్రముఖ నాయకులు యువ నేతలు పట్టబద్రులు టీచర్లు కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని పట్టభద్రుల మరియు టీచర్ల సంక్షేమం కోసం ఉపయోగించుట కొనకై విస్తృత





ప్రచారాన్ని ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ కి అర్థమయ్యే విధంగా ప్రచారం విజయవంతంగా ముగించుకొని మెదక్ గుల్షన్ క్లబ్ లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రుల సమక్షంలో ప్రముఖ పట్టబద్రుల నాయకుల సమక్షంలో న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇందిరా గాంధీ గెలుపుకు నాంది పలికిన పలు గ్రామాల్లో పర్యటన చేస్తూ ఉంటే పట్టభద్రుల యొక్క స్వాగతం నాయకుల యొక్క స్వాగతం ఉమ్మడి మెదక్ నిజాంబాద్,అదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి ఘన విజయానికి సంకేతం పలుకుతున్నట్టుగా గ్రాడ్యుయేట్ల యొక్క భవిష్యత్తుకు బంగారు బాట చూపుతున్న విధంగా అనిపించిందని తెలియజేస్తూ ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ రెండవ సంఖ్యపై ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని అందర్నీ పేరుపేరునా కొనియాడారు. ఈ యొక్క ప్రచారంలో భాగంగా పాల్గొన్న పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా మెదక్ కాంటెస్టెడ్ ఎంపీ జి సాయ గౌడ్ మెదక్ ఎంఆర్పిఎస్ అధ్యక్షులు కొలుపుల రత్నయ్య మాదిగ మాజీ సర్పంచులు వెంక గౌడ్ గుట్ట కిందిపల్లి లక్ష్మణ్ యాదవ్ మెదక్ జిల్లా ఇన్చార్జ్ మంగ మోహన్ గౌడ్ యువ నాయకులు జయరాజ్ ఆంజనేయులు సాయిబాబా గౌడ్ మరియు పట్టబద్రులు పాల్గొన్నారు.

## బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించాలి

మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ

ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో (సాక్ష్యం న్యూస్ ) :

బీజేపీ బలపరిచిన అభ్యర్థి పులి సరోత్తం రెడ్డికి మీ అమూల్యమైన ఓటు మొదటి ప్రాధాన్యత కి వేసి గెలిపించాలని బిజెపి



జాతీయ మహిళా అధ్యక్షురాలు, మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ పిలుపునిచ్చారు. నల్గొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వరంగల్ జిల్లానర్సంపేటలోని బాలాజీ ఇన్ స్ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల, జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలోని ఉపాధ్యాయులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా బిజెపి జాతీయ మహిళా అధ్యక్షురాలు, మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకె అరుణ, బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పులిసరోత్తం రెడ్డి ,బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ బలపరిచిన అభ్యర్థి పులి సరోత్తం రెడ్డికి మీ అమూల్యమైన ఓటు మొదటి ప్రాధాన్యత కి వేసి గెలిపించగలరని కోరారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం 42 రోజుల పాటు సాగిన సకల జనుల సమ్మెలో కీలక పాత్రపోషించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు నేడు ఈ దుస్తితి ఎందుకు వచ్చిందో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చివరకు కష్టాలు, కన్నీళ్లు, బాధలే మిగిలాయన్నారు. స్వరాష్ట్రంలో ఇంకా జీతభత్యాలు, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్ , గ్రాట్యుటీ బిల్స్ కోసం ఎదురుచూస్తూన్న పరిస్థితి దాపురించింది. చేతగాని కాంగ్రెస్ పాలనలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ, డీఏ, జీపీఎఫ్, మెడికల్, గ్రాట్యుటీ సమస్యలు ఇంకా తీరలేదు.

రిటైర్డ్ ఉద్యోగులకు అందాల్సిన బెనిఫిట్లకు కూడా దిక్కులేని దుస్థితి దాపురించింది. అసమర్థ కాంగ్రెస్ పాలనకు తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం వచ్చేసిందన్నారు. జీవో 317 మీద, పీఆర్సీ కోసం, డీఏలతో సహా బకాయిల విడుదల కోసం ప్రభుత్వం మీద పోరాటం చేసింది ఒక్క భారతీయ జనతా పార్టీ మాత్రమేననిఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల కోసం, వారి డిమాండ్లు నెరవేరడం కోసం లాఠీదెబ్బలు తిన్నది, జైళ్లకు వెళ్లింది బిజెపి కార్యకర్తలు అని గుర్తించుకోవాలని తెలిపారు. కష్టాల్లో తోడుగా నిలిచిన బిజెపి తరపున బరిలో నిలిచిన పులి సరోత్తం రెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించాలనికోరారు. ఈకార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయ్ చందర్ రెడ్డి కుసుమ సతీష్ నర్సంపేట కంటెస్టెడ్ అభ్యర్థి కంభంపాటి పుల్లారావు కాలేజ్ చైర్మన్ రాజేంద్రప్రసాద్ రెడ్డి రిటైర్డ్ ఉపాధ్యాయులు రవీందర్ శర్మ ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా కన్వీనర్ బైరి మురళీకృష్ణ నియోజకవర్గ ఎన్నికల కన్వీనర్ గుడిపూడి రాధాకృష్ణ కట్ల రామచందర్ రెడ్డి కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన కస్తూరి ఫౌండేషన్

చిట్యాల ఫిబ్రవరి 22(సాక్ష్యం):

చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ వారు స్టడీ మెటీరియల్ ను ఎంఈఓ పానుగోతు సైదా నాయక్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో ఇష్టంతో స్టడీ మెటీరియల్ చదువుకొని పరీక్షకు సిద్ధం కావాలని అన్నారు స్టడీ మెటీరియల్ అందజేసిన కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి చరణ్ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూపాల్ రెడ్డి, బాలకృష్ణ,బాలయ్య, నయిముద్దీన్, అష్రఫ్ అలీ,మాధవి,సాయిబాబా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్ రాజ్ యాదవ్ గెలుపు కోసం బీసీ మెపా సంఘాల ప్రచారం

ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో (సాక్ష్యం న్యూస్ ) :

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలోఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్ రాజ్ యాదవ్ గెలుపు కోసం వరంగల్ జిల్లా నర్సంపేట దుగ్గొండి మండలంలో బీసీ, మెపా సంఘాలు ప్రచారం నిర్వహించాయి. బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, మెపా రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు ముదిరాజ్ లు దుగ్గొండి మండలంలోని ఆదర్శవాణి హైస్కూల్ లో ఉపాధ్యాయులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డ్యాగల శ్రీనివాస్హూ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల్లో బీసీ సంఘాలు, ఉపాధ్యాయులు, ఉద్యమకారులు, సామాజిక సంఘాలు బలసర్చిన అభ్యర్థి ఎస్ సుందర్ రాజ్ యాదవ్ ను మీ మొదటి ప్రాధాన్యత ఓటు 19వ నెంబర్ లో వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్రఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్, మెపా రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు, బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు బండి విజయ, ముంజ లక్ష్మి, చల్లా నారాయణ, ఎల్లబోయిన కుమారస్వామి యాదవ్, గుడికందుల వీరేశం లతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల్లో యువతకు ప్రాధాన్యతను ఇవ్వాలి.

- సోషల్ మీడియాలో యువజన కాంగ్రెస్ నాయకులు యాక్టివ్ కావాలి
- ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి వివరించండి
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యుగేందర్ రెడ్డి
- త్వరలో గ్రామ గ్రామాన యువజన కాంగ్రెస్ కమిటీలు.
- రామచంద్రు నాయక్ పై అసత్య ఆరోపణలు మానుకోండి
- స్థానిక ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పాత్ర పోషించాలి.
- డోర్నకల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శాగంటి సందీప్

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 22 సాక్ష్యం న్యూస్:
హైదరాబాదులో గత కొన్ని రోజుల క్రితం యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివశరణ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సోనియమ్మ కుటీరం యువ క్రాంతి బునియాది శిక్షణ తరగతులను ముగించుకొని సొంత నియోజకవర్గానికి వచ్చిన డోర్నకల్ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు శాగంటి సందీప్ ని నియోజకవర్గ వివిధ మండల అధ్యక్షులు ఘనంగా శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకుడు వంటికొమ్ము యుగేందర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని వంటి కొమ్ము యుగంధర్ రెడ్డి యువజన కాంగ్రెస్ నాయకులకు సూచించారు. అంతేకాకుండా యువత తలుచుకుంటే కానిది ఏం లేదని చెప్పుకొచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ డోర్నకల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శాగంటి సందీప్ మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువకులకు ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీని కోరారు, నియోజకవర్గ స్థాయిలో యువజన కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండాలని ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను నిత్యం పోస్టులు రామచంద్రు నాయక్ ఎదుగుదలను ఓర్వలేక కావాలని తన ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా అనేక వాట్సాప్ లో పోస్టులు పెడితే భారీ మూల్యం సంవత్సరాలు తిరిగి ఎమ్మెల్యే అయితే కొంతమంది ఓర్చుకోలేకనే ఒక గిరిజన నాయకుని పై ఇవన్నీ చేస్తున్నారని గుర్తు చేశారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో



పెట్టాలని మనవి చేశారు. అంతేకాకుండా ప్రభుత్వ విప్, నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రు నాయక్ పైన అసత్య ప్రచారాలు చేస్తున్నారని చెప్పుకొచ్చారు, 2010 లో రామచంద్రు నాయక్ అసలు రాజకీయాల్లోనే లేరని గుర్తు చేశారు. రాజకీయాల్లోకి రాకముందు జరిగిన భూమి వివాదానికి ఈరోజు రాజకీయానికి సంబంధం ఏముందో ఒకసారి గమనించాలని కోరారు. చెల్లించాల్సి వస్తుందని అన్నారు. తన భూమి తన వ్యక్తిగత విషయమని దానిని పార్టీకి, ప్రభుత్వానికి పూయడం సబాబు కాదని అన్నారు. రామచంద్రు నాయక్ ను రాజకీయంగా ఎదురుకోలేకనే వ్యక్తిగతంగా దాడులు చేస్తున్నారని హేదేవా చేశారు. రామచంద్రు నాయక్ ఒక డాక్టర్ గా వైద్యం చేసుకుంటే అనేక లక్షల సంపాదించేవాడని డబ్బుని పక్కనపెట్టి పేద ప్రజలకు సేవ చేయాలనే దృఢ సంకల్పంతోని డోర్నకల్ నియోజకవర్గంలో 10 - 15 యువజన కాంగ్రెస్ పార్టీ ముందు వరుసలో ప్రచారంలో పాల్గొని పార్టీ గెలుపుకు పునాదులు వెయ్యాలని మనవి చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ చిన్నగూడూరు మండల అధ్యక్షుడు దాసరి రాజు ముదిరాజ్, డోర్నకల్ అధ్యక్షులు బట్టుల రాజు, కురవి మండల అధ్యక్షులు దడిగల శరత్, మరిపెడ అధ్యక్షుడు బానోతు నరేష్, వైస్ ప్రెసిడెంట్ సునీల్, సురేష్, ప్రధాన కార్యదర్శి మేఘనాథ్, రమేష్, స్వాతి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఆక్స్ఫర్డ్ పాఠశాల లో కవలల దినోత్సవం

చిట్యాల ఫిబ్రవరి 22(సాక్ష్యం)
జాతీయ కవలల దినోత్సవాన్ని నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలోని ఆక్స్ ఫర్డ్ స్కూల్ లో శనివారం ఘనంగా జరుపుకున్నారు. స్కూల్




లోని కవల పిల్లలకు సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. వారికి పాఠశాల ప్రిన్సిపల్ పెద్ది నరేందర్ జ్ఞాపికగా కథల పుస్తకాలను, మిఠాయిలను అందజేశారు. కవలలను అభినందించిన వారిలో ఉపాధ్యాయ బృందం బైరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ,నమ్ముల ఆనందకుమార్, పెద్ది పద్మ, షేక్ షమీమున్నీసాబేగం, ఎం ధనలక్ష్మి, ఎస్ జ్యోతి, పి స్వాతి, పి రమాదేవి, ఎం మాధవి, జూబీదా, కే మౌనిక, సిహెచ్ ప్రసన్న, ఎస్ కీర్తి, బి కన్నయ్య, ఆసియా, బి స్వప్న, జై శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

చిట్యాల ఫిబ్రవరి 22(సాక్ష్యం)
చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గ్రీన్ గ్రోవ్ పాఠశాల లో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమం లో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారారు పలువురు విద్యార్థులు రాష్ట్రపతిగా, ప్రధానమంత్రిగా, ఎంపీలుగా ముఖ్య మంత్రిగా ఎమ్మెల్యేలుగా ఉన్నత అధికారులుగా మారారు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు



నింపటానికి ఉపాధ్యాయులు ఏ విధంగా చేస్తున్నారని , ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకుమని , సమాజం భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలో ఉంటుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్ రెడ్డి, ఏవో పోల గోవర్ధన్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మృతిని కుటుంబానికి పరామర్శ.

**5వేల ఆర్థిక సహాయం**
**బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి**

ములుగు ప్రతినిధి ఫిబ్రవరి 22(సాక్ష్యం న్యూస్):
ఇటీవల ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మోడె.జగ్గారావు తల్లి తండ్రులయిన చెంద్రకల నర్సయ్య లను బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి పరామర్శించి, వాటి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి,వారి కుటుంబ సభ్యులకు ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. చిన్న వయసులో జగ్గారావు మృతి చెందడం చాలా బాధాకరమని



ఆమె అన్నారు. కార్యక్రమంలో ఆమె వెంట స్థానిక మండలం అధ్యక్షుడు నరసింహ నాయక్, ఇర్ప.విజయ, చందులాల్,లాఉద్య రాం చెందర్,గజ్జి యెలెందర్,జెల్లెల కొమురయ్య,సంతోష్,కుమార్, ఆరె నరేష్,కుమార్, ఎ. మొగిలి, వెంకన్న,శ్యామ్,మడికొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొటెం స్పీకం గా అరవింద్ సింగ్ లవ్లీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి22 : భారతీయ జనతా పార్టీ నేత అరవింద్ సింగ్ లవ్లీని ప్రొటెం స్పీకర్ గా లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా శనివారంనాడు నియమించారు. ఢిల్లీ అసెంబ్లీ తొలి సమావేశాలు ఈనెల 24వ తేదీ సోమవారంనాడు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశంలో మధ్యాహ్నం 2 గంటలకు స్పీకర్ ఎన్నిక నిర్వహిస్తారు. దీనికి ముందు ఉదయం 11 గంటలకు కొత్త ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం ఉంటుంది. ఢిల్లీ అసెంబ్లీ బులిటెన్ ప్రకారం, ఫిబ్రవరి 25న అసెంబ్లీని ఉద్దేశించి ఎల్జీ సక్సేనా మాట్లాడతారు. అనంతరం కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికను సభలో ప్రవేశపెడతారు. 26వ తేదీ ఉదయం 11 గంటలకు ఎల్జీ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ జరుగుతుంది. అనంతరం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకుంటారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా గురువారంనాడు ప్రమాణస్వీకారం చేసిన రేఖా గుప్తా ఆ తర్వాత కొద్ది గంటలకే తొలి క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. రెండు కీలక నిర్ణయాలు ప్రకటించారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయాలని, అసెంబ్లీ తొలి సమావేశంలో 14 కాగ్ నివేదికలను సభలో ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు.

## కుషాయిగూడలో దారుణఘటన

హైదరాబాద్,ఫిబ్రవరి22 : కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టపగలు నడిరోడ్డుపై దారుణం చోటు చేసుకుంది. కన్న కొడుకే తండ్రిని కత్తితో పొడిచి దారుణంగా హతమార్చాడు. పోలీసుల కథనం ప్రకారం..సికింద్రాబాద్ లాలాపేటకు చెందిన ఆరెల్లి మొగిలి(45) ని అతని కుమారుడు సాయి కుమార్ (25) హత్యచేశాడు. ఇద్దరూ ప్యాకర్స్ అండ్ మూవర్స్‌లో పనిచేస్తున్నారు. మొగిలి నిత్యం మద్యం తాగి ఇంట్లో గొడవ చేస్తుండటంతో సాయికుమార్ విసిగిపోయాడు. శనివారం మధ్యాహ్నం లాలాపేట నుంచి మొగిలి బస్సులో బయలుదేరగా.. అతని కుమారుడు ద్విచక్రవాహనంపై అనుసరించాడు. ఈసీఐఎల్ బస్ టెర్మినల్ వద్ద బస్సు దిగిన తండ్రిని.. తన వెంట తెచ్చుకున్న చాకుతో విచక్షణారహితగా పలుమార్లు పొడిచాడు. తీవ్రంగా గాయపడిన మొగిలిని స్థానికులు సమీపంలో ఉన్న శ్రీకర ఆసుపత్రికి తరలించగా చికత్స పొందుతూ మృతి చెందాడు. కత్తితో దాడి చేస్తున్న దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి.

## కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న తెలంగాణా సర్కార్

**పిడిఎస్ యూ రాష్ట్రహాసహాయ కార్యదర్శి వెంకటేష్**

ఖమ్మం (సాక్ష్యం న్యూస్ ) :
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నారాయణ, శ్రీచైతన్య కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలకు కొమ్ము కాస్తుందని పి డి ఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ లు




విమర్శించారు. ప్రోగ్రెస్సివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ యూనిటీ పి డి ఎస్ యూ రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా పి. డి. ఎస్. యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరం లోని నారాయణ స్కూల్ నందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ చైతన్య, నారాయణ, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు , తో పాటు అనేకహా పాఠశాలలు అనుమతులు లేకుండా విచ్చల విడిగాహాఅడ్మిషన్లు నిర్వ హిస్తున్నాయన్నారు. విద్యార్థుల తో పాటు వారి తల్లితండ్రులను యాజమా న్యాలు మోసం చేస్తున్నాయన్నారు. ఇంత యధేచ్చగా అడ్మిషన్లు జరుగు తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యార్థుల ప్రాణాలు పోతున్న ముఖ్యమంత్రి, అధికారులు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థ లకు వత్తాసు పలుకుతున్నారని ప్రభుత్వం పై ఆవేదన వ్యక్తం చేశారు.ఎలాంటి అనుమతులు రాకముందే ముందస్తుగా ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల కార్యకలాపాలు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు కనీసం తనిఖీలు చేయడం లేదన్నారు.
కార్పొరేట్ విద్యాసంస్థలకు ముడుపు లు తీసుకొని అనుమతులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక బ్రాంచ్ కి అనుమతి తీసుకొని దానిపేరుతో రెండు మూడు బ్రాంచిలను నిర్వహిస్తున్నారన్నారు. అనుమతి ఒక చోట తరగతుల నిర్వహణ మరొక చోట చేస్తున్న విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలలకు అనుమతి రాకముందే అడ్మిషన్లు నిర్వహిస్తూ లక్షలాది రూపాయలు ఫీజు లు వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టడంలో ప్ర భుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అనుమతి లేని ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజులు వసూలు చేసే విద్యాసంస్థలపై ప్రత్యక్ష ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో పిడిఎస్ యు ఖమ్మం జిల్లా నాయకులు వినయ్,శ్రీకాంత్,సందీప్, యశ్వంత్, సాదిక్, వెంకటేష్, అన్వేష్, ప్రసాద్, స్టాలిన్, లక్ష్మణ్, అశోక్,తదితరులు పాల్గొన్నారు.

## 24న జర్నలిస్టుల నిరసన

**టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ పిలుపు.**
**సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్.**

మిర్యాలగూడ డివిజన్ ఫిబ్రవరి 22 (సాక్ష్యం న్యూస్)
జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న జిల్లా కలెక్టరేట్ల వద్ద జర్నలిస్టులు నిరసన తెలియజేస్తూ కలెక్టర్ కు వినతి పత్రాలు అందజేయనున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా అధ్యక్షులు ఎండీ ఆయూబ్ తెలిపారు. స్థానికంగా శనివారం ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీ. వెంకన్న,మనోజ్ లతో పాటు ముఖ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24న కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చే కార్యక్రమానికి జర్నలిస్టులంతా హాజరుకావాలని కోరారు. జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు, అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, పెన్షన్ స్కీం, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు, చిన్న,మధ్య తరహా పత్రికలకు ప్రభుత్వ



గుర్తింపు, జర్నలిస్టుల ప్రత్యేక రక్షణ చట్టం తదితర డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంత వరకు ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదని అన్నారు. జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వకుండా జీవో 239 సమీక్ష, సవరణ కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నదన్నారు. దీంతో జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు.జిల్లా వ్యాప్తంగా ఈనెల ఫిబ్రవరి 25 నుంచి మార్చి 25వ తేదీ వరకు నెల రోజుల పాటు ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. 24న జరిగే చలో కలెక్టరేట్ కు జిల్లా నుండి జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు ఖాజా హమీదోద్దీన్, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకన్న, మనోజ్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు మహేష్, జిల్లా నాయకులు ఖాజా నాజిమోద్దీన్, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు మంద సైదులు, జయరాజు, నక్క శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ పట్టభద్రుల ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఆవుల రాజిరెడ్డి

మెదక్ జిల్లా ప్రతినిధి 22 ఫిబ్రవరి సాక్ష్యం
మెదక్ జిల్లా, మెదక్ పట్టణంలోని శ్రీ సాయి బాలాజీ గార్డెన్స్‌లో నిర్వహించిన



పట్టభద్రుల ఎన్నికల సన్నాహక సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు శ్రీ దామోదర్ రాజనర్సింహ , రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రివర్యులు కొండ సురేఖ ముఖ్య అతిథులుగా పాల్గొని, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి ని గెలిపించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి గారు మాట్లాడుతూ, “ఈ పట్టభద్రుల ఎన్నిక మన పాలనకు నిలువుటద్దం. విద్యావంతులైన పట్టభద్రులు ఎవరి కోసం ఓటేయాలో తెలుసు. నరేందర్ రెడ్డి గారు విద్యావ్యవస్థలో అనుభవం కలిగిన వ్యక్తి. పేద పిల్లలకు సేవ చేసిన నేత. కాబట్టి ఈ ఎన్నికల్లో ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాలి” అని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ నియామకాలు, బదిలీలు, పదోన్నతులు అమలు చేసిందని పేర్కొన్నారు. పట్టభద్రులు కాంగ్రెస్ పాలనను అర్థం చేసుకుని నరేందర్ రెడ్డికి మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, “కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేశారు. బీఆర్ఎస్ నేతలు బీజేపీకి మద్దతుగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలి” అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థుల డైట్



చార్జీలను పెంచిందని, త్వరలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి, భవాని, జిల్లా పట్టభద్రులు కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు , ఎమ్మెల్యే రోహిత్ రావు , జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ , రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ , దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవాని, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ స్వరూప ముదిరాజ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో సరూర్ నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి

చిట్యాల ఫిబ్రవరి 22(సాక్ష్యం)
నల్లగొండ ఖమ్మం వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చిట్యాల పట్టణ కేంద్రంలో బిజెపి పట్టణ అధ్యక్షులు గుండాల నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల నకిరేకల్ నియోజకవర్గ ఇన్చార్జి సరూర్నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తమ్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి



గెలిపించాలని ఉపాధ్యాయులను కోరడం జరిగింది. బిజెపితోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంటెస్ట్ ఎమ్మెల్యే నకిరేకంటి మొగులయ్య, ఎమ్మెల్సీ బూత్ కన్వినర్ చికిలం మెట్ల అశోక్, కోఆర్డినేటర్ మాస శ్రీనివాస్, కూరెళ్ల శ్రీను, నాయకులు వెంకన్న, బానుక ఉదయ్ ఖమ్మంపాటి సతీష్ పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ విద్యార్థుల విహార విజ్ఞాన యాత్ర

నెల్లికుదురు (సాక్ష్యం న్యూస్ ):
మహబూబాద్ జిల్లా నెల్లికుదురు మోడల్ స్కూల్ విద్యార్థుల విహార విజ్ఞాన యాత్ర విజయవంతంగా ముగిసింది.నెల్లికుదురు మోడల్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు పీఎం శ్రీ పథకం లో భాగంగా విద్యార్థులకు చారిత్రక ప్రదేశాల అవగాహనా కోసం యునెస్కో గుర్తింపు కలిగిన తెలంగాణ లో ప్రసిద్ధి చెందిన కాకతీయుల కళరూపం రామప్ప , లక్నవరం క్షేత్రాలను పర్యటించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ జి. ఉపేందర్ రావు ఉపాధ్యాయులు విజయవంతం గా నిర్వహించడం జరిగింది.



# ప్రజలకు అందుబాటులో ఉండి

**మెరుగైన వైద్య సేవలు అందించాలి**

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రొయ్యూరు ఆకస్మిక తనిఖీ**

**జిల్లా వైద్యాధికారి గోపాలరావు**

ములుగు ప్రతినిధి ఫిబ్రవరి 22 (సాక్ష్యం):
ములుగు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గోపాలరావు శని వారం ఏటూరు నాగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రొయ్యూరును అకస్మికతనికి చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల కొరకై, రోజూ వస్తున్న రోగుల వివరాలను అడిగి తెలుసుకుని, ఆరోగ్య కేంద్రంలోని మందుల నిల్వల గదిని, ల్యాబ్ టెక్నీషియన్ రూమును ,





రిజిస్టర్ లను పరిశీలించారు. అటు తర్వాత సిబ్బందితో మాట్లాడుతూ, వైద్య సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు అందుబాటులో ఉండి , మెరుగైన వైద్య సేవలు అందించాలనీ, లేనియెడల శాఖ పరమైన కఠిన చర్యలు ఉంటాయని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్. చంద్రకాంత్, స్టాఫ్ నర్స్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించి పెద్ద కర్మకు బియ్యం అందజేసిన కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

**బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది**

**పెద్దకర్మకు బియ్యం అందజేసిన నాయకులు**

ములుగు ప్రతినిధి ఫిబ్రవరి 22 (సాక్ష్యం న్యూస్)
ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం కంతనపల్లి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ వయసు 29 కిడ్నీ సమస్యతో ఇటీవలే మరణించడం జరిగింది . నేడు ఆదివారం వారి



పెద్దకర్మ ఉన్నందున వారి కుటుంబాన్ని పరామర్శించి వారి పెద్దకర్మకు క్వింటా బియ్యాన్ని కాంగ్రెస్ మండల నాయకులు అందజేయడం జరిగింది వారి కుటుంబానికి ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ సీతక్క అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి అప్సర్ పాషా,కాంగ్రెస్ పార్టీ మండల ఇన్చార్జి జాడి రాంబాబు,కంతనపల్లి మాజీ సర్పంచ్ చింత చంద్రయ్య నరసక్క, ఏటూరు మాజీ ఎంపీటీసీ చిట్యాల శైలజ అరుణ్ కుమార్, ఏటూరు మాజీ సర్పంచ్ సిద్ధమైన సాగర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు దబ్బకట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాయం రాజబాబు, మాచర్ల బాబు, కుడుముల సమ్మయ్య, కుడుముల కిషన్ రావు,చింత కృష్ణారావు,దబ్బకట్ల బాబు, దెబ్బకట్ల ప్రభాకర్,తదితరులు పాల్గొన్నారు

## రాదాభాయి చిత్ర పటం వద్ద నివాళు లర్పించిన మంత్రి సీతక్క

ములుగు ప్రతినిధి ఫిబ్రవరి 22 (సాక్ష్యం న్యూస్):
ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) చిమలపాటి మహేందర్ జీ తల్లి రాదాభాయి ఇటీవలే స్వర్గస్తులు కాగా వారి కుటుంబాన్ని



పరామర్శించి వారి చిత్ర పటం వద్ద రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఘనంగా నివాళి అర్పించారు.

## ఫాల్కన్ ఇన్వాయిస్ కేసులో దర్యాప్తు

హైదరాబాద్,ఫిబ్రవరి22( : ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంట్ పేరుతో వేల మందిని మోసం చేసిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఫాల్కన్ క్యాపిటల్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు నమోదు చేయడంతో విచారణ మరింత వేగవంతమైంది. హైదరాబాద్ హైటెక్ సిటీ హుడా ఎన్‌క్లేవ్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించిన ఈ సంస్థ, ఇన్వాయిస్ డిస్కౌంట్ పేరుతో అధిక లాభాలను వాగ్దానం చేసి, రూ.1,700 కోట్ల మేర నిధులను సమీకరించింది.

# ఉపాధ్యాయ అధ్యాపక గొంతుకగా మరోసారి అవకాశం ఇవ్వండి

## బిడ్డ డెలివరీ కోసం విదేశాలకు వెళ్లడం తప్పా

## విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మిర్యాలగూడ డివిజన్ ఫిబ్రవరి 22 (సాక్షం న్యూస్)
ఉపాధ్యాయ అధ్యాపక గుర్తుగా తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్సీ అభ్యర్థి ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. ఎమ్మెల్సీ ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని పలు ప్రవేటు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఓటును అభ్యర్థించారు అనంతరం యూటీఎఫ్ భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న జరిగే పోలింగ్లో సీరియల్ నెంబర్ నాలుగులో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. 30% ఫిట్నెంటుతో పిఆర్సి సాధనలో కృషి ఉందని కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ పిఆర్సి ప్రకారం 30 శాతం వేతనాలు పెంచడానికి ప్రత్యేకంగా కృషి చేసినట్లు తెలిపారు. ప్రమోషన్స్ కు టెట్ సమస్య ప్రధాన అడ్డంకిగా ఉన్న స్థితిలో ఢిల్లీకి వెళ్లి ఎన్సిటిఈ చైర్మన్, సెక్రటరీ తో మాట్లాడి పరిష్కరించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రితో మాట్లాడటం వల్లనే బదిలీలు, పదోన్నతులు ప్రక్రియ వేగంగా పూర్తి చేశామని, గిరిజన సంక్షేమ పాఠశాల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేయించానని తెలిపారు. మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు 2020 పిఆర్సి, సెలవులు మంజూరు, బదిలీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశానని ఐదు రకాల గురుకులాలలో బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ జారీ చేయించి పూర్తి చేయించినట్లు తెలిపారు కేజీబీవీ ఉపాధిలకు రెండుసార్లు జీతం పెంపు, మూడు సార్లు బదిలీలు ఎండాకాలం జీతం, ఆటో రెన్యువల్ ఎమ్మెల్సీ ఓటు హక్కు సాధించడంలో ఎంతో కృషి చేసినట్లు చెప్పారు. జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ లెక్చరర్స్ బదిలీలు కాంటాక్ట్ లెక్చర్ల సమస్యల పరిష్కారంలో తమ వంతు పాత్ర పోషించినట్లు తెలిపారు. సిబిఎస్ రద్దు కొరకు శాసనమండలిలో మాట్లాడానని బయట కూడా అనేక పోరాటాలు చేశానని చెప్పారు. 2023 డీఎస్సీ ఉ పాధ్యాయులతో సహా సెప్టెంబర్ 2004 నుండి ఉద్యోగాల్లోకి వచ్చిన ఉ పాధ్యాయుల అధ్యాపకులు, ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేయించి ఒపీఎస్ అమలు చేయలా కృషి చేస్తానన్నారు. మండల, ఉ ప విద్యాధికారులు డైట్, జూనియర్ లెక్చరర్ పోస్టులలో ప్రమోషన్స్ అమలు చేయించాలని, ఐదు రకాల గురుకులాల సమయం మార్పిడి, హెల్త్ కార్డులు, డిప్యూటీ వార్డెన్ పోస్టుల మంజూరి, 0 1 0 ద్వారా జీతాల చెల్లింపు సమస్యను పరిష్కారాన్ని కృషి చేస్తానన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుకు 010 ద్వారా జీతాలు, హెల్త్ కార్డులు, ప్రమోషన్స్ ఇప్పించాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం బేసిక్ పే, కేర్ టేకర్ పోస్టు మంజూరి, హెల్త్ కార్డులు, ఉద్యోగ భద్రత సాధించాలని కోరారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న పండిట్




పీఈడి పోస్టుల అప్ గ్రేడేషన్, సిఆర్టి లకు మినిమం బేసిక్ పే, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు పోస్టులు మంజూరు చేయాలన్నారు. జూనియర్ కళాశాలకు నిర్వహణ గ్రాంట్ మంజూరి ఇతర సమస్యల పరిష్కారానికి శాసనమండలు పోరాడుతారన్నారు. డిగ్రీ, పాలిటెక్నిక్ అధ్యాపకులకు ఏడవ కేంద్ర ప్రభుత్వ పిఆర్సి ఏరియాస్ ఇప్పించుటకు, యూనివర్సిటీ కాంటాక్ట్ అధ్యాపకుల రెగ్యులర్ చేయుటకు గ్రాండ్ పెరుగుదల, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చుటకు కృషి చేస్తానన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అధ్యాపకులకు పిఎఫ్ అమలు, హెల్త్ స్కీము రిటైర్మెంట్ సందర్భంలో ఎక్స్గ్రేషియా చెల్లింపు, అర్హులైన వారికి ప్రభుత్వ గృహ నిర్మాణంలో అవకాశం కల్పించేందుకు తమ వంతు పాత్ర పోషిస్తాన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాగమణి , జిల్లా అధ్యక్షులు బక్కా శ్రీనివాస చారి , సీనియర్ నాయకులు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఏ. కరుణాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు మోర్తల శ్రీనివాస రెడ్డి ,చిన్న వెంకన్న, గుండా వేదశ్రీ, దాసరి ప్రభాకర్ వేములపల్లి అధ్యక్ష కార్యదర్శులు బైరం బాలరాజు, మాలోతు నాగేష్ నాయక్, మిర్యాలగూడ టౌన్ అధ్యక్ష కార్యదర్శులు కోడి రెక్క జయరాజు, సాజిద్ అలీ, మండల ప్రధాన కార్యదర్శి పులి సత్యనారాయణ, సీనియర్ నాయకులు డి వెంకట్ రెడ్డి, దామరచర్ల అధ్యక్ష కార్యదర్శులు భూక్య శ్రీనివాసరావు, చెల్క పల్లి శ్యామ్ కుమార్ ,నిడమనూరు ప్రధాన కార్యదర్శి లింగంపల్లి అంజయ్య, త్రిపురారం అధ్యక్షులు కట్ల మధుసూదన్ పాల్గొన్నారు.

# వేసవి కాలంలో త్రాగు నీటి సరఫరా సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

## మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క.

ములుగు ప్రతినిధి ఫిబ్రవరి 22 (సాక్ష్యం న్యూస్):
వేసవి కాలంలో త్రాగు నీటి సరఫరా లో సమస్య తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలినీ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క. అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మిషన్ భగీరథ పై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖల మంత్రి సీతక్క శనివారం మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఇ న్ సి కృపాకర్ రెడ్డి, ఇతర అధికారులుమిషన్ భగీరథ నీటి సరఫరా వివరాలను మంత్రికి అధికారులు నివేదించారు. ఇప్పటి వరకు ఎక్కడా తాగునీటి సమస్య లేదని తెలిపిన అధికారులు ఏదేని గ్రామంలో సమస్యల తలెత్తిన వెంటనే సమస్యను పరిష్కరిస్తున్నామన్న అధికారులుప్రతి రోజు ఉదయం 8 గంటలకు జిల్లా అధికారులతో సమీక్షలు నిర్వహించి తాగునీటి సమస్యలు లేకుండా చూస్తున్నామని అధికారులు తెలపాడం జరిగింది మంత్రి సీతక్క మాట్లాడుతూ వేసవి లో ఎలాంటి తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు చెక్ చేయాలి. విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూడాలని సమర్పించాలి. ఎక్కడైన సాంకేతిక సమస్యలు తలెత్తినా తక్షణం పరిష్కరించాలి. సమస్యలు



ఆదేశాలు పంప్ హౌస్ మోటర్లలో సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలి. ఈఎన్సీ నుంచి గ్రామ స్థాయి వరకు మిషన్ భగీరథ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ప్రతి రోజు తాగు నీటి సరఫరాపై జిల్లా అధికారులతో సమీక్ష చేపట్టి నివేదిక తలెత్తితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. రిజర్వాయర్లలో తగినంత నీటి నిల్వలున్నందున, ఈ వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలి. తాగునీటి అవసరాలు తీర్చేందుకు అవసరమైతే జిల్లా కలెక్టర్ల కు ప్రత్యేక ఫండ్ కేటాయించే అంశాన్ని పరిశీలిస్తున్నాం అన్నారు

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారాల కోసం పోరాటాలకు సిద్ధం కావాలి

**ఈనెల 24 జరిగే కలెక్టరేట్ల ముట్టడి విజయవంతం చేయాలి**

**టిడబ్ల్యూ జె ఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు పిట్టల మధుసూదన్**

ములుగు, ప్రతినిధి ఫిబ్రవరి 22, (సాక్ష్యం న్యూస్):
జర్నలిస్టుల సమస్యల పరిష్కారాల కోసం పోరాటాలకు సిద్ధం కావాలనీ,ఈనెల 24 జరిగే కలెక్టరేట్ల ముట్టడి విజయవంతం చేయాలనీ టిడబ్ల్యూ జె ఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు పిట్టల మధుసూదన్ పిలుపునిచారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చోరువ చూపాలని అన్నారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలో పిట్టల మధుసూదన్ మాట్లాడుతూ ఏళ్ళ తరబడి ప్రభుత్వానికి ప్రజా సమస్యల పరిష్కారానికి వారధిగా పాత్రికేయులు పనిచేస్తూ దారిద్ర రేఖకు దిగువన కుటుంబాలను వెల్లదీస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలోనూ, ప్రజా



సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలోనూ జర్నలిస్టులదే కీలక పాత్ర అని అన్నారు. ఈ విధంగా ప్రజాసేవలో ఎందరో పాత్రికేయులు సంవత్సరాల తరబడి సేవలు అందిస్తూ ఆర్థిక ఇబ్బందులతో సతమౌతమవుతున్నారని అన్నారు. సామాజికంగా నేడు రాజకీయ పార్టీలు, గుత్తేదారులు, చాలా ఇస్తున్న ఆధిపత్యంలో ఎందరో వర్కింగ్ జర్నలిస్టులు మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయని అన్నారు. వయసు పైబడి అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. కుటుంబ సభ్యులకు కూడ ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పరిష్కారం కోసం ప్రభుత్వాల సాయం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. కొన్ని సందర్భాల్లో జర్నలిస్టులకు వ్యవస్థలో రక్షణ కరువైందని అన్నారు. హెల్త్ కార్డులు అక్రెడేషన్ కార్డులు వెంటనే అందించాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు ఇండ్ల స్థలాలు కేటాయించాలని, రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని వర్తింపజేయాలని, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులకు నివారణ కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని, మహిళా జర్నలిస్టులకు రాత్రిపూట ప్రత్యేక రవాణా సదుపాయాలు కల్పించాలని, ఇంకా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల 24న జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ కార్యాలయం ముందు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి పాత్రికేయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన్న అర్ధ నారీశ్వరీలు

ములుగు ప్రతినిధి ఫిబ్రవరి 22 ( సాక్ష్యం న్యూస్):



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం గోగుపల్లి గ్రామానికి చెందిన ఈసం వెంకటయ్య –సూరమ్మ దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు అయిన ఈసం శ్రీను ఇటీవల ఆత్మహత్య చేసుకోగా ఏదిక్కు లేకుండా దిక్కు కోల్పోయి ఒంటరి అయినా వృద్ధ దంపతుల పరిస్థితి చూసి చలించిపోయిన అర్ధ నారీశ్వరీలు మేమున్నామంటూ ముందుకొచ్చి వారి కుమారుడి పెద్ద ఖర్మలకు తలోక్క చేయి వేసి 6500 రూపాయలు మరియు 25 ల రైస్ ఆర్థిక సహాయం అందించి గొప్పమనసు చాటుకొని సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఆర్థిక సహాయం చేసినవారిలో ఆదివాసీ అర్ధ నారీశ్వరీ సంఘము అధ్యక్షులు ఈసం ఇందు దుగ్గి కృష్ణవేణి ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర నాయకులు, పాయం జాను, మద్దెల రేణుక, దుగ్గి పావని, ఈసం. లహరి, ఈసం. అనిత తదితరులు ఉన్నారు

## శతగాత్రుడికి 47,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించిన ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్

**దాతలకు రుణపడి ఉంటాం**

**ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ సభ్యులు నరిశెట్టి ఆనంద్ రావ్**

ములుగు ప్రతినిధి ఫిబ్రవరి 22 (సాక్ష్యం న్యూస్):
ములుగు జిల్లా ఏటూరునాగారం గ్రామం కు చెందిన పండగ సునీల్ అనే యువకుడు తాడ్వాయి సమీపలో బైక్ పైన వస్తుండగా లారీ డికొట్టగా తలకు తీవ్రగాయం అవటం తో హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ కు తరలించినరు. సునీల్ ఆర్థిక స్థోమత తెలుసుకున్న ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ సయ్యద్ వహీద్ దాతల ద్వారా 47,000 రూపాయలు సేకరించిన్నారు. అట్టి రూపాయలు బ్లడ్ డోనర్స్ సభ్యులు ఆనంద్ రావ్ వారి కుటుంబ సభ్యులకు అందించినారు. ఈ సందర్భంగా ఆనంద రావ్ మాట్లాడుతూ సునీల్ ఆరోగ్యం బాగుండాలని కోరుకున్నారు. అలాగే సహాయం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలియచేసారు. ఈ కార్యక్రమం లో బ్లడ్ డోనర్స్ సభ్యులు మహమ్మద్ మున్నా, ఎండీ సులేమాన్, సర్వ సాయి, ఎండీ రియాజ్, ప్రశాంత్, చాంద్, లకావత్ తదితరులు పాల్గొన్నారు.



## 100 శాతం రిజర్వేషన్ ఆర్డినెన్స్ ఇచ్చే విధంగా కృషి చేయాలి..

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఫిబ్రవరి 22,( సాక్ష్యం న్యూస్)
ఏజెన్సీలో 100శాతం రిజర్వేషన్ ఆర్డినెన్స్ ఇచ్చే విధంగా కృషి చేయాలని ఆదివాసి ఐకాస రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ దొర ,తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలెం కోటి, ఎన్ టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలువాయి ఉష కిరణ్ అన్నారు. శనివారం హైదరాబాద్, తార్నాక లో ఎమ్మెల్సీ ప్రో.కోదండరాం ను వారి స్వగృహంలో వారు మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడుతూ జీవో.నం.3 ను సుప్రీంకోర్టు కొట్టేయడం వల్ల గత 5 ఏండ్ల నుండి ఏజెన్సీలో ఆదివాసిలు అనేకం ఉద్యోగాలు కోల్పోయా రని ,తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే 100 శాతం రిజర్వేషన్ ఆర్డినెన్సు ఇచ్చే విధంగా కృషి చేయాలన్నారు. పెండింగులో ఉన్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని,వివాదంలో ఉన్న ఏజెన్సీ మణుగూరు, పాల్వంచ, మంద మర్రి గ్రామాలకు గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని అన్నారు.ఇసుక పాలసీలో పూర్తిగా పీసా చట్టం ప్రకారం ఆదివాసీలకే కల్పించాలని, మణుగూరు-బీటిపిస్ భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని,ఐటీడీఏ లకు పాలక మండలి సమావేశాలు ఏర్పాటు చేయాలని,నల్లమల అటవీ ప్రాంతం చెంచు పెంటి,గూడేల అబివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఈ విషయంపై అనుకూలంగా స్పందించిన ఆయన మార్చి మొదటి వారంలో రాష్ట్రం లోని అన్ని ఆదివాసి సంఘాల ప్రతినిధులతో సెమినార్లు చర్చలు జరిపి గవర్నర్, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.



## యూట్యూబ్ ఛానల్ ముసుగులో వ్యభిచారం

విజయవాడ,ఫిబ్రవరి22(సాక్ష్యం) విజయవాడలో యూట్యూబ్ ఛానల్ ముసుగులో స్పా సెంటర్ నిర్వహిస్తున్న బిల్డింగ్‌పై మాచవరం పోలీసులు దాడి చేశారు. వెటర్నరీ కాలనీ సర్వీస్ రోడ్డులో స్టూడియో 9 ( స్పా) సెంటర్‌పై



సహచర సిబ్బందితో కలిసి మాచవరం సీఐ ప్రకాష్ దాడులు చేశారు. ఏపీ 23 యూట్యూబ్ ఛానల్ న్యూస్ బిల్డింగ్ నందు స్పా సెంటర్ నడుపుతున్నారని సమాచారం అందడంతో పోలీసులు రైడ్ చేశారు. 10 మంది మహిళలు, 13 మంది విటులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన మహిళలంతా ఇతర రాష్ట్రాలకు చెందినవారుగా గుర్తించారు. చలసాని ప్రసన్న భార్గవ్.. యూట్యూబ్ ఛానల్‌ను అడ్డం పెట్టుకుని స్పా సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం భార్గవ్ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

## అసెంబ్లీ సమావేశాలకు హాజరు కానున్న జగన్

అమరావతి,ఫిబ్రవరి22(సాక్ష్యం): అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని



వైకాపా అధినేత జగన్ నిర్ణయించినట్టు సమాచారం. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సోమవారం గవర్నర్ ప్రసంగానికి హాజరుకానున్నారు. మంగళవారం నుంచి శాసనసభకు హాజరుపై జగన్ ఇంకా నిర్ణయానికి రాలేదని సమాచారం. శాసనసభకు, బడ్జెట్ సమావేశాలకు రావడంపై పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకోనున్నారని తెలుస్తోంది. ఈనెల 24 నుంచి ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించనున్నారు. 24న ఉదయం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. 28న 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశముంది. 15 పనిదినాలు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. మొదటి రోజు బీఏసీ తర్వాత సభ ఎన్ని రోజులు జరపాలనేదానిపై నిర్ణయం తీసుకోనున్నారు.

## నిజామాబాద్ పసుపు యార్డు సందర్శన

### రైతులు దారుణంగా మోసపోతున్నారు: కవిత

నిజామాబాద్,ఫిబ్రవరి22(సాక్ష్యం): నిజామాబాద్ పసుపు యార్డు ఎమ్మెల్సీ కవిత సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. నిజామాబాద్ పసుపు యార్డులో.. రైతులు దారుణంగా మోసపోతున్నారని, వారం రోజులుగా ధరలు పడిపోయాయన్నారు. కేంద్రం 15 వేలు మద్దతు



ధర ఇస్తామని గొప్పలు చెప్పి రైతులను మోసం చేశారని, పసుపు బోర్డు కు చట్ట బద్దత లేదన్నారు ఎమ్మెల్సీ కవిత. పార్లమెంట్ లో బిల్లు పెట్టీ .. బిల్లు పాస్ చేస్తే రైతులకు మేలు జరుగుతుందని, పసుపు మార్కెట్ లో రైతులను బ్లాక్ మెయిల్ చేసే పరిస్థితి అని ఆమె మండిపడ్డారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి అని, పసుపు కు 12 వేలు ఇస్తామని గతంలో సీఎం రేవంత్ చెప్పారన్నారు. పసుపు రైతులకు బోనస్ ఇవ్వాలని, కేంద్రం పై పసుపు 15 వేలు ధర ఇవ్వాలని పోరాటం ఉంటుందన్నారు. పసుపు బోర్డుకు చట్ట బద్ధత కల్పించాలని బీఆర్ఎస్ తరపున పోరాటం చేస్తామన్నారు ఎమ్మెల్సీ కవిత.

## అమ్మవారికి వెండిచీర సమర్పణ

కోనసీమ,ఫిబ్రవరి22(సాక్ష్యం): ఆలమూరు మండలంలోని మూలస్థానంలోని శ్రీ ఉమామూలేశ్వరస్వామి దేవస్థానంలో ఉమాదేవి అమ్మవారికి గ్రామానికి చెందిన పేరూరి వంశీకులు, పేరూరి మహేందర్ నాథ్ దంపతులు కలిసి రూ. 3 లక్షల విలువైన 2.5 కిలోల వెండి చీర ఆభరణాన్ని శనివారం ఆలయ ఈవో ఎమ్. శివరామకృష్ణకు అందజేశారు. దీంతో ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో దాతల చేత ప్రత్యేక పూజలు నిర్వహించి వెండి చీర ఆభరణాన్ని అమ్మవారికి అలంకరింప చేశారు. అలాగే గ్రామ పెద్దలు, పలువురు నేతలు దాతలను అభినందించారు.

## చెత్తపన్ను రద్దు ఉత్తర్వులు జారీ

అమరావతి,ఫిబ్రవరి22(సాక్ష్యం): ఆంధ్రప్రదేశ్‌లో చెత్త పన్నును ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలోకి వచ్చాక? చెత్త పన్ను రద్దు చేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు.



అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది డిసెంబర్ 31 నుంచి చెత్త పన్ను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. తాజాగా మున్సిపల్ చట్ట సవరణ తర్వాత గెజిట్ జారీ అయింది. ఇక నుంచి ఏపీలో చెత్తపై పన్ను ఉండదు. గత ప్రభుత్వ హయాంలో చెత్తపై పన్ను వేశారు. దీనిపై కూటమి నేతలు విమర్శలు గుప్పించారు. ఎన్నికల ప్రచారంలో ఇదే అస్త్రంగా విమర్శలు గుప్పించారు. అధికారంలోకి వస్తే.. చెత్త పన్ను రద్దు చేస్తామని ప్రకటించారు. ఎన్నికల హామీల్లో భాగంగా చెత్త పన్ను రద్దు చేశారు.

# నేటి గ్రూప్-2 పరీక్షలు యధాతథం

### పబ్లిక్ సర్వీస్ కమిషన్ స్పష్టీకరణ

అమరావతి,ఫిబ్రవరి22(సాక్ష్యం): ఆంధ్రప్రదేశ్ గ్రూప్ 2 పరీక్షలు ఆదివారం 23వ తేదీ యథాతథంగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. ఇటీవల ఈ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు వచ్చిన వార్తలపై ఏపీపీఎస్సీ క్లారిటీ ఇచ్చింది. కమిషన్ తెలిపిన ప్రకారం, ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్నందున గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు ప్రయోజనం కల్పించే నిర్ణయాలను తీసుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కమిషన్ సూచించింది. గ్రూప్ 2 పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరీక్షా కేంద్రాలు, సమయాలు, ఇతర వివరాలను అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లలో చూసుకోవాలని కమిషన్ తెలిపింది.

ఏపీపీఎస్సీ తెలిపిన ప్రకారం ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్నందున, ఈ సమయంలో గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం కష్టమని కమిషన్ పేర్కొంది. ఈ కోడ్ ప్రకారం ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, పరీక్షలు వాయిదా వేయడం వంటి చర్యలు తీసుకోవడం నిషిద్ధం. అందువల్ల గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేయడం సాధ్యం కాదని కమిషన్ స్పష్టం చేసింది. ఈ ప్రకటనపై గ్రూప్ 2 అభ్యర్థులు వివిధ రకాలుగా స్పందిస్తున్నారు. ఈ ఎగ్జామ్ కోసం ప్రిపేర్ అయిన అభ్యర్థులు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తుండగా, సరిగా ప్రిపేర్ కానీ వారు మాత్రం నిరాశపడుతున్నారు. గ్రూప్ 2 పరీక్షలు ఏపీ వ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో నిర్వహించబడనున్నాయి. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లలో ఉన్న సమాచారం ఆధారంగా తమ పరీక్షా కేంద్రాలను చేరుకోవాల్సి ఉంటుంది.



పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సమయానికి చేరుకోవాలని, అవసరమైన పత్రాలను కూడా తీసుకురావాలని కమిషన్ ఈ సందర్భంగా సూచించింది. ఏపీపీఎస్సీ అభ్యర్థుల పరీక్షకు సంబంధించిన సమాచారాన్ని తమ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అభ్యర్థులకు ఎలాంటి సందేహాలైనా ఉంటే, వారు కమిషన్ అధికారిక నంబర్ లేదా ఇమెయిల్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపింది. ఈ నేపథ్యంలో రేపు జరిగే గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షల కోసం అభ్యర్థులు తమ సన్నాహాలను పూర్తి చేసుకోవాలని కమిషన్ సూచనలు జారీ చేసింది. పరీక్షకు హాజరయ్యే సమయంలో నిబంధనలను పాటించాలని సూచించింది. మరోవైపు ఏపీపీఎస్సీ ఈ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసింది.

## మిర్చి రైతుల సమస్యలపై బాబు ఫోకస్

### రైతు సంఘం నేతలతో చంద్రబాబు చర్చ

అమరావతి,ఫిబ్రవరి22(సాక్ష్యం): మిర్చి రైతుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పెషల్ ఫోకస్ పెట్టారు. చంద్రబాబుతో రైతు సంఘం నేత మన్నవ సుబ్బారావు శనివారం




ఏపీ సచివాలయంలో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలను మీడియాకు మన్నవ సుబ్బారావు వెల్లడించారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రైతు సంఘం నేత మన్నవ సుబ్బారావు తెలిపారు. సీఎం చంద్రబాబు రైతులకు సంబంధించి కొన్ని సూచనలు చేశారని అన్నారు. ఎకరాకు రూ.3 లక్షలు అవుతుందంటే సీఎం ఆశ్చర్యం వ్యక్తం చేశారని తెలిపారు. మిర్చి పంటలకు టెక్నాలజీ. వాడమని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. ఎలక్ట్రానిక్ కాటా ఉపయోగించమని సీఎం చెప్పారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కొంత ఆర్థిక సహాయం అందుతుందని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకుంటాయని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. జగన్ వచ్చినపుడు నిజమైన రైతులు ఆందోళన చేయలేదని చెప్పారు. కిరాయి మూకలు వచ్చి ఆందోళన చేశారని మన్నవ సుబ్బారావు పేర్కొన్నారు. అంతకుముందు మిర్చి రైతులు, యార్డు ట్రేడర్లతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. మిర్చి రైతుల సమస్యలు, ప్రస్తుత మిర్చి ధరలపై ప్రధానంగా చర్చించారు.

ఈ సమావేశానికి వ్యవసాయ శాఖ, సహచర మార్కెంటింగ్ శాఖ, పశుసంవర్థక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గురుతు రాజశేఖర్, వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు, వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత, వ్యవసాయశాఖకు సంబంధించి అధికారులు, ట్రేడర్లు సమావేశానికి హాజరయ్యారు. ముఖ్యంగా మిర్చి ధర గత కొంతకాలంగా తగ్గుతూ వస్తోంది.

ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితో భేటీ అయి రాష్ట్రంలో మిర్చి రైతుల సమస్యలపై వివరించడం, దానిపై కేంద్రం వెంటనే స్పందించి రాష్ట్రంలో చిల్లి ధర పరిస్థితిపై స్పందించి.. కేంద్రం నుంచి సహాయం అందిస్తామని చెప్పడంతో ఈరోజు గుంటూరు మిర్చి యార్డు ట్రేడర్లు, మిర్చి కొనుగోలు చేసే వర్తకులతో సీఎం కీలక సమావేశం నిర్వహించారు.

## గంజాయి ముఠా అరెస్ట్

### రెండున్నర లక్షల గంజాయి పట్టివేత

మదనపల్లె,ఫిబ్రవరి22(సాక్ష్యం): గంజాయి ముఠాను శనివారం రెండవ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.2.5 లక్షల విలువ చేసే 20 కిలోల గంజాయిని పట్టుకున్నారు. స్థానిక రెండో పట్టణ పోలీస్ట స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా డిఎస్పీ కొండయ్యనాయుడు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుకు వచ్చిన పక్కా సమాచారం మేరకు క్రైమ్ సీఐ చంద్రశేఖర్, రెండో పట్టణ సీఐ రామచంద్ర, రూరల్ సిఐ సత్యనారాయణ, క్రైమ్ సిబ్బంది తదితరులు గంజాయి సరఫరా రధారులపై డేగ కన్ను వేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో మదనపల్లి పట్టణం చంద్రా కాలనీకి చెందిన భాగ్యమ్మ (31), ఆవుల శివమ్మ (24), ఆవుల అనిల్ (27)లు గంజాయి విక్రయిస్తూ పట్టుపడ్డారన్నారు. వీరి వద్ద నుంచి రూ.2.5 లక్షలు విలువ గల 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. పలమనేరు, పుంగనూరు, పిటిఎం పోలీస్ స్టేషన్లో భాగ్యమ్మ పై గతంలో మూడు గంజాయి కేసులు కూడా నమోదయ్యాయని డీఎస్పీ తెలిపారు. వైజాగ్ నుంచి గంజాయిని తీసుకొస్తున్నట్లు నిందితులు తెలిపారన్నారు వీరిపై పీడీ యాక్టు నమోదు చేసేందుకు ఎస్పీకి సిఫారసు చెరస్తామని తెలిపారు. మదనపల్లె నియోజకవర్గం లో ఎక్కడైనా గంజాయి విక్రయాల జరుగుతుంటే తమకు సమాచారం అందించాలని, గంజాయిని నియంత్రించేందుకు పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మదనపల్లె పట్టణ, పరిసర ప్రాంతాల్లో కొంతమంది యువత గంజాయికి బానిసలు అయ్యారని అన్నారు. గంజాయి సేవించినట్లు మాకు తెలిస్తే వారిని స్టేషన్ కు తీసుకొచ్చి వాసన పట్టి కూడా వారిపై బైండోవర్ చేసుకుని అవసరమైతే కేసు నమోదు చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరు గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

## అమరావతి నిర్మాణ పనులకు ముమూర్తం ఖరారు

### మార్చి 15నుంచి ప్రారంభం అవుతాయని వెల్లడి
### 30వేల మంది కార్మికులతో శరవేగంగా నిర్మాణ పనులు

అమరావతి,ఫిబ్రవరి22(సాక్ష్యం): రాజధాని అమరావతి పనుల ప్రారంభానికి ప్రభుత్వం ముహూర్తం నిర్ణయించింది. ఎప్పుడెప్పుడు ప్రారంభమవుతాయా అని ఎదురుచూస్తున్న వేళ కీలక సమాచారం వచ్చేసింది. మార్చి 15 నుంచి రాజధాని పనులు ప్రారంభంకానున్నట్లు వెల్లడించింది. . ఏప్రిల్ మొదటి వారం నుంచి అమరావతిలో 30 వేల మంది కార్మికులు పనులు చేస్తారని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో టెండర్లు ఖరారు ఆలస్యం అయ్యింది. టెండర్లు పిలుచుకోవచ్చు కానీ ఖరారు చేయవద్దని ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు దాదాపు 62 పనులకు సీఆర్డీఎ, ఏడీసీ టెండర్లను పిలిచింది. సుమారు 40 వేల కోట్ల విలువైన పనులకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. మరో 11 పనులకు త్వరలో టెండర్లు పిలువనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని అమరావతి నిర్మాణాన్ని ప్రాధాన్య ప్రాజెక్టు తీసుకుంది. అందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ స్వయంగా అమరావతి ప్రాంతాల్లో పర్యటించి అక్కడ నిలిచిపోయిన పనులను పరిశీలించారు. తరువాత చెన్నై ఐఐటీ, హైదరాబాద్ ఐఐటీలకు చెందిన నిపుణుల బృందం అమరావతి ప్రాంతాన్ని సందర్శించారు. అమరావతిలో సెక్రటేరియెట్, అసెంబ్లీ వంటి ఐకానిక్ భవనాల పటిష్టతపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేశారు. ఇక్కడ నిర్మాణాలకు ఎలాంటి డోకా లేదంటూ ఐఐటీ బృందం నివేదిక ఇచ్చింది. లాగే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్స్, ఐఏఎస్, ఐపీఎస్ భవనాలు పటిష్టంగా ఉన్నాయని రిపోర్ట్ ఇచ్చారు. దాదాపు 40 వేల కోట్లకు సంబంధించి 62 పనులపై మార్చి 15 నుంచే శ్రీకారం చుట్టనున్నారు. మిగిలిన 11 పనులకు త్వరలో టెడర్లను పూర్తి చేసి రెండున్నరేళ్లలో అమరావతి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే అమరావతిలో పేరుకుపోయిన జంగిల్ క్లియరెన్స్‌ను పూర్తిస్థాయిలో తొలగించేశారు. దీంతో నిర్మాణాలకు ఎలాంటి ఆటంకం లేకుండా శరవేగంగా పనులు ముందుకు సాగుతాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు: కలెక్టర్

విజయవాడ,ఫిబ్రవరి22(సాక్ష్యం): ఈ నెల 27న జరిగే కృష్ణా-గుంటూరు జిల్లాల శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల నిర్వహణకు ఎన్‌టీఆర్ జిల్లాస్థాయిలో పటిష్ట ఏర్పాట్లు చేశామని.. ఇప్పటికే 224 మంది ప్రిసైడింగ్ అధికారులు (పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల (ఏపీవో)కు రెండుదశల్లో పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఎన్నికల జనరల్ అబ్జర్వర్ వి.కరుణ.. నియోజకవర్గ పరిధిలోని జిల్లాల కలెక్టర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులతో శనివారం వర్చువల్‌గా సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ జిల్లాలోని ఏర్పాట్లను వివరించారు. 112 పోలింగ్ స్టేషన్లకు 112 మంది పీవోలు, 112 మంది ఏపీవోలను నియమించామని... ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఇద్దరు చొప్పున ఇతర ప్రిసైడింగ్ అధికారుల (ఓపీవో)ను నియమించినట్లు తెలిపారు. మూడు కేటగిరీలకు సంబంధించి రిజర్వ్ కేటగిరీలో 90 మంది సిద్ధంగా ఉన్నట్లు వివరించారు.

ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఒకరు చొప్పున మొత్తం 112 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని.. 19 మందిని రిజర్వ్‌లో ఉంచినట్లు తెలిపారు. జిల్లాకు సంబంధించి విజయవాడ, నందిగామ, తిరువూరు డివిజన్లలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, తాత్కాలిక స్ట్రాం÷-రగ్ రూమ్‌లను గుర్తించినట్లు తెలిపారు. మొత్తం 224 బ్యాలెట్ బాక్సులు అవసరం కాగా రిజర్వ్‌తో కలిపి 324




బాక్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు 454 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో 24 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ (ఎఫ్ఎస్‌టీ) విధులు నిర్వర్తిస్తున్నట్లు వెల్లడించారు. 11 చెక్‌పోస్టుల వద్ద రెండు షిఫ్ట్‌ల్లో 22 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్ఎస్‌టీ) విధుల్లో ఉన్నాయని, ఏడు వీడియో సర్వైలెన్స్ టీమ్స్ (వీఎస్‌టీ) కూడా పనిచేస్తున్నాయన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లలోనూ వెబ్‌క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రూట్ ఆఫీసర్లు, సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ ఆఫీర్లను కూడా అవసరం మేరకు నియమించామని, నియమ నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల వ్యయ పరిశీలన బృందం అప్రమత్తతతో పనిచేస్తున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. వర్చువల్ సమావేశంలో డీఆర్‌వో, సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

## గంజాయిరహిత రాష్ట్రంగా ఎపి

### డిజిపి హరీష్ కుమార్ వెల్లడి

గుంటూరు,ఫిబ్రవరి22(సాక్ష్యం): గంజాయి రహిత రాష్ట్రంగా ఏపీని మారుస్తామని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. ఏపీ ప్రభుత్వం గంజాయి రవాణాపై దృష్టి పెట్టిందని అన్నారు. కృష్ణా జిల్లాలోని 4 సబ్ డివిజన్లలో ఇవాళ(శనివారం) గంజాయిని సీజ్ చేశారు. కోటి 87లక్షల 25 వేల విలువ కలిగిన గంజాయిని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడారు. డ్రగ్స్ నివారణపై కొత్తగా ఈగల్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంటర్ స్టేట్ గ్యాంగ్‌లపై నిఘా పెట్టామని అన్నారు. ఒడిస్సా రాష్ట్రం నుంచి గంజాయి రవాణా అవుతుందని తెలిపారు. ఏపీలో గంజాయి సాగు పూర్తిగా నియంత్రణలోకి వచ్చిందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా చెప్పారు. ఏపీ నుంచి



గంజాయి రవాణా జరుగుతుందని తెలిపారు. గంజాయి రవాణా చేస్తున్న అంతర్ రాష్ట్ర ముఠాలను పట్టుకుంటు న్నామని అన్నారు. గంజాయి రవాణా చేస్తున్న వాళ్ల ఆస్తులు సీజ్ చేస్తున్నామని చెప్పారు. డ్రగ్స్, గంజాయి రవాణా చేసే వాళ్లను ఈ సందర్భంగా హెచ్చరించారు. కాలేజ్‌ల వద్ద గంజాయి విక్రయిస్తున్న వారిని అరెస్టు చేస్తున్నామని అన్నారు. గంజాయి రవాణా, విక్రయించవద్దని విజ్ఞప్తి చేశారు. సెక్యూరిటీ అడిగిన వారికి ఇస్తున్నామని అన్నారు. గిరిజనులు గంజాయి సాగు చేపట్టవద్దని అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇతర పంటల సాగుపై కూడా వారికి ట్రైనింగ్ ఇస్తున్నామని చెప్పారు. కాలేజ్‌ల్లో యువతకు అవగాహన కల్పిస్తున్నామని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పేర్కొన్నారు.

## కృష్ణా జలాలపై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

### ఏపీకి క్షమాపణ చెప్పాలన్న బిజెపి నేత

కర్నూలు,ఫిబ్రవరి22(సాక్ష్యం): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఏపీ బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కృష్ణా జలాలను ఏపీ దోపిడీ చేస్తుందని



రేవంత్‌రెడ్డి అనడం దారుణం అన్నారు. కర్నూలులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ ప్రజలను, రైతులను దోపిడీ దొంగలుగా చిత్రీకరించడం దారుణం అని.. ఒక సీఎంగా ఉండి ఇలా మాట్లాడడం సహేతుకమేనా అని నిలదీశారు. శ్రీశైలం డ్యామ్ నిర్మాణం ఎవరి త్యాగాలతో నిర్మించారో రేవంత్ రెడ్డికి తెలియదా అని అడిగారు. ప్రజలను మోసం చేసి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారు. ఏపీ తన కాళ్ల మీద నిలబడుతుంది. కేంద్రంతో సఖ్యతగా ఉంటూ నిధులు తెచ్చుకుంటున్నారు. తెలంగాణలో ఒక్క స్కీమ్ కూడా అమలు చేసే పరిస్థితి లేదు. ఏపీ, తెలంగాణ మధ్య కావాలనే జల వివాదాలు సృష్టిస్తున్నారు. రేవంత్ రెడ్డి కపట నాటకం ఆడుతున్నారు. రేవంత్ రెడ్డి బేషరతుగా ఏపీ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. రేవంత్ రెడ్డిని సీఎం పదవి నుంచి దింపుతారని పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. అందుకే రేవంత్ రెడ్డి ఇలా మాట్లాడుతున్నారా?, అయినా దేశంలో కాంగ్రెస్ పని అయిపోయింది. దేశంలో 22 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంటే కాంగ్రెస్ ఉన్న రాష్ట్రాల్లో కూడా అధికారం కోల్పోతుందని విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు.

# పాకిస్థాన్ కోసం కోహ్లీ ప్రత్యేక వ్యూహం

## వరుణ్ చక్రవర్తితో కలిసి ప్రాక్టీస్



ఛాంపియన్ ట్రోఫిలో భాగంగా ఫిబ్రవరి 23న దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య హై-వోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నమెంట్ లో ఇప్పటివరకు రెండు జట్లు ఒక్కో మ్యాచ్ ఆడాయి. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్ లో పాకిస్థాన్ 60 పరుగుల తేడాతో ఓటమిని చవిచూడగా.. భారత జట్టు బంగ్లాదేశ్‌ను 6 వికెట్ల తేడాతో ఓడించింది. భారత్-పాక్ జట్ల మధ్య మ్యాచ్ కోసం అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మ్యాచ్ కు ముందు పాకిస్థాన్ ఆటగాళ్లు ప్రకటనలు చేయడంలో బిజీగా ఉండగా.. పేలవమైన ఫామ్ తో ఇబ్బంది పడుతున్న విరాట్ కోహ్లీ ఈ కీలక మ్యాచ్ కోసం సన్నద్ధమవుతున్నాడు. మ్యాచ్ కు ముందు విరాట్ కోహ్లీ నెట్ ప్రాక్టీస్ లో బాగా చెమటలు పడుతూ కనిపించాడు.శనివారం జరిగిన ప్రాక్టీస్ సెషన్ లో ఇరు జట్లు పాల్గొన్నాయి. ఆశ్చర్యకరంగా భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. వరుణ్ చక్రవర్తితో కలిసి షెడ్యూల్ చేసిన ప్రాక్టీస్ సమయానికి మూడు గంటల ముందుగానే ఐసీసీ క్రికెట్ అకాడమీకి చేరుకున్నాడు. విరాట్ కోహ్లీ స్పిన్ బౌలింగ్ లో రాణించేందుకు ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఎందుకంటే స్పిన్ బౌలింగ్ లో కోహ్లీ బలహీనత గురించి అందరికీ తెలిసిందే. పేలవమైన ఫామ్ తో ఇబ్బంది పడుతున్న విరాట్ కోహ్లీ బంగ్లాదేశ్ పై 38 బంతుల్లో 22 పరుగులు మాత్రమే చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పాకిస్థాన్ తో మ్యాచ్ కోసం విరాట్ కోహ్లీ మూడు గంటల ముందుగానే ఐసీసీ క్రికెట్ అకాడమీకి ప్రాక్టీస్ చేయడానికి వచ్చాడు. కోహ్లీతో పాటు దాదాపు డజను మంది అగ్రశ్రేణి యూఏఈ బౌలర్లు ఉన్నారు. అభిషేక్ నాయర్ కోహ్లీ ప్రాక్టీసింగ్ సెషన్ కోసం వచ్చాడు. కోహ్లీ వన్డే సగటు 57.78 కాగా.. కోహ్లీ మరో 15 పరుగులు సాధిస్తే 14 వేల పరుగుల మార్కును దాటి రికార్డును సృష్టించవచ్చు. పాకిస్థాన్ తో జరిగే మ్యాచ్ లో గెలిచి సెమీ ఫైనల్ కు సులభంగా చేరుకోవాలని టీమిండియా చూస్తుండగా.. పాకిస్థాన్ జట్టు ఈ రేసులో తనను తాను నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తోంది.



# నేడు పాకిస్తాన్‌తో భారత్ మ్యాచ్

## ఛాంపియన్స్ ట్రోఫీలో పాక్ దే పైచేయి

## దుబాయ్ వేదికల్లో టీమిండియాకు అద్భుత రికార్డు

## బంగ్లాపై గెలుపుతో ఊపులో భారత్

భారత్-పాకిస్తాన్ మ్యాచ్ నేడు దుబాయ్‌లో జరగనుంది. భారత్ బంగ్లాదేశ్‌పై గెలిచి మంచి ఊపులో ఉంది. పాక్‌పై భారత్ రికార్డు బలంగా ఉన్నా, ఛాంపియన్స్ ట్రోఫీలో పాక్ పైచేయి. . నిజానికి టోర్నమెంట్ కంటే కూడా పాకిస్తాన్‌తో జరిగే మ్యాచ్‌పైనే భారత్ క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. టోర్నీ అంతా ఒకెత్తు అయితే.. దాయది దేశం పాకిస్తాన్‌తో భారత్ తలపడనున్న మ్యాచ్ మరో ఎత్తు. దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో పాకిస్తాన్‌తో భారత్ తలపడనుంది. ఇక, ఇండియా-పాకిస్తాన్ మ్యాచ్ కోసం ఆన్‌లైన్‌లో టిక్కెట్లను సేల్‌కి పెడితే.. నిమిషాల్లో ఖతమయ్యాయి. బుకింగ్ వెయిటింగ్ టైమ్ గంటకు పైన ఉందంటేనే అర్థం చేసుకోవచ్చు, ఈ మ్యాచ్ కోసం అభిమానులు ఏ రేంజ్‌లో ఎదురుచూస్తున్నారని. ప్రస్తుతం రెండు టీమ్స్‌లో భారత్ బలంగా కనిపించినా.. ఛాంపియన్స్ ట్రోఫీలో మాత్రం పాకిస్థాన్ టీమ్‌దే పైచేయి ఉంది. ఈ టోర్నమెంట్‌లో రెండు జట్ల మధ్య జరిగిన ఐదు మ్యాచుల్లో పాక్ మూడు మ్యాచుల్లో గెలుపొందింది. ఇందులో 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో భారత్‌పై పాక్ విజయం సాధించింది. మొత్తంగా భారత్-పాక్ మధ్య మొత్తం 134 మ్యాచులు జరిగాయి. వీటిలో భారత్ 56 మ్యాచులు గెలుపొందగా.. పాక్ 73 మ్యాచుల్లో విజయం సాధించింది. ఐదు మ్యాచుల్లో రిజల్ట్ తేలలేదు. ఐతే, ఛాంపియన్స్ ట్రోఫీ 2025 మొదటి మ్యాచ్‌లో పాక్ పేలవ ప్రదర్శన కనబర్చింది. న్యూజిలాండ్ నిర్దేశించిన 320 టార్గెట్‌ను పాక్ చేదించలేకపోయింది. కేవలం 260 పరుగులకే ఆలౌటైంది. దీంతో పాక్ పెర్ఫామెన్స్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో టీమిండియాకు మంచి రికార్డు ఉంది. ఇక్కడ ఆడిన 15 మ్యాచుల్లో పది మ్యాచులు భారత్ గెలుపొందింది. ఐతే.. వన్డేల్లో ఆరుసార్లు తలపడగా.. ఇందులో ఐదు మ్యాచుల్లో భారత్ విజయం సాధించింది. ఒకమ్యాచ్ టైగా ముగిసింది. అంటే దుబాయ్ వేదికగా జరిగిన వన్డేల్లో టీమిండియాకు అద్భుత రికార్డు ఉంది. మరోవైపు భారత్ తమ తొలి మ్యాచ్ బంగ్లాదేశ్‌తో ఆడింది. భారత్ బౌలర్ల ధాటికి బంగ్లా కేవలం 228 పరుగులకే ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్.. మరో నాలుగు ఓవర్లు మిగిలి ఉ ఒడగానే టార్గెట్‌ను ఫినిష్ చేసింది. దీంతో ఆడిన ఫస్ట్ మ్యాచ్ గెలిచి.. టోర్నీని మంచి పాజిటివ్ వైబ్‌తో ప్రారంభించింది టీమిండియా.బంగ్లాపై ఆడిన టీమ్‌తోనే పాక్‌పై కూడా బరిలోకి దిగే అవకాశం ఉంది. ఐతే, కుల్దీప్ యాదవ్‌కి బదులుగా వరుణ్ ఛక్రవర్తిని తీసుకుంటారనే అంచనాలు ఉన్నాయి. బంగ్లాపై మ్యాచ్‌లో కుల్దీప్ ఒక్క వికెట్ కూడా తీయలేదు. అంతేకాకుండా.. పరుగులు కూడా బాగానే ఇచ్చాడు. ఈ నేపథ్యంలో మంచి ఫామ్‌లో ఉన్న వరుణ్‌ను జట్టులోకి తీసుకుంటారని తెలుస్తోంది. రెండు వారాలపాటు సాగే ఈ ఛాంపియన్స్ ట్రోఫీ పాకిస్తాన్, %ఖాూజు%లో హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తారు. ఈ టోర్నీలో 8 జట్లు పాల్గొననున్నాయి. 19 రోజుల పాటు 15 మ్యాచ్‌లు ఆడతాయి. గ్రూప్ %ూా%లో బంగ్లాదేశ్, భారత్, పాకిస్తాన్, న్యూజిలాండ్ ఉన్నాయి. గ్రూప్ %దీ%లో ఆఫ్ఘనిస్తాన్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా టీమ్స్ ఉన్నాయి.

## పాకిస్థాన్ గడ్డపై భారత జాతీయ గీతం!

ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో మరో రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది. ఈ టోర్నీలోని అగ్రశ్రేణి జట్లైన ఆస్ట్రేలియా-ఇంగ్లాండ్ హెూరాహెూరీగా తలపడుతున్నాయి. లాహెూర్ లోని గడాఫీ స్టేడియం వేదికగా ఈ పోరు సాగుతోంది. ఈ మ్యాచ్ లో ఎలాగైనా గెలిచి అడుగు ముందుకు వేయాలని ఇరు జట్లు పట్టుదలతో ఉ న్నాయి. అయితే ఈ మ్యాచ్ టాస్ సమయంలో ఓ చిన్న తప్పిదం జరిగింది. సాధారణంగా మైదానంలో



ఆడుతోన్న మ్యాచ్ ప్లేయర్లు.. ఆట ప్రారంభానికి ముందు తమ దేశ జాతీయ గీతాన్ని ఆలపించడం సంప్రదాయం. అదే సమయంలో ఆయా దేశాల జాతీయ గీతాన్ని బ్యాక్ గ్రౌండ్ లోనూ ప్లే చేస్తుంటారు. కానీ ఆసీస్ - ఇంగ్లాండ్ మ్యాచ్ లో అనుకోకుండా భారత జాతీయ గీతాన్ని ప్లే చేసేశారు. మొదట ఇంగ్లాండ్ జాతీయ గీతాన్ని ప్లే చేయగా.. అనంతరం ఇండియన్ నేషనల్ యాంథమ్ ను ప్లే చేశారు. కానీ ఆ వెంటనే సెకన్ల వ్యవధిలో మళ్లీ ఆస్ట్రేలియా నేషనల్ యాంథమ్ ను ప్లే చేశారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీంతో నెటిజన్లు పాక్ గడ్డపై భారత జాతీయ గీతం అంటూ కామెంట్లు చేస్తున్నారు. కాగా,ఈ మ్యాచ్ లో భాగంగా ముందుగా టాస్ గెలిచిన ఆస్ట్రేలియా జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో ఇంగ్లాండ్ బ్యాటింగ్ కు దిగింది. ప్రస్తుతానికి ఇంగ్లిష్ జట్టు 11 ఓవర్ల సమయానికి 2 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది.

**ఆస్ట్రేలియా తుది జట్టు :**

మ్యాథ్యూ షార్ట్, ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్ (కెప్టెన్), మార్నస్ లబుషేన్, జోష్ ఇంగ్లిస్ (వికెట్ కీపర్), అలెక్స్ కేరీ, గ్లెన్ మాక్స్వెల్, బెన్ ద్వారిషూస్, నాథన్ ఎల్లిస్, ఆడమ్ జంపా, స్పెన్సర్ జాన్సన్

**ఇంగ్లాండ్ తుది జట్టు :**

ఫిలిప్ సాల్ట్, బెన్ డకెట్, జేమీ స్మిత్ (వికెట్ కీపర్), జో రూట్, హ్యారీ బ్రూక్, జోస్ బట్లర్ (కెప్టెన్), లియామ్ లివింగ్ స్టోన్, బ్రైడన్ కార్స్, జోఫ్రా ఆర్చర్, అదిల్ రషీద్, మార్క్ వుడ్

# ఆర్సీబీ వరుస.. విజయాలకు చెక్

## ముంబై ఇండియన్స్ ఉత్కంఠ భరిత విజయం

బ్యూపీఎల్ లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) వరుస విజయాలకు బ్రేక్ పడింది. ఒక్కరోజు విరామం తర్వాత శు క్రవారం ప్రారంభమైన లీగ్ మ్యాచ్ లో ఆర్సీబీపై 4 వికెట్లతో ముంబై ఇండియన్స్ ఉత్కంఠ భరిత విజయం సాధించింది. బెంగళూరులో జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 167 పరుగులు చేసింది. ఎలీసా పెర్రీ విధ్వంసకర ఫిఫ్టీ (43 బంతుల్లో 81, 11 ఫోర్లు, 2 సిక్సర్లు)తో సత్తా చాటింది. అమన్ జ్యోత్ కౌర్ ఆల్ రౌండ్ షో (34 నాటౌట్, 3-22)తో సత్తా చాటడంతో టార్గెట్ ను 19.5 ఓవర్లలో ఆరు వికెట్లకు 170 పరుగులు చేసి పూర్తి చేసింది. బౌలర్లలో జార్తియా వారెహమ్ మూడు వికెట్లతో సత్తా చాటింది. ఆల్ రౌండర్ గా రెండు విభాగాల్లో



రాణించిన అమన్ జ్యోత్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. శనివారం మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ తో యూపీ వారియర్జ్ తలపడతారు. బ్యాటింగ్ ఫస్ట్ చేసిన ఆర్సీబీకీ మంచి ఆరంభం దక్కలేదు. 48 పరుగులకే ఓపెనర్లు స్మృతి మంధాన , డాని వ్యాట్ వికెట్లను కోల్పోయింది. ఈ దశలో పించ్ హిట్టర్ గా బరిలోకి దిగిన పెర్రీ.. ఆద్యంతం బౌండరీలతో ఆకట్టుకుంది. 11 ఫోర్లు, 2 సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లను ఓ ఆటాడుకుంది. దీంతో 30 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. పెర్రీతో పాటు రిచా ఘోష్ (28) ఫర్వాలేదనిపించగా, మిగతా బ్యాటర్లు అంతా సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. తాను ఉన్నంత వరకు స్కోరు బోర్డును పరుగులెత్తించిన పెర్రీ.. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ ఐదో బంతికి ఔటయ్యింది. బౌలర్లలో షబ్నిం ఇస్మయిల్, నాట్ స్కివర్ బ్రంట్, హీలీ మాథ్యూస్, సంస్కృతి గుప్తా తలో వికెట్ సాధించారు. కీలకమైన మ్యాచ్ లో ముంబై కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ (38 బంతుల్లో 50, 8 ఫోర్లు, 1 సిక్సర్) రాణించింది. ఓపెనర్లు యస్తిక భాటిక, హీలీ మథ్యూస్ విఫలమైనా బ్రంట్ (21 బంతుల్లో 42, 9 ఫోర్లు) తో కలిసి జట్టును నడిపించింది. ఆరంభంలో యాంకర్ రోల్ పోషించిన హర్మన్.. స్ట్రైక్ ఎక్కువగా బ్రంట్ కి ఇచ్చింది. దీంతో బ్రంట్ వేగంగా ఆడి బౌలర్లపై ఒత్తిడి పెంచింది. తను ఔటయ్యాక గేర్ మార్చి 36 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. అయితే టార్గెట్ కు సమీపంచిన దశలో కీపర్ క్యాచ్ ఇచ్చి అనూహ్యంగా హర్మన్ ఔటయ్యింది. ఈ దశలో అమన్ జ్యోత్ చివరికంటా నిలిచి జట్టును విజయ తీరాలకు చేర్చింది. స్లో ఓవర్ రేట్ కారణంగా చివరి ఓవర్లో ఒక ఫీల్డర్ సర్కిల్ లోపలే ఉండటం కూడా ముంబైకి కలిసొచ్చింది. బౌలర్లలో కిమ్ గార్త్ కు రెండు, ఏక్తా బిస్త్ కు ఒక వికెట్ లభించింది.

# నేను క్రికెటర్‌ని క్యూరేటర్ కాదు!

## కెప్టెన్ రోహిత్ శర్మ కీలక వ్యాఖ్యలు

భారత క్రికెట్ జట్టు 2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో దూసుకుపోతుంది. బంగ్లాదేశ్‌పై తొలి మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో



విజయం సాధించిన తర్వాత, కెప్టెన్ రోహిత్ శర్మ జట్టు ప్రదర్శన గురించి తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ముఖ్యంగా, వైస్ కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ అద్భుతమైన సెంచరీ చేసి జట్టును విజయ తీరాలకు చేర్చాడు. మైదానం నెమ్మదిగా ఉండటం, వికెట్లు పడిపోవడం లాంటి ఒత్తిడులను ఎదుర్కొంటూ గిల్ 129 బంతుల్లో 101 పరుగులు చేసి నిలదొక్కుకున్నాడు. అతనికి తోడుగా కెఎల్ రాహుల్ 41 పరుగులతో జట్టును గెలుపు వైపు నడిపించాడు. రాహుల్ తన శాంతస్వభావంతో వికెట్ కీపర్‌గా ఎంపికకు న్యాయం చేశాడు. భారత్-పాకిస్థాన్ మ్యాచ్ గురించి మీడియా ప్రశ్నించగా, రోహిత్ శర్మ వ్యంగ్యంగా స్పందించాడు. “నేను క్యూరేటర్‌ను కాదు. పిచ్ ఎలా ఉంటుందో చెప్పలేను. కానీ, మేము ప్రస్తుతం పరిస్థితులకు బాగా అలవాటు పడ్డాం” అని అన్నాడు. కెప్టెన్ రోహిత్ మాట్లాడుతూ, “మా డ్రెస్సింగ్ రూమ్‌లో అనుభవం చాలా ఉంది. ఎలాంటి పరిస్థితినైనా ప్రశాంతంగా ఎదుర్కొనే ధైర్యం మన జట్టులో ఉ ంది. గిల్ తన స్థాయిని మరోసారి నిరూపించాడు. అతను చివరి వరకు నిలబడి జట్టును గెలిపించడం గొప్ప విషయం” అని చెప్పాడు. మహ్మద్ షమీ ఐసీసీ ఈవెంట్లలో 5-53 వికెట్లతో భారతదేశానికి కీలక ఆటగాడిగా మారాడు. అతని ప్రదర్శనపై రోహిత్ ప్రశంసలు కురిపిస్తూ, “షమీ మనకు ఎన్నో మ్యాచ్‌ల్లో విజయాన్ని అందించాడు. అతనికి అనుభవం ఉంది, మనకు అవసరమైన సమయంలో ముందుకు వచ్చి సమర్థవంతంగా బౌలింగ్ చేస్తాడు” అని చెప్పాడు. భారత సెలెక్టర్లు కొన్ని ఆసక్తికర నిర్ణయాలు తీసుకున్నారు. రిషబ్ పంత్‌ను బెంచ్‌లో ఉంచడం, అర్ష్‌దీప్‌ను పక్కన పెట్టడం లాంటి నిర్ణయాలు విమర్శలకు గురయ్యాయి. అతుల్ వాసన్ మాట్లాడుతూ, “రిషబ్ పంత్‌ను విస్మరించడం నాకు ఆశ్చర్యంగా ఉ ంది. ఇంగ్లాండ్ సిరీస్‌లో అతన్ని పక్కన పెట్టిన విధానం సరికాదు. ఇక అర్ష్‌దీప్ గురించి మాట్లాడితే, అతను భారత జట్టుకు ఒక ఎడమచేతి సీమర్‌గా మేలైన ఎంపిక. అతనికి చిన్న గాయాలు ఉన్నా, పూర్తిగా ఫిట్ అయితే నేను అతన్ని తీసుకుంటాను” అని చెప్పాడు. బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ హెుస్సేన్ శాంటో తమ జట్టు మొదటి పవర్‌ప్లేలో ఐదు వికెట్లు కోల్పోవడం మ్యాచ్‌ను దెబ్బతీసిందని ఒప్పుకున్నాడు. అయితే, హ్రిడోయ్ సెంచరీ, జాకర్ అలీ 68 పరుగులు చేయడంతో పునరాగమనం సాధించినట్లు చెప్పాడు. “మేము కొన్ని ఫీల్డింగ్ తప్పిదాలు చేశాం, క్యాచ్‌లు వదిలేశాం. ఇది భారత్‌ను ముందుకు నెట్టింది” అని చెప్పాడు. భారత జట్టు తమ గెలుపు ర్ళిత్యాన్ని కొనసాగిస్తూ ఛాంపియన్స్ ట్రోఫీలో బలమైన ప్రదర్శన ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. రోహిత్ శర్మ, గౌతమ్ గంభీర్ లీడర్‌షిప్‌పై సవాళ్లు ఉన్నప్పటికీ, ఈ టోర్నమెంట్‌లో వారి ప్రదర్శనే వారి భవిష్యత్తును నిర్ణయించనుంది.



2025 ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్- పాకిస్థాన్ మ్యాచ్ కోసం క్రికెట్ అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఆదివారం జరగనున్న ఈ మ్యాచ్‌కు దుబాయ్ వేదిక కానుంది. అయితే ఈ మ్యాచ్ నేపథ్యంలో కెప్టెన్ రోహిత్ శర్మపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇటీవల ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో ఫామ్‌లోకి వచ్చిన హిట్‌మ్యాన్ బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో దూకుడుగా ఆడి ఆకట్టుకున్నాడు. దీంతో రోహిత్‌పై మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ ఇంట్రెస్టింగ్ స్టేట్‌మెంట్ ఇచ్చాడు. రోహిత్ తన ఫామ్‌ను కొనసాగించాలని, అతడు క్రీజులో కుదురుకుంటే ఈజీగా సెంచరీ బాదేయగలడని అన్నాడు.‘రోహిత్ శర్మ తన ఫామ్‌ను కొనసాగిస్తే కేవలం 60 బంతుల్లోనే సెంచరీ బాదేస్తాడు. అతడి ఆటతీరు అలా ఉంటుంది. ఒక్కసారి క్రీజులో కుదురుకున్నాడంటే అంతే ఇక. కేవలం ఫోర్లు, సిక్స్‌లతోనే పరుగుల వరద పారిస్తాడు. షార్ట్ పిచ్ బంతులను ఆడటంలో అతడు అత్యుత్తమం. అలాగే 145-150 కి.మీ. వేగంతో వచ్చే బంతిని కూడా ఈజీగా ఆడేస్తాడు. చాలా తేలికగా హుక్ చేసి బౌ ండరీగా మారుస్తాడు. ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించే ప్లేయర్. రోహిత్‌తోపాటు విరాట్ కోహ్లీకి ఫామ్‌తో సంబంధమే లేదు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మరీ ముఖ్యంగా వన్డేల్లో వారిద్దరూ మ్యాచ్ విన్నర్లు. రోహిత్ ఇబ్బంది పడుతూనే పరుగులు చేస్తున్నాడు. అదే కాస్త కుదురుకుంటే ప్రత్యర్థికి మరింత ప్రమాదమే’ అని యువీ పేర్కొన్నాడు. ‘ప్రస్తుత టీమ్‌ఇండియాలో ప్రతి ఆటగాడు అద్భుతమైన ప్లేయర్ అని అనడంలో అనుమానమే లేదు. ముఖ్యంగా విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. జట్టు విజయాల్లో గత రెండు దశాబ్దాలుగా ప్రభావం చూపిస్తున్నారు. ఒకవేళ వాళ్లిద్దరు త్వరగా ఔటయ్యారంటే టీమ్‌ఇండియా డ్రెస్సింగ్ రూమ్‌లో ఆందోళన పరిస్థితి ఉంటుంది. అలా అని మిగతా ఆటగాళ్లు సరిగ్గా ఆడరని కాదు’‘పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ అజామ్ పెవిలియన్ చేరినా, మా జట్టులోనూ ఇలాంటి పరిస్థితే ఉంటుంది. ప్రత్యర్థి బౌలర్లకు అప్పుడు మరింత ఉత్సాహం వస్తుంది. రోహిత్, విరాట్‌ను వీలైనంత తొందరగా ఔట్ చేయగలిగితేనే పాక్‌కు అడ్వాంటేజ్’ అని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ ఇంజమామ్ ఉల్ హక్ వ్యాఖ్యానించాడు.

# కెప్టెన్ రోహిత్ శర్మపై భారీ అంచనాలు

## క్రీజులో కుదురుకుంటే ఈజీగా సెంచరీ

## రోహిత్‌పై మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ కామెంట్స్

# ఛావా సినిమాతో భారీ పాపులారిటీ.. ఏకంగా రెహమాన్ తో డ్యూయెట్ సాంగ్..ఎవరీ వైశాలి..!

'ఛావా'.. ఫిబ్రవరి 14వ తేదీన వాలెంటైన్స్ డే సందర్భంగా విడుదలైన హిస్టారికల్ యాక్షన్ మూవీ ఛావా. ప్రముఖ బాలీవుడ్ స్టార్ హీరో విక్కీ కౌశల్ , నేషనల్ క్రష్ రష్మిక మందన్న జంటగా వచ్చిన ఈ సినిమా విడుదలైన నాలుగు రోజుల్లోనే దాదాపు రూ.150 కోట్లకు పైగా కలెక్షన్లు వసూలు చేసి సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది.హాలిడే , వర్కింగ్ డే అని తేడా లేకుండా ప్రతి ఒక్కరు కూడా ఈ సినిమాను బాగా ఆదరిస్తున్నారు. ప్రముఖ డైరెక్టర్ లక్ష్మణ్ ఉటేకర్ .దర్శకత్వం వహించిన ఈ సినిమా మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ వారసుడు.. శంభాజీ మహారాజ్ జీవిత కథ ఆధారంగా రూపొందింది. ఇందులో శంభాజీ మహారాజ్ గా విక్కీ కౌశల్, ఆయన భార్య ఏసు భాయి పాత్రలో రష్మిక మందన్న ఒదిగిపోయి నటించారు. ముఖ్యంగా ఈ సినిమా కోసం విక్కీ కౌశల్ కత్తి సాము నేర్చుకోవడమే కాకుండా 100 కేజీల బరువు పెరిగి మరీ సాహసం చేశారు.

ఇదిలా ఉండగా ఈ సినిమా నుండి విడుదలైన "ఆయా రే తూఫాన్" పాట ఎంత సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎక్కడ చూసినా ప్రస్తుతం ఈ పాటే వినిపిస్తోంది. మరి ఈ పాటను పాడింది ఎవరో కాదు మరాఠీ సింగర్ వైశాలి సామంత్ . ఈమె ఇప్పటివరకు చాలా సూపర్ హిట్ పాటలు పాడారు. అయితే ఈసారి ఈమె ఆయా రే తుఫాన్ అనే పాటను ఆలపించి ఊహించని పాపులారిటీ దక్కించుకుంది. ఇక ఈ పాటను ఏ. ఆర్.రెహమాన్ స్వరపరిచారు. ఇర్షాద్ కమిల్, క్షితిజ్ పట్వర్ధన్ రచించారు. అయితే ఇక్కడ ఆశ్చర్యపరిచే విషయం ఏమిటంటే .. ఈ పాట పాడే సువర్ణ అవకాశం గాయని వైశాలి సామంత్ కి లభించడమే. ఏఆర్ రెహమాన్ స్వరం అద్భుతంగా ఉంటుంది. వైశాలి తన వాయిస్ తో భావోద్వేగాన్ని మరింత పెంచింది .ఈ పాట విన్న ఆడియన్స్ కి గూస్ బంప్స్ తెప్పిస్తోంది. ఈ పాట చిత్రం నుండి విడుదలైన కొద్ది గంటల్లోనే యూట్యూబ్లో మిలియన్ల వ్యూస్ రాబట్టి సంచలనం సృష్టించింది. ఈ పాట చూస్తుంటే ఛాతి గర్వంతో నిండిపోతుంది.

ఇక ఇదే విషయంపై వైశాలి మాట్లాడుతూ.." ఏ ఆర్ రెహమాన్ తో పాడే అవకాశం వచ్చినందుకు ఎప్పటికీ నేను కృతజ్ఞురాలై ఉంటాను. ఛావా సినిమాలోని ఈ పాట నా సంగీత ప్రయాణానికి ఎంతో ముఖ్యమైనది. ఆయన నా గానం పై నమ్మకం ఉంచి నాకు అవకాశాన్ని కల్పించారు. ఈ పాట అటు ఆడియన్స్ నుంచి విపరీతమైన రెస్పాన్స్ అందుకుంటుంది. ఇక ఆడియో లాంచ్ సందర్భంగా ఏఆర్ రెహమాన్ తో ప్రత్యక్ష ప్రసారం చేయడం నాకు ఒక గొప్ప అవకాశం.ఆయనకు హృదయపూర్వక



ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను" అంటూ వైశాలి తెలిపింది. మొత్తానికి అయితే వైశాలి ఈ పాటతో ఊహించని విజయాన్ని సొంతం చేసుకుందని చెప్పవచ్చు. అందులోనూ సంగీత దిగ్గజ దర్శకుడు, రెండు సార్లు ఆస్కార్ సొంతం చేసుకున్న రెహమాన్ తో పాట పాడే అవకాశం అంటే ఇక ఆమె జీవితం ధన్యమైందని అటు అభిమానులు కూడా కామెంట్లు చేస్తూ ఉండడం గమనార్హం.



# మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' సెకండ్ ఎడిషన్ లాంచ్

తెలుగు సినిమాపై, ఆ మాటకొస్తే భారతీయ సినిమాపై తనదైన ముద్ర వేసిన హీరో మెగాస్టార్ చిరంజీవి. చిత్రసీమలోకి రావడానికి ఎంతో మందికి ఆయన స్ఫూర్తిగా నిలిచారు. అటువంటి స్ఫూర్తిప్రదాత చేతుల మీదుగా 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' బుక్ సెకండ్ ఎడిషన్ లాంచ్ జరిగింది.

ప్రపంచ సినిమాపై తనదైన ముద్ర వేసిన దర్శకుల్లో ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ ఒకరు. సస్పెన్స్ థ్రిల్లర్స్ తీసే దర్శక రచయితలకు ఆయన సినిమాలు ఇన్స్పిరేషన్. ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ 125వ జయంతి సందర్భంగా, అలానే ఆయన తొలి సినిమా విడుదలై వందేళ్లు అయిన సందర్భంగా హిచ్‌కాక్ సినీ జీవితంపై 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' పేరుతో సీనియర్ జర్నలిస్ట్, సినీ రచయిత పులగం చిన్నారాయణ – ఐఆర్‌టిఎస్ అధికారి రవి పాడితో కలిసి పుస్తకం తీసుకొచ్చారు. డిసెంబర్ 18న ఫస్ట్ కాపీ విడుదలైంది. ఐదు రోజుల్లో పుస్తకాలు అన్నీ అమ్ముడు కావడంతో సరికొత్త చేర్పులతో సెకండ్ ఎడిషన్ లాంచ్ చేశారు.

'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' బుక్ చూసిన చిరంజీవి ఆసక్తి కనబరిచారు. తాను పుస్తకం చదువుతానని తెలిపారు. తెలుగులో ఇటువంటి పుస్తకం తీసుకు రావడం అభినందనీయం అని ప్రశంసించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ... "హిచ్ కాక్ సినిమాలు కొన్నిటిని నేను కాలేజీ చదువుతున్న రోజుల్లో చూశాను. ఈ పుస్తకాన్ని ఖాళీ సమయం దొరికినప్పుడల్లా పది పదిహేను రోజుల్లో చదివేస్తాను. ప్రపంచ సినిమా చరిత్రలో దిగ్గజ దర్శకుడి గురించి తెలుగులో బుక్ రావడం అభినందనీయం. ఇలాంటి పుస్తకాలను పులగం చిన్నారాయణ, రవి పాడి మరిన్ని సంకల్పించాలి" అని అన్నారు. ప్రసిద్ధ నవలా రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తి ఈ పుస్తకానికి ముందుమాట రాయడంతో పాటు ఆయన కెరీర్ లో తొలిసారి ఒక పుస్తకాన్ని ప్రశంసిస్తూ పాడ్ కాస్ట్ విడుదల చేశారు. అలాగే సంచలన దర్శకులు రామ్ గోపాల్ వర్మ కూడా ముందుమాట రాశారు. 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్'లో 45 మంది దర్శకులు, ఏడు మంది రచయితలు, పది మంది జర్నలిస్టులు రాసిన మొత్తం 62 వ్యాసాలు ఉన్నాయి. ఇటీవల జరిగిన హైదరాబాద్ లిటరేచర్ ఫెస్టివల్ (HLF)లో ప్రముఖ బాలీవుడ్ నటుడు, దర్శకుడు అమోల్ పాలేకర్ ప్రశంసలను అందుకున్నారు పులగం చిన్నారాయణ, రవి పాడి.

# దిల్ రాజు చేతుల మీదుగా 'బరాబర్ ప్రేమిస్తా' నుంచి 'రెడ్డి మామ' అంటూ సాగే మాస్ సాంగ్ విడుదల

ఆటిట్యూడ్ స్టార్ చంద్రహాస్ నటిస్తున్న కొత్త సినిమా 'బరాబర్ ప్రేమిస్తా'. ఈ చిత్రానికి సంపత్ రుద్ర దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను కాకర్ల సత్యనారాయణ సమర్పణలో సిసి క్రియేషన్స్, ఎవిఆర్ మూవీ వండర్స్ బ్యానర్లపై గెడా చందు, గాయత్రి చిన్ని, ఎవిఆర్ నిర్మిస్తున్నారు. మిస్ ఇండియా ఫైనలిస్ట్ మేఘనా ముఖర్జీ హీరోయిన్ గా నటిస్తోంది. అర్జున్ మహీ ("ఇష్టంగా" ఫేమ్) ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఇది వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, టీజర్ ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌లో అంచనాల్ని పెంచేశాయి.

తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ మాస్ బీట్ సాంగ్‌ను ప్రముఖ నిర్మాత దిల్ రాజు రిలీజ్ చేశారు. 'రెడ్డి మామ' అంటూ హుషారుగా సాగే ఈ పాటను సురేష్ గంగుల రచించారు. నకాష్ అజిజ్, సాహితి చాగంటి ఆలపించగా.. ఆర్ఆర్ ధృవణ్ మంచి ఊపున్న బీట్‌ను అందించారు. ఇన్ స్టంట్ చార్ట్ బస్టర్‌గా ఈ పాట ఉందని దిల్ రాజు మెచ్చుకున్నారు. చిత్రయూనిట్‌కు ఆయన ఆల్ ది బెస్ట్ తెలిపారు.



# మహేష్ బాబు పి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న #RAPO22 చిత్రీకరణలో హీరో రామ్ పోతినేనిని కలిసిన ఏపీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్

ఉస్తాద్ రామ్ పోతినేని కథానాయకుడిగా యంగ్ అండ్ టాలెంటెడ్ మహేష్ బాబు పి దర్శకత్వంలో టాప్ ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ ఓ సినిమా నిర్మిస్తోంది. నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మాతలు. హీరోగా రామ్ 22వ చిత్రమిది. అందుకని #RAPO22ను వర్కింగ్ టైటిల్‌గా వ్యవహరిస్తున్నారు. ఇటీవల రాజమండ్రిలో సెకండ్



షెడ్యూల్ మొదలైంది. రాజమండ్రిలో జరుగుతున్న #RAPO22 చిత్రీకరణకు ఏపీ సినిమాటోగ్రఫీ, టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ విచ్చేశారు. రామ్ పోతినేనిని కలిసి ముచ్చటించారు. సుమారు గంట సేపు చిత్రీకరణలో ఆయన ఉన్నారు. రామ్ డ్యాన్సులు తనకు ఇష్టమని ఏపీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రబ్బరు స్ప్రింగ్ తరహాలో రామ్ అద్భుతంగా డ్యాన్స్ చేస్తారన్నారు. చిత్ర బృందంతోనూ ముచ్చటించిన కందుల దుర్గేష్... ఏపీలో మంచి పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, గోదావరి నదీ తీర ప్రాంతాల్లో చిత్రీకరణలు చేసిన ఘన విజయాలు సాధించాయని, ఈ సినిమా కూడా ఘన విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. రాజమండ్రిలో రెండు వారాల క్రితం సినిమా సెకండ్ షెడ్యూల్ షూటింగ్ మొదలైంది. చిత్రీకరణకు వెళ్లిన రామ్ పోతినేనికి ఎయిర్ పోర్టులో దిగిన తర్వాత ఘన స్వాగతం లభించింది. అరటి గెలలతో తయారు చేసిన భారీ గజమాలతో అభిమానులు వెల్కమ్ చెప్పారు.

## ఓటిటికి ముందే టీవిల్లో సక్రాంతికి వస్తున్నాం మూవీ

విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ సంక్రాంతికి వస్తున్నాం సినిమాఓటిటికి ముందే టీవీలో ప్రేక్షకులను అలరించనుంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించగా.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటించారు. ఈ సంక్రాంతి పండుగకు ప్రేక్షకుల ముందుకు వచ్చిన బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకుంది. అయితే ఈ సినిమా ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఓటీటీ లవర్స్‌కి షాక్ ఇస్తూ.. ఒక ప్రకటన విడుదల చేసింది.

# పతంగ్' నుంచి ట్రెండీ సాంగ్ హవ.. హవ.. లిరికల్ వీడియో విడుదల

ఇప్పటి వరకు ఎన్నో స్పోర్ట్స్ డ్రామాలు ప్రేక్షకులు చూసి వుంటారు. కాని అందరిలో ఎంతో మమేకమైన పతంగుల పోటీతో రాబోతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్ పతాకంపై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు. నాని బండ్రెడ్డి క్రియేటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రంలో ఇన్‌స్టాగ్రమ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమప రన్నరప్ ప్రణవ్ కౌశిక్‌తో పాటు వంశీ పూజిత్ ముఖ్యతారలుగా నటిస్తున్నారు. మరికొంత మంది నూతన నటీనటులతో పాటు ప్రముఖ సింగర్, నటుడు ఎస్‌పీ చరణ్ ఈ చిత్రంలో కీలకమైన పాత్రలో కనిపించబోతున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ చిత్రం నుంచి ట్రెండీ సాంగ్ హవ హవ అనే లిరికల్ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. సంగీత దర్శకుడు జోస్ జిమ్మీ స్వరాలు సమకూర్చిన ఈ పాటకు ఆయనే సాహిత్యం సమకూర్చి



ఆలపించాడు. సినిమాలో ఈ సాంగ్ ఎంతో యూత్‌ఫుల్‌గా నేటి ట్రెండీగా ఉంటుంది. ఇక చిత్రం గురించి నిర్మాతలు మాట్లాడుతూ ఈ చిత్రం నుంచి ఇటీవల విడుదల చేసిన పాటలకు చిత్ర టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. ఈ సినిమా థియేటర్‌లో యూత్‌ఫెస్టివల్‌లా వుంటుంది. కొత్తవాళ్లతో చేసిన మా సినిమా కొత్తగా వుండటంతో పాటు చాలా పెద్ద సినిమా క్వాలిటీతో వుంటుంది అన్నారు. ఈ సినిమాకు కథే హీరో. ఈ చిత్రానికి జోస్ జిమ్మి అద్భుతమైన పాటలు ఇచ్చాడు. ఇప్పటి వరకు విడుదల చేసిన అన్ని పాటలకు మంచి స్పందన వచ్చింది. త్వరలోనే విడుదల తేదిని ప్రకటిస్తాం. తప్పకుండా మా పతంగ్ చిత్రం అన్నివర్గాల వారిని అలరిస్తుందనే నమ్మకం వుంది. కొత్త కంటెంట్‌ను ఆదరించే తెలుగు ప్రేక్షకులు మా ప్రయత్నాన్ని తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం వుంది' అన్నారు.

# ప్రముఖ దర్శకుడు హరీశ్ శంకర్ చేతుల మీదుగా "అందెల రవమిది" సినిమా టీజర్ రిలీజ్

ఇంద్రాని దవులూరి ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న సినిమా అందెల రవమిది. ఈ చిత్రాన్ని శివ భట్టిప్రోలు సమర్పణలో నాట్యమార్గం ప్రొడక్షన్స్ ఇంద్రాని దవులూరి నిర్మిస్తున్నారు. విక్రమ్ కొల్లూరు, తనికెళ్ల భరణి, ఆదిత్య మీనన్, జయలలిత, ఆది లోకేష్, ఐడీపీఎల్ నిర్మల కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా విడుదలకు ముందే డీసీ సౌత్ ఫిలిం ఫెస్టివల్ లో బెస్ట్ డెబ్యూ ఫిలిం, ఇండియా ఇండిపెండెంట్ ఫిలిం ఫెస్టివల్ లో బెస్ట్ వుమెన్ మేడ్ ఫిలిం, గ్లోబల్ ఇండియా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ లో బెస్ట్ డైరెక్టర్ గా పలు పురస్కారాలు గెల్చుకోవడం విశేషం.

అందెల రవమిది సినిమా టీజర్ ను ప్రముఖ దర్శకుడు హరీశ్ శంకర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ హరీశ్ శంకర్ మాట్లాడుతూ – ఇంద్రాని దవులూరి గారి కుటుంబంతో నాకు మంచి అనుబంధం ఉంది. వారు అమెరికాలో స్థిరపడ్డారు. మన కళలు, సంస్కృతీ సంప్రదాయాల మీద ఇంద్రానికి గారికి ఎంతో మక్కువ. ఆ ఇష్టంతోనే యూఎస్ లో పిల్లలకు క్లాసికల్ డ్యాన్స్ లు నేర్పిస్తుంటారు. హద్దులు దాటుతున్న కమర్షియల్ ఎలిమెంట్స్ తో సినిమాలు వస్తున్న ఈ ట్రెండ్ లో ఎలాంటి లాభాపేక్ష లేకుండా మన కల్చర్ ను తెలియజెప్పాలనే ప్రయత్నంతో అందెల రవమిది చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమా తెరకెక్కించడంలో ఇంద్రాని గారికి సాయి, సురేష్ ఎంతో సహకరించారు. అలాగే భరణి గారు ఓ కీలక పాత్ర పోషించారు. ఇలాంటి మంచి చిత్రానికి మనమంతా సపోర్ట్ చేయాలి. అన్నారు.

నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ – సాగర సంగమం, శంకరాభరణం వంటి మూవీస్ వచ్చిన తర్వాత చాలామంది మన సంగీతం, నృత్యం నేర్చుకోవడం మొదలుపెట్టారు. అలాంటి ఇంపాక్ట్ కలిగించాయి ఆ సినిమాలు. ఇంద్రాని నాకు కూతురు లాంటిది. ఆమె క్లాసికల్ డ్యాన్సర్. భరతనాట్యం నేపథ్యంగా అందెల రవమిది సినిమా చేసింది. సినిమా నిర్మించడం అంటే ఒకటి కాదు వంద పెళ్లిల్లు చేసినంత కష్టం. చిన్న సినిమాకు ఉండే అలాంటి కష్టాలన్నీ పడి ఇంద్రాని ఈ సినిమా పూర్తి చేసింది. మన కళల్ని తెలియజేసేందుకు ఇంత శ్రమకోర్చి అందెల రవమిది సినిమా రూపొందించిన ఇంద్రానికి నా అభినందనలు చెబుతున్నా. ఈ సినిమాకు మనవంతు సహకారం అందించడమే మనమంతా చేయాల్సిన బాధ్యత. అన్నారు.దర్శకుడు కృష్ణ చైతన్య మాట్లాడుతూ – ఇంద్రాని గారు నాకు ఎప్పటినుంచో పరిచయం. కూచిపూడి, భరతనాట్యం నేర్చుకునే వాళ్లు శారీరకంగా



ఎలా ఒత్తిడికి లోనవుతారు, వాళ్లు ఎలా స్ట్రాంగ్ గా కావాలనే విషయంపై పుస్తకాన్ని రాశారు. మన కళల్ని బతికించేందుకు ఆమె చేస్తున్న ప్రయత్నం అభినందనీయం. ఈ సినిమా కోసం ఇంద్రాని గారు వారి టీమ్ సాయి, సురేష్ ఎంతో కష్టపడ్డారు. హరీశ్ , భరణి గారు ఈ సినిమా కోసం తమ వంతు సపోర్ట్ అందిస్తున్నారు. అందెల రవమిది సినిమాకు మీరు కూడా సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నా. అన్నారు. నటుడు ఆదిత్య మీనన్ మాట్లాడుతూ – ఇంద్రాని దవులూరి నాకు 15ఏళ్లుగా తెలుసు. మేమిద్దరం కలిసి మలయాళ మూవీలో నటించాం. ఆమె యామినీ శర్మ అనే స్క్రీన్ నేమ్ తో మూవీస్ చేశారు. ఆ తర్వాత పెళ్లి చేసుకుని యూఎస్ వెళ్లి అక్కడ మన కళల్ని ప్రోత్సహిస్తున్నారు. భరణి గారు చెప్పినట్లు ఇటీవల మన కళల్ని ప్రోత్సహిస్తూ వస్తున్న చిత్రమిదే. ఈ సినిమాలో నేను ఒక ఇంపార్టెంట్ రోల్ లో కనిపిస్తాను. సురేష్, సాయి అండ్ టీమ్ అంతా ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డారు. ఇంద్రాని గారు చేసిన ఈ ప్రయత్నం విజయవంతం కావాలని ఆశిస్తున్నా. అన్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సురేష్ ఉత్తరాది మాట్లాడుతూ – మా మూవీకి సపోర్ట్ చేసేందుకు వచ్చిన హరీశ్ గారికి, భరణి గారికి, కృష్ణ చైతన్య గారికి థ్యాంక్స్. మన కళల్ని బతికించేందుకు ఇంద్రాని గారు చేస్తున్న ప్రయత్నం అభినందనీయం. మాకు మీ అందరి సపోర్ట్ దక్కుతుందని ఆశిస్తున్నాం. అన్నారు

నటి, ప్రొడ్యూసర్ డైరెక్టర్ ఇంద్రాని దవులూరి మాట్లాడుతూ – భరతనాట్యం 2 వేల ఏళ్ల నాటి నృత్య కళ. ఈ కళను బతికించుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా మన కళల్ని తెలియజేయాలని ఉద్దేశ్యంతో ఈ సినిమాను ఎంతో శ్రమకోర్చి రూపొందించాం. మా టీమ్ అంతా బాగా సపోర్ట్ చేశారు. వెస్ట్రన్ డ్యాన్స్ లు 30 ఏళ్ల తర్వాత చేయలేరు. కానీ భరతనాట్యం చనిపోయే వరకు చేయొచ్చు. అలాంటి ప్రత్యేకత మన సంప్రదాయ నృత్యరీతులకు ఉంది. మా మూవీకి డీసీ సౌత్ ఫిలిం ఫెస్టివల్ లో బెస్ట్ డెబ్యూ ఫిలిం, ఇండియా ఇండిపెండెంట్ ఫిలిం ఫెస్టివల్ లో బెస్ట్ వుమెన్ మేడ్ ఫిలిం, గ్లోబల్ ఇండియా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ లో బెస్ట్ డైరెక్టర్ గా పలు పురస్కారాలు దక్కాయి. మరికొన్ని ఇంటర్నేషనల్ అవార్డ్స్ స్క్రీనింగ్ లో మా సినిమా ఉంది. అందెల రవమిది చిత్రాన్ని సపోర్ట్ చేస్తున్న హరీశ్ గారికి భరణి గారికి ఆదిత్య మీనన్ గారికి కృష్ణ చైతన్య గారికి థ్యాంక్స్. మీరంతా మన సినిమా అనుకుని సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నా. అన్నారు.

Editor, Printed, Published and Owned by Sudheer Kumar, Printed at Ratna Graphics , # 2-3-703/7, Thirumala Nagar Colony, Opposite : Police Line , Amberpet, Hyderabad-500013, Published At H.NO. 6-3-553/G2, ClassicCourt Anexa, opp: NKM Grand, Erramanzil Colony, Somajiguda, Hyderabad-500038, T.S. E-Mail: info.southindiatimes@gmail.com. ,Contact :9000657700. RNI NO. APTEL/2012/46756